ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

fb/prajasakti
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu
www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 224 | విజయవాడ, సోమవారం 14 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00

హిమాచల్‌లో ఘోరం


- బస్సుపై కొండచరియలు విరిగిపడి 45 మంది మృతి



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని మండి-పఠాన్ కోట్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో కనీసం 45 మంది మరణించారని, పలువురికి గాయాలయ్యాయని అధికారులు చెప్పారు. మండి-పఠాన్ కోట్ 154వ నెంబర్ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులపై పెద్దపెట్టున కొండచరియలు విరిగిపడటంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద వార్త తెలుసుకున్న ముఖ్యమంత్రి వీరభద్రసింగ్ ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మృతుల కుటుంబాలకు రు.5 లక్షల పరిహారం ప్రకటించారు. ప్రస్తుతం జాతీయ విపత్తు సహాయక దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్)కు చెందిన రెండు గాలింపు, సహాయక బృందాలు మండిలీ సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. శనివారం అర్ధరాత్రి సమయంలో మనాలీ, మండి జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఈ బస్సులపై కొండచరియలు విరిగి పడటంతో అవి కొద్ది దూరంలో వున్న 800 అడుగుల లోతులో వున్న లోయలోకి పడిపోయాయి. ఒక బస్సు పూర్తిగా కొండచరియల కింద కూరుకు పోవటంతో దాని జాడలు ఏ మాత్రం కన్పించటం లేదు. చంబా నుండి మండి వస్తున్న ఒక బస్సులో 47 మంది ప్రయాణీకులు వుండగా కాత్రా నుండి మనాలి వెళ్తున్న మరో బస్సులో 8 నుండి పది మంది ప్రయాణీకులు వున్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి వైద్య సహాయం అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న ప్రధాని నరేంద్రమోడీ మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపం తెలియచేశారు. మండి జిల్లాలో కొండచరియలు మిగతా 9లో

అన్ని జిల్లాలు ప్రతిబింబించేలా

ఐకానిక్ టవర్



- 6న లండన్ కింగ్స్ ఆసుపత్రికి శంకుస్థాపన
- టెలీకాన్ఫరెన్స్‌లో సిఎం వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగరంలో నిర్మిస్తున్న ప్రభుత్వ కార్యాలయ సముదాయాల ముఖద్వారం 13 జిల్లాల సంస్కృతిని, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఐకానిక్ టవర్‌ను నిర్మించేందుకు సిఆర్డిఎ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. మంత్రులు, ఉన్నతాధికారులతో ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ గత అనుభవాల దృష్ట్యా అభివృద్ధిని ఒకే చోట కేంద్రీకరించకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు వికేంద్రీకరిస్తున్నామన్నారు. రాజధాని నగరం పరిపాలనా, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా ఉంటుందన్నారు. స్థానికంగా లభ్యమయ్యే సహజ వనరుల ఆధారంగా సర్వతో ముఖాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రాలయసీమను ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కర్నూలులో నెలకొల్పిన వెయ్యి మెగావాట్ల సోలార్ పార్కు ప్రపంచంలోనే మిగతా 9లో

మా డబ్బులొచ్చేదెప్పుడు!

మరో పోరాటానికి సిద్ధమవుతున్న అగ్రిగోల్డ్ బాధితులు

"నా పేరు పైడాడ సత్యనారాయణ. నాది తూర్పుగోదావరి జిల్లా కాకినాడ. ఇరవై ఏళ్లుగా మిక్చర్ బండి పెట్టుకుని, వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నాను. కుటుంబమంతా కష్టపడి సంపాదించిన రెండున్నర లక్షలు అగ్రిగోల్డ్‌లో పెట్టుబడి పెడితే రూ.5 లక్షలు వస్తుందని చెప్పారు. నాకు నలుగురు పిల్లలు. ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఆడపిల్లల పెళ్లి కోసం దాచుకున్న డబ్బు అగ్రిగోల్డ్‌లో పెట్టాను. పెద్దమ్మాయి పెళ్లి సమయానికి డబ్బులు చేతికి రాకపోవడంతో రూ.4 లక్షలు అప్పు చేసి పెళ్లి చేశాను. రెండో అమ్మాయికి ఇంకా పెళ్లి చేయలేదు. పెద్దమ్మాయి పెళ్లి కోసం తెచ్చిన అప్పునకు మూడేళ్లుగా నెలకు రూ.4 వేలు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఇంటి అద్దె రూ.3 వేలు చెల్లిస్తున్నాం. అప్పులకు వడ్డీ చెల్లిస్తూ కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టంగా మారింది. చిన్న పాపకు కడుపులో కాయ రావడంతో ఆపరేషన్‌కు డబ్బులు లేక మరోమారు అప్పు చేసి వైద్యం చేయించాం. ఏం చేయాలో తెలియక మా కుటుంబమంతా ప్రభుత్వం వైపు ఎదురుచూస్తున్నాం" సత్యనారాయణ మాదిరిగా ఇలా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది అగ్రిగోల్డ్ బాధితులు రోడ్డునపడ్డారు.



మోసపోయిన పైడాడ సత్యనారాయణ దంపతులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కష్టపడి సంపాదించిన సొమ్ముకు అధిక వడ్డీ వస్తుందనే ఆశతో అగ్రిగోల్డ్‌లో పెట్టుబడి పెట్టిన వారు కొందరైతే, పుస్తెల తాడు తాకట్టు పెట్టి, ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన సొమ్మును డిపాజిట్ చేసిన వారు మరికొందరు, పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువులు, కుటుంబ అవసరాల కోసం లక్షలాది మంది కోట్లాది రూపాయలు డిపాజిట్ చేశారు. ప్రతిఫలం వస్తుందని ఆశిస్తున్న సమయంలో అగ్రిగోల్డ్ కంపెనీ ఉన్న పళంగా బోర్డు తిప్పేయడంతో లక్షలాది మంది డిపాజిట్‌దారులు రోడ్డునపడ్డారు. లక్ష మంది వరకూ ఏజెంట్లు నిరుద్యోగులవ్వడమే కాకుండా బాధితులుగా మారారు. రెండున్నరేళ్లుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి నివేదించినప్పటికీ మిగతా 9లో

నెరవేరని సీఎం హామీ

అగ్రిగోల్డ్ బాధితులు ఈ ఏడాది మార్చి 6 నుంచి 23 వరకూ విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల సమయంలోనే సీఎం చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా నాలుగు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామని, డిపాజిట్టుదారులకు తిరిగి సొమ్ములు ఇచ్చే ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆత్మహత్యలకు పాల్పడిన వారికి రూ.5 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తానని ప్రకటించారు. సీఎం హామీ ఇచ్చి గత జులై 23కి నాలుగు నెలలు పూర్తయినా బాధితులకు ఒక్క రూపాయి చెల్లించలేదు. చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా చెల్లించలేదు.

'ఫసల్'తో రైతు పైసలా

- ఏడాదైనా దక్కని పంటల బీమా
- రాష్ట్ర సర్కారు చోద్యం

2



ద్వారకా తిరుమల మండలం ఎం.నాగుపల్లి కొత్త కాలనీలో నివాసాలను చుట్టుముట్టిన వర్షపు నీరు

కోస్తాలో భారీ వర్షాలు


- గుంటూరు జిల్లాలో కొన్నిచోట్ల నారుమళ్లు నీటమునక
- మెట్ట, మన్యం ప్రాంతాలకు ఉపశమనం
- 'పశ్చిమ'లో పలుచోట్ల జనజీవనం అస్తవ్యస్తం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి/ యంత్రాంగం

బంగాళా ఖాతంలో ఉత్తర తమిళనాడు వద్ద ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని దీని ప్రభావంతో తమిళనాడు, కోస్తా జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు ఆదివారం వెల్లడించారు. సౌత్ వెస్ట్ బంగాళాఖాతంపై కోస్తా మీదుగా ఆవర్తన ప్రభావంతో కోస్తా జిల్లాల్లో పలు చోట్ల సాధారణ వర్షాలు పడతాయని తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు అన్ని జిల్లాల్లోనూ సాధారణ స్థాయికి చేరుకున్నాయని తెలిపారు.

గుంటూరు జిల్లాలో 57 మండలాలకు గాను ఆదివారం 23 మండలాల్లో వర్షపాతం నమోదైంది. నరసరావుపేటలో అత్యధికంగా 46 మిల్లీమీటర్లు, గుంటూరులో అత్యల్పంగా ఒక మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది. జిల్లాలో మిగతా 9లో

మరో చిన్నారిని మింగిన 'బ్లూవేల్'



కోల్‌కతా : బ్లూవేల్ ఆన్‌లైన్ గేమ్ మరో చిన్నారి ప్రాణాలు తీసింది. ఈ గేమ్ బారిన పడి 10వ తరగతి విద్యార్థి ఒకరు ప్రాణాలు తీసుకున్న సంఘటన పశ్చిమ బెంగాల్‌లో శనివారం జరిగింది. రాష్ట్రంలోని మిడ్నాపూర్ జిల్లాలోని ఆనందపూర్ పట్నంలో 10వ తరగతి చదువుతున్న 14 ఏళ్ల అంకన్ తన ముఖానికి ప్లాస్టిక్ కవర్ చుట్టుకుని, మెడ చుట్టూ నైలాన్ త్రాడు గట్టిగా బిగించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంకన్ తండ్రి చెబుతున్న వివరాల ప్రకారం శనివారం పాఠశాల నుంచి తిరిగివచ్చిన తరువాత అంకన్‌ను అతని తల్లి భోజనం చేయమని పిలిచింది. అయితే అతడు స్నానం చేసిన తరువాత తింటానని చెప్పి బాత్‌రూమ్‌కు వెళ్లాడు. అయితే అంకన్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో బాత్‌రూమ్‌లో చూడగా విగత జీవిగా అతను పడి వున్నాడు. వెంటనే అంకన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతడు ప్రాణాలు విడిచినట్లు వైద్యులు తెలిపారు. అంకన్ చివరిసారిగా బ్లూవేల్ గేమ్ ఆడుతూ కనిపించినట్లు సమాచారం. కాగా, వ్యక్తుల ప్రాణాలు బలిగొనడం బ్లూవేల్ గేమ్‌కు ఇదే తొలిసారి కాదు. యూరప్, రష్యాల్లో ఇప్పటివరకూ 150 మంది వరకూ మృతి చెందారు. అలాగే ఇండోర్‌లో 13 ఏళ్ల బాలుడు పాఠశాల బిల్డింగ్ 3వ అంతస్తు నుంచి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఈ నెల 1న ముంబయిలో 14 ఏళ్ల బాలుడు తన ఇంటిపై నుంచి దూకబోయాడు. ఈ బ్లూవేల్ గేమ్‌లో మొదట పేపర్ మీద వేల్ బొమ్మ గీయడంతో ప్రారంభమవుతుంది. తరువాత ఆటగాళ్లు తమ శరీరంపై వేల్ బొమ్మ గీసుకోమని కోరుతుంది. తరువాత ఒంటరిగా హర్రర్ సినిమాలు చూడడం వంటి పనులు వుంటాయి. ఫైనల్ చాలెంజ్‌లో ఆత్మహత్యకు ప్రయత్నించడం వంటి టాస్క్‌లు కూడా వుంటాయి.



చిరుత కుప్పకూలింది!

ట్రాక్ కన్నీళ్లు పెట్టింది 12

ప్రభుత్వానిదే బాధ్యత

- గోరక్‌పూర్ పిల్లల మరణంలో నిలువెత్తు నిర్లక్ష్యం
- ఆక్సిజన్‌కు ఏడు నెలలుగా అందని నిధులు
- రూ.60 లక్షలకు పైగా బకాయిలు



గోరఖ్‌పూర్/లక్నో: గోరఖ్‌పూర్‌లోని బిఆర్‌డి వైద్య కళాశాల ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక చిన్నారులు మరణించిన ఘటనకు పూర్తి బాధ్యత యుపి ప్రభుత్వానిదేనని వెల్లడౌతోంది. గత ఏడు నెలల నుంచి ఆక్సిజన్ సరఫరాకు సరైన బిల్లులు చెలించని కారణంగా హాస్పిటల్‌కు క్రమక్రమంగా ఆక్సిజన్ సిలిండర్ల సరఫరా తగ్గిపోయింది. దీంతో పిల్లలకు సరైన ఆక్సిజన్ అందలేదు. ఈ కారణంగానే వరుసగా పిల్లల మరణాలు సంభవించాయి. ఆక్సిజన్ సరఫరాకు నిధులు కావాలని హాస్పటల్ వర్గాల నుండి ప్రభుత్వానికి నివేదికలు వెళ్లినా...అటువైపు నుంచి ఎటువంటి స్పందనా లేదు. ప్రతిరోజూ చనిపోతున్న పిల్లలను చూస్తూ ఉండిపోయారే తప్ప ఆక్సిజన్ సరఫరాకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఈ ఘటన దేశవ్యాప్తంగా వెలుగులోకి రావడానికి మిగతా 8లో

ఉన్నత స్థాయి న్యాయ విచారణ

- సిపిఎం డిమాండ్

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - న్యూఢిల్లీ: గోరఖ్‌పూర్‌లోని బిఆర్‌డి ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరతతో 63 మంది చిన్నారులు మృతి చెందిన ఘటనపై ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. సిఎంతో విచారణ మొదలుపెట్టి చిన్నారుల మృతికి బాధ్యులైన ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించాలని ఆదివారం డిమాండ్ చేసింది. ఈ ఘటనపై యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఇచ్చిన వివరణ అంగీకరింప తగనిదని మిగతా 9లో

అమెరికాలో భగ్గుమన్న

జాత్యహంకారం

వర్జీనియాలో ఒకరు మృతి, 19 మందికి గాయాలు

నిరసన కారులపై విరుచుకుపడిన శ్వేత జాతీయులు

రిచ్‌మండ్ : అమెరికాలో జాత్యహంకారం మళ్లీ భగ్గుమంది. వర్జీనియా రాష్ట్రంలో శనివారం శ్వేత జాతీయులు, నయా నాజీలు దాష్టికం ప్రదర్శించారు. వర్జీనియాకు 256కిలోమీటర్ల దూరంలోని చార్లెట్స్‌విల్లే పట్టణంలో గల పార్కు నుండి జాతీయవాదానికి గుర్తుగా వున్న కాన్ఫెడరేట్ జనరల్ రాబర్ట్ ఇ లీ విగ్రహాన్ని తొలగించాలన్న స్థానిక కౌన్సిల్ ప్రయత్నాలకు నిరసిస్తూ శ్వేత జాతీయులు 'యునైట్ ది రైట్' పేరుతో ర్యాలీ నిర్వహించారు. వందల సంఖ్యలో శ్వేత జాతీయులు, నయా నాజీలు, కు క్లాక్స్ క్లాన్ సభ్యులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ ర్యాలీని వ్యతిరేకిస్తున్న మిగతా 9లో



ప్రజ్ఞ

1. కెన్యా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిందెవరు?
2. ఆసియా-2017 క్రీడల్లో షూటింగ్‌లో రజత పతకం పొందిన క్రీడాకారిణి?
3. సిబిఎఫ్‌సి నూతన ఛైర్మన్ ఎవరు?
4. మొబైల్ థెరఫీ వ్యానులను ప్రారంభించిన రాష్ట్రం ఏది?
5. పాకిస్తాన్ మథర్ థెరిస్సాగా గుర్తింపు పొందిన రూతు పెఫూ ఏ దేశానికి చెందిన వారు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

'ఫసల్'తో రైతు పైసలా



- ఏడాదైనా దక్కని పంటల బీమా
- క్లెయిములు తేల్చని ఎఐసి, ఐసిఐసిఐ
- బజాజ్ చెల్లింపులు స్వల్పం
- రాష్ట్ర సర్కారు చోద్యం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతులకు ధీమా ఇస్తుందంటూ నిరుడు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై) ఆంధ్రప్రదేశ్ కర్షకులకు చుక్కలు చూపిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన వివరాలు అందిన మరుక్షణం రైతుల బ్యాంక్ ఖాతాల్లో బీమా సొమ్ము జమ అవుతుందనగా గత సంవత్సరం ఖరీఫ్‌లో కరువు, అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు మళ్లీ ఖరీఫ్ సగంలోపడ్డా అతీగతీ లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఏడాది జులై మొదటి వారంలో అనంతపురం జిల్లాలో అట్టహాసంగా రైతు కృతజ్ఞత సభ నిర్వహించి బీమా సొమ్ము పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించగా ఇప్పటికీ రైతులకు అందలేదు. ఫసల్‌బీమా, వాతావరణ ఆధారిత బీమా (డబ్ల్యుబిసిఐఎస్) రెండూ కలిపి 2016-17 క్లయిముల కింద సుమారు రూ.1,600 కోట్లు మంజూరయ్యాయని సర్కారు ప్రచారం చేయగా ఇంకా పంపిణీ కాలేదు. ఏపీ సర్కారు పట్టించుకోలేదు. దీంతో ఆపదలో ఆసరా అవుతుందనుకున్న బీమా దక్కక రైతులు ఆందోళన చెందుతున్నారు.

మళ్లీ ఖరీఫ్ వచ్చినా...

ఎప్పటి నుంచో అమలు ఉన్న జాతీయ వ్యవసాయ పంటల బీమా పథకం (ఎన్ఎఐఎస్) స్థానంలో మోడీ సర్కారు 2016లో ఫసల్‌బీమాను తెచ్చింది. గతంలో పంటల బీమాను ప్రభుత్వరంగంలోని జాతీయ వ్యవసాయ పంటల బీమా సంస్థ (ఎఐసి) అమలు చేసింది. ఫసల్‌బీమా అమలును కేంద్రం ఎఐసితో పాటు ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకూ అప్పగించింది. ఏపీలో నిరుడు ఎఐసితో పాటు ఐసిఐసిఐ-లాంబార్డు, బజాజ్ అలియంజ్ కంపెనీలు ఫసల్ బీమాను జిల్లాలవారీగా పంచుకొని అమలు చేశాయి. నిరుడు ఏపీలో 301 కరువు మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. అనంతపురంలో వేరుశనగకు భారీగా నష్టం వాటిల్లింది. వాతావరణం, వర్షపాతం, కరువు మండలాల ప్రకటన తదితర వివరాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అందజేసినప్పటికీ నేటికీ క్లెయిములను డిస్‌క్లోజ్ (నిర్ధారణ) చేయలేదు. బజాజ్ కంపెనీ ఒక్కటే వేరుశనగకు కొంత వరకు క్లెయిములు నిర్ధారించి మంజూరు చేసింది. ఎఐసి, ఐసిఐసిఐ-లాంబర్డు సంస్థలు ఇంకా క్లెయిముల డిస్‌క్లోజర్ చేయలేదు. దీంతో రైతులకు నిరుటి బీమా ఎప్పటికి అందుతుందో అర్థం కాకుండా ఉంది.

పెండింగ్.. పెండింగ్

టిడిపి అధికారంలోకొచ్చాక మూడేళ్లుగా బీమా క్లెయిముల పెండింగ్ కొనసాగుతున్నాయి. 2014-15 రబీలో కడప జిల్లాలో ఉద్యానవన పంటల క్లెయిములు రూ.3 కోట్లు ఎంతకీ సెటిల్ కావట్లేదు. బీమా ప్రీమియం చెల్లింపు గడువు పెంపుపై వివాదం ఒక పట్టాన తేలట్లేదు. అదే ఏడాదిలో రాయలసీమలో వేరుశనగ క్లెయిములు సుమారు రూ.8 కోట్లు పెండింగ్ పడ్డాయి. 2015-16లో కడప జిల్లాలో అరటి రైతులకు రూ.3 కోట్ల క్లెయిములు ఆగిపోయాయి. ఏళ్ల తరబడి రైతులు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు.

ఏపీకి ఎఐసి కార్యాలయం ఏదీ?

రాష్ట్ర విభజన జరిగి మూడేళ్లయినా ఏపీలో ఎఐసి ప్రాంతీయ కార్యాలయం లేదు. క్లెయిముల కోసం రాష్ట్ర అధికారులు హైదరాబాద్‌లోని ఆఫీస్‌కు వెళ్లాలి. అమరావతికి పాలన మారాక ఇదే పరిస్థితి. రైతులు సైతం క్లెయిముల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల రైతుల ఆందోళనలతో గుంటూరులో రీజనల్ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు చెబుతున్నా దాని అడ్రస్ ఏపీ అధికారులకు కూడా తెలీదు. హైదరాబాద్ ఆఫీస్‌లో సుదీర్ఘంగా తిష్టవేసిన రీజనల్ అధికారి (ఆర్‌వొ) ఒకరు క్లెయిములకు కొర్రీలు వేస్తున్నారని, కావాల్సిన సమాచారం ఇచ్చినా ఏదో ఒక సాకు చూపి క్లెయిములు నిలిపివేస్తున్నారని ఆరోపణలొస్తున్నాయి. ఏపీకి రీజనల్ ఆఫీస్ మంజూరయి నప్పటికీ ఇక్కడి అధికారిని హైదరాబాద్ ఆర్‌వొ నియం త్రణలో పెట్టారు. దీంతో సమస్య మొదటికొచ్చింది. వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సైతం హైదరాబాద్ అధికారిపై అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. ఏపీకి స్వతంత్రత కలిగిన ఆర్‌వోను నియమించాలని మంత్రితో పాటు వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఢిల్లీ అధికారులను కోరినట్లు సమాచారం.

రేషన్ బ్యాగులతో ప్రభుత్వ ప్రచారం

- కొత్తగా 5, 10 కేజీల్లో బియ్యం బ్యాగులు
- చంద్రన్న సంచులకు ఇప్పటికే రూ.కోట్లు వృధా
- బ్యాగులపై ప్రచారానికి మరిన్ని రూ.కోట్లు
- అక్రమాలకు చెక్ పెట్టేందుకే అంటున్న అధికారులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంచులు, బ్యాగుల రూపంలో ప్రచారం చేసుకోవాలని టిడిపి ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృధా చేసేందుకు కూడా వెనుకాడడం లేదు. చంద్రన్న కానుకల పేరుతో పసుపు పచ్చ సంచులతో సరుకుల్ని పంపిణీ చేసిన ప్రభుత్వం వాటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోను ముద్రించిన విషయం తెలిసిందే. ఇప్పుడు రేషన్ బియ్యాన్ని బ్యాగులతో పంపిణీ చేసి మరింత ప్రచారాన్ని చేసుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో బియ్యం సరఫరాకు ఇప్పుడిస్తున్న గోనె సంచుల స్థానంలో నూతనంగా బ్యాగుల్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. 5, 10 కేజీల బ్యాగుల్లో బియ్యాన్ని ప్యాక్ చేసి తెల్లరేషన్ కార్డులున్న లబ్దిదారులకు నేరుగా ఇవ్వాలని పౌరసరఫరాలశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ కసరత్తు పూర్తవగా పంపిణీకి సిద్ధమవుతున్నారు. గత మూడేళ్లుగా చంద్రన్న కానుక పేరిట సంక్రాంతి పండుగకు బ్యాగుల ద్వారా సరుకులు ఉచితంగా అందజేస్తున్నారు. ఈ సరుకులిచ్చేందుకు చేతి సంచుల కోసం ఇప్పటి వరకు దాదాపు రూ.55 కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టింది. ఇదే మాదిరిగా ఇక నుంచి ప్రతి నెలా రాష్ట్రంలో ఉన్న 1.42 కోట్ల మంది లబ్ధిదారులకు బియ్యాన్ని బ్యాగుల్లో అందజేయ నున్నారు. అయితే బియ్యం సరఫరా చేయాలనుకున్న ఒక్కో బ్యాగు కోసం రూ.13 నుంచి రూ.15 వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో బ్యాగు ధర రూ.15 లెక్కన చూస్తే 1.42 కోట్ల లబ్ధిదారులకు నెలకు రూ.21.30 కోట్లు ఖర్చవుతుంది.

ప్రచారం కోసమే బ్యాగులు

చంద్రన్న సంక్రాంతి కానుక పేరిట లబ్ధిదారులకు అందజేస్తున్న సరుకుల సంచులపై సిఎం చంద్రబాబు ఫొటోతోపాటు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్ని ముద్రించారు. దీంతో ప్రభుత్వానికి కొంతమేర ప్రచారం లభించింది. ఇదే ఎత్తుగడతో భవిష్యత్‌లో అందించబోయే బ్యాగులపైనా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతో పాటు సిఎం చంద్రబాబు ఫొటో ముద్రించనున్నారు. ఇది కూడా ప్రచారంలో భాగంగానే వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. బడుగు వర్గాల్లో విస్తృత ప్రచారాన్ని పొందవచ్చన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. గతంలో రేషన్‌షాపుల్లో లబ్ధిదారులకు అందజేసే బియ్యంలో కొంతమేర అవకతవకలకు పాల్పడేవారని రేషన్ డీలర్లపై విమర్శలున్నాయి. కొలతల్లో తేడాలతోపాటు దాదాపు కిలో నుంచి రెండు కిలోల వరకు బియ్యం తగ్గేవని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి.. అయితే ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టబోయే ఐదు, పది కిలోల బ్యాగుల వల్ల కొలతల తేడాలకు అడ్డుకట్ట పడనుందని, ఇది లబ్ధిదారులకు కొంతమేర ప్రయోజనకరంగా ఉంటుందని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే బియ్యాన్ని బ్యాగుల ద్వారా పంపిణీ చేసే విషయంలో ఒక మంత్రి అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని ఆ శాఖలో విమర్శలున్నాయి. ఆయన ఒత్తిడి వల్లే గోనె సంచుల స్థానంలో బ్యాగుల్ని ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



బిజెపి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆశావహులు, కార్యకర్తలు

పెత్తందారులకేనా టిక్కెట్లు!

- బిజెపి కార్యాలయంపై ఆ పార్టీ టిక్కెట్ ఆశావహుల దాడి
- ఫ్లెక్సీ చించివేత

ప్రజాశక్తి-కాకినాడ

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో టిక్కెట్లన్నీ పెత్తందారులకేనా? తమను పట్టించుకోరా అని ఎస్‌సి, బిసి సామాజిక తరగతుల బిజెపి టికెట్ ఆశావాహులు అధిష్టానాన్ని ప్రశ్నించారు. టికెట్లు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ జిల్లా కార్యాలయంపై ఆదివారం దాడి చేశారు. ఆ పార్టీ ఫ్లెక్సీలను చింపి కాల్వలో పడేసి ఆందోళన చేశారు. టిడిపి, బిజెపి పొత్తులో భాగంగా 39 డివిజన్లలో టిడిపి, తొమ్మిది డివిజన్లలో బిజెపి పోటీ చేయనున్నాయి. బిజెపికి కేటాయించిన తొమ్మిది డివిజన్లలోనూ పెత్తందారులకే టికెట్లు కేటాయించినట్లు తెలియడంతో కాకినాడ శాంతినగర్‌లోని బిజెపి జిల్లా కార్యాలయానికి ఆశావహులు, వారి అనుచరులు చేరుకున్నారు. అక్కడ ఉన్న పార్టీ ఫ్లెక్సీలను చించివేశారు. ఈ సందర్భంగా నగరంలోని పలు డివిజన్లకు చెందిన బిసి, ఎస్‌సి ఆశావహులు మాట్లాడుతూ తొమ్మిది డివిజన్లనూ ఉన్నత వర్గాలకే కేటాయిండమేమిటని ప్రశ్నించారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి జెండాలు పట్టుకుని తిరుగుతున్నామని చెప్పారు. బిజెపి ముఖ్య నేతలు తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి, బిసిలు అంటే అంత చిన్నచూపా అని ప్రశ్నించారు. పోలీసుల రంగప్రవేశంతో ఆందోళన సద్దుమణిగింది.

చారిత్రక ప్రాంతాల గుర్తింపునకు యునెస్కో చర్యలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని చారిత్రక ప్రాంతాలకు గుర్తింపు ఇచ్చేందుకు యునెస్కో సంస్థ చర్యలు చేపట్టిందని అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు. ఎపిలోని అమరావతి మహాస్థూపం, గుంటుపల్లి, నాగార్జున కొండ, గండికోట, శంకరం వంటి పలు చారిత్రాత్మక ప్రదేశాల విశిష్టత, ఇతర వివరాలను అందజేయాలని అమరావతి సర్కిల్ సూపరిండెంటింగ్ ఆర్కియాలజిస్టును యునెస్కో కోరినట్లు తెలిపారు. ఈ అంశంపై గతంలో పలుమార్లు యునెస్కో, కేంద్ర ప్రభుత్వాలకు లేఖలు రాసినట్లు చెప్పారు.

నంద్యాల ఎన్నికను రెఫరెండంగా స్వీకరిస్తారా?

టిడిపికి వైసిపి సవాల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికను మూడేళ్ల పాలనకు రెఫరెండంగా స్వీకరించే దమ్ము టిడిపికి ఉందా.? అని వైసిపి సవాల్ విసిరింది. హైదరాబాద్‌లో ఆపార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఉప ఎన్నికల్లో ఎక్కడ ఓడిపోతామోనన్న భయంతో నంద్యాల ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకొచ్చి మూడేళ్లయినా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అందుకే తమ పాలన చూసి ఓటేయాలని సిఎం చంద్రబాబు అడగలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. మూడేళ్ల పాలనలో అధికార పార్టీ నేతలు అనేక తప్పులు చేశారని, వాటిని కప్పిపుచ్చు కోవడానికే జగన్‌పై ఆరోపణలు చేస్తున్నార న్నారు. టిడిపి ఎంత ప్రయత్నించినా నంద్యాలలో వైసిపి అభ్యర్థే గెలుస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

నేడు కాపు సంఘాల సమావేశం

హాజరు కానున్న సిఎం, హోం మంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని వెన్యూ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం కాపు సంఘాల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కాపు సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాపులకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అనంతరం పశ్చిమగోదావరి జిల్లా ముమ్మిడివరం వైసిపి ఇన్‌చార్జి ముఖ్యమంత్రి టిడిపిలోకి ఆహ్వానించనున్నారు. అనంతరం సిఎం తిరుపతికి బయలుదేరి వెళ్తారు.

గిరిజన మహిళకు పురుడు పోసిన 108 సిబ్బంది

ప్రజాశక్తి-చింతూరు (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా చింతూరు మండలం పేగ పంచాయతీ పరిధి వెదుర్లగూడెంకి చెందిన గిరిజన మహిళ మడకం బొజ్జమ్మకు 108 అంబులెన్సు సిబ్బంది పురుడు పోసి ప్రాణాలు కాపాడారు. బొజ్జమ్మకు ఆదివారం పురిటి నొప్పులు రావటంతో కుటుంబసభ్యులు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో 108కు సమాచారమిచ్చారు. సిబ్బంది చేరుకునే సమయానికి ఆమె పరిస్థితి ఆసుపత్రికి తరలించేందుకు అనుకూలంగా లేదు. దీంతో వారు అక్కడే పురుడు పోసి తల్లీబిడ్డలను రక్షించారు. అనంతరం వైద్యసేవల నిమిత్తం ఆ గ్రామం నుంచి ప్రధాన రహదారికి మధ్య వాగు ఉండటంతో 108 సిబ్బంది నులక మంచంతో డోలీకట్టి బాలింతను మోసుకొని వచ్చారు. ఏడుగురాళ్లపల్లి పిహెచ్‌సికి తరలించి వైద్యసేవలందించారు.

సత్కారాల పేరుతో మీ నుంచి దూరం చేయొద్దు

- సినీ దర్శకుడు డాక్టర్ కె.విశ్వనాథ్
- సువర్ణ కంకణంతో సత్కారం



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం కార్పొరేషన్

'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చిందని, సత్కారాల పేరుతో నన్ను మీ నుంచి దూరం చేయొద్దు. నేను ఎప్పుడూ, ఎప్పటిలాగే మీ విశ్వనాథుడినే' అని సినీ దర్శకుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డాక్టర్ కె.విశ్వనాథ్ అన్నారు. నవరస నట సమాఖ్య రాజమహేంద్రవరం ఆధ్వర్యాన ఆదివారం రాత్రి స్థానిక ఆనం కళాకేంద్రంలో కె.విశ్వనాథ్‌ను ఘనంగా సత్కరించారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు స్వీకరించిన సందర్భంగా కళాతపస్వి కె.విశ్వనాథ్ చేతికి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సువర్ణ కంకణం తొడిగారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ 'శంకరాభరణం సినిమా ఔన్నత్యం గురించి ప్రేక్షకులు చెబుతుంటే చాలా ఆనందపడ్డానని అన్నారు. బుర్రకథ, హరికథ, గంగిరెడ్ల సంప్రదాయాలను సినిమాలో పెట్టుకోవడం తన ఆసక్తి అని చెప్పారు. నిర్మాతలు, లిరిక్స్, సంగీత దర్శకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. రాజమహేంద్రవరం, గోదావరి, పట్టిసీమ, పాపికొండలు అంటే తనకు చాలా ఇష్టమన్నారు. తాను శారీరకంగా కొంత ఇబ్బందిపడి వచ్చానని, మానసికంగా తాను యువకుడినేనని అన్నారు. లలిత కళలను పోషిస్తున్న అందరికీ పాదాభివందనాలు తెలియజేసుకుంటున్నానని తెలిపారు. రాజమహేంద్రవరం ఎంపీ మాగంటి మురళీ మోహన్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా కె.విశ్వనాథ్ సినిమాలు ఉంటాయన్నారు. సంగీతం, సాహిత్యం పామరుడికీ అందుబాటులోకి రావాలనే తపనతో సినిమాలు తీశారని కొనియాడారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మచ్చలేని మహర్షి కె.విశ్వనాథ్ అన్నారు. సభాధ్యక్షులు పట్టపగలు వెంకట్రావు మాట్లాడుతూ కె.విశ్వనాధ్‌కూ, తనకూ ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పట్టపగలు వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో తొలుత కె.విశ్వనాథ్ చిత్రాల నుంచి కొన్ని మధుర గీతాలను తెరపై ప్రదర్శించారు. చిన్నారి శైలికా పాత్రో కూచిపూడి నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మేయర్ పంతం రజనీ శేషసాయి, ఎంఎల్‌సి సోము వీర్రాజు, కందుల దుర్గేష్, శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, చల్లా శంకర్రావు, తుమ్మిడి రామ్‌కుమార్, జిత్‌మోహన్‌మిత్ర, మాజీ ఎంపీ జివి.హర్షకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపిఎస్ ఆర్టీసికి జాతీయ రవాణా పురస్కారం

అందుకున్న ఎండి మాలకొండయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ రవాణా పురస్కారం-2017ను ఎపిఎస్ ఆర్టీసి దక్కించుకుందని ఆర్టీసి అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజారవాణా వ్యవస్థలో నూతన ఆవిష్కరణలు అనే అంశంపై ఢిల్లీలోని మాణిక్ షా సెంటర్‌లో ఆల్ ఇండియా స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఎఎస్‌ఆర్‌టియు) నిర్వహించిన జాతీయ సదస్సులో ఎఎస్‌ఆర్‌టియు ఇడి పి ఆనందరావు, మోర్త్ జాయింట్ సెక్రటరీ అభయ్ దాంలే, అడిషనల్ సెక్రటరీ లీలా నందన్ చేతుల మీదుగా ఎపిఎస్ ఆర్టీసి ఎండి ఎం మాలకొండయ్య, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్లు జి నాగేశ్వరరావు, వై శ్రీనివాసరావు ఈ అవార్డును అందుకున్నారు. బెస్ట్ బ్రాండింగ్, మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో నూతన అల్ట్రా డీలక్స్ బ్రాండ్‌ను ప్రవేశపెట్టినందుకు గాను ఈ అవార్డుతో పాటు రూ.2.50లక్షల నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జాతీయ రవాణా రంగ నిపుణులు వివిధ అంశాలపై రూపొందించిన నివేదికలను ఈ సదస్సులో సమర్పించారు. ఈ అవార్డు దక్కించుకోవడానికి కృషి చేసిన ఆర్టీసి అధికారులు, సిబ్బందికి ఆర్టీసి ఎండి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

'వెబ్‌ల్యాండ్' కష్టాలు

- తప్పుల తడకగా భూ వివరాల నమోదు
- పట్టాదారు పాస్‌పుస్తకాలకు '1-బి'లకు మధ్య వ్యత్యాసాలు
- వ్యవసాయ రుణాలు పొందలేకపోతున్న అన్నదాతలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్లో రైతులకు మరో కష్టమొచ్చి పడింది. రైతుల వద్ద ఉన్న భూమి మేరకు వ్యవసాయ రుణం అందని పరిస్థితి నెలకొంది. పట్టాదారు పాస్‌పుస్తకాల్లో నమోదైన భూములకు, వెబ్ ల్యాండ్ వెబ్‌సైట్‌లోని 1-బిలో పేర్కొన్న భూములకు, అడంగల్‌కు మధ్య వ్యత్యాసాలు ఉండటమే దీనికి ప్రధాన కారణం. 1-బి, అడంగల్‌లో పేర్కొన్న భూములకు అనుగుణంగానే బ్యాంకర్లు రుణం ఇస్తున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాల్లో కంటే 1-బిలో తక్కువ భూ విస్తీర్ణం చూపిస్తుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాస్‌పుస్తకానికి అనుగుణంగా భూములను వెబ్‌ల్యాండ్‌లో సరి చేయించుకునేందుకు తహశీల్దారు కార్యాలయం, మీ-సేవా కేంద్రం చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం.

శ్రీకాకుళం జిల్లాలో 5,76,196 మందికి పట్టాదారు పాస్‌పుస్తకాలున్నాయి. వీటి ఆధారంగా భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసేటప్పుడు పొరపాట్లు చోటు చేసుకున్నాయి. వ్యవసాయ రుణాలు పొందేందుకు పట్టాదారు పాస్‌పుస్తకాలతోపాటు 1-బి పత్రాలను కచ్చితంగా సమర్పించాలని బ్యాంకు అధికారులు కోరుతున్నారు. కొంతమంది బ్యాంకర్లు అడంగల్ కాపీలనూ అడుగుతున్నారు. 1-బి, అడంగల్ కాపీలను పొందేందుకు రైతులు మీ-సేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. వెబ్‌ల్యాండ్‌లో నమోదైన 1-బి వివరాలను చూసి నిర్ఘాంతపోతున్నారు. వారికి ఉన్న భూమిలో కొంత మాత్రమే 1-బిలో కనిపిస్తోంది. దీంతో వారు తహశీల్దారు కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీల్ ప్రకారం భూముల వివరాల పునరుద్ధరణలో చాలా జాప్యం జరుగుతోంది. రెవెన్యూ అధికారికి దరఖాస్తు చేసుకున్న తర్వాత సర్వేయర్ ఫీల్డ్‌కు వచ్చి పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాతే వెబ్‌ల్యాండ్‌లో తప్పుల సవరణ జరుగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు కాలయాపన జరుగుతుండటంతో రుణం అందని పరిస్థితి నెలకొంటోందని రైతులు వాపోతున్నారు.

భూ సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు గత నెల ఆరో తేదీ నుంచి ఈ నెల 31 తేదీ వరకూ 'రైతు సేవలో రెవెన్యూ శాఖ' పేరుతో నిర్వహిస్తున్న గ్రామ సదస్సుల్లో భూ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకు 10,095 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకూ 31 దరఖాస్తులను పరిష్కరించారు. మరో 44 దరఖాస్తులను తిరస్కరించారు. 9,740 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో భూ విస్తీర్ణానికి సంబంధించినవే అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రుణాలపై తీవ్ర ప్రభావం

1-బి, అడంగల్ సమస్యలు ఖరీఫ్ రుణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 2017 ఖరీఫ్‌లో రూ.1,518 కోట్లను రుణాలుగా అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటివరకూ 1.70 లక్షల మందికి రూ.800 కోట్ల రుణాలందాయి. 2016 ఖరీఫ్‌లో దాదాపు మూడు లక్షల మంది రుణం పొందారు. ఖరీఫ్ రుణ గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. మరోవైపు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన బీమా ప్రీమియం చెల్లింపునకు ఈ నెల 21 తుది గడువుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రుణాలు తీసుకోని రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీకి అనర్హులు కానున్నారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకునేందుకు 1-బి, అడంగల్ సమస్యలతో రైతులకు దిక్కు తోచడం లేదు.



రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

1-బిలో తక్కువ విస్తీర్ణంతో ఇబ్బందులు

మా గ్రామంలో కొంతమందికి 1-బి పత్రాలు రావడం లేదు. వచ్చినా భూ విస్తీర్ణంతో చాలా వ్యత్యాసాలు ఉంటున్నాయి. వ్యవసాయ రుణాలిచ్చేటప్పుడు బ్యాంకర్లు 1-బి పత్రాలు తప్పనిసరిగా అడుగుతున్నారు. వాటిలో తప్పిదాలతో అన్ని రకాలుగా నష్టపోతున్నాం. తప్పులను సరి చేయించుకునేందుకు నానాపాట్లు పడుతున్నాం.

- బి.సుధాకరరావు, సర్పంచ్, కూర్మనాథపురం, సారవకోట మండలం



150 ఏళ్ల కబేళాకు కష్టాలు

సమాజంలో అత్యంత వెనుకబాటుకు గురైన ముస్లింలు, దళితులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. విజయనగరంలో 150 ఏళ్లుగా జమియా తుల్ ఖురేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబేళాను గో సంరక్షణ పేరుతో ఉద్దేశపూర్వకంగా రెన్యువల్ చేయకపోవడంతో వెయ్యి కుటుంబాల జీవనోపాధికి గండిపడింది. పైగా ఉపాధి కోల్పోయిన వారిని దొంగలుగా చిత్రీకరిస్తోంది. దీనికితోడు గో సంరక్షణ సమితి ఫిర్యాదులను ఆసరా చేసుకుని అధికార యంత్రాంగం రెచ్చిపోతోంది. ఉపాధి కోల్పోయిన మైనారిటీలు, దళితులు తిండిలేక అలమటిస్తున్నారు. పిల్లల చదువులకు ఫీజులు కట్టలేక విద్యాసంస్థల యాజమాన్యాల నుంచి ఒత్తిడి ఎదుర్కోవాల్సిన దుస్థితి వారికి దాపురించింది.

- అనుమతి పునరుద్ధరణకు నిరాకరణ
- పట్టించుకోని పాలనా యంత్రాంగం
- ముస్లింలు, దళితుల ఉపాధికి ప్రభుత్వ గండి
- జీవనం కోల్పోయిన వెయ్యి కుటుంబాలు
- ఆపై దొంగలుగా చిత్రీకరణ
- రెన్యువల్ కాకపోవడం వెనుక కేంద్రం ఒత్తిడి?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో జమియా తుల్ ఖురేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబేళాకు సుమారు 150 ఏళ్ల చరిత్ర ఉంది. తొలుత గంజిపేటలోనూ, ఆ తరువాత కెఎల్‌పురంలోనూ ఉండేది. అప్పట్లో ప్రభుత్వమే ఈ కబేళాను నిర్వహించేది. మూడేళ్లగా కటిక వీధిలో ఈ కబేళా కొనసాగుతోంది. కబేళాను నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని అనుమతులూ దానికి ఉన్నాయి. షెడ్‌తోపాటు నీరు, కాలువ, విద్యుత్ తదితర సదుపాయాలు ఉన్నాయి. అంతకుమించి నిర్వాహకులు కట్టుదిట్టమైన కాలుష్య నివారణా చర్యలు కూడా తీసుకున్నారు. ఇక్కడినుంచి రోజూ టన్నులకొద్దీ పశుమాంసాన్ని పట్టణంలోని ముస్లింలు, దళితులు వీధుల్లో తిరిగి విక్రయించుకోవడం ద్వారా ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. తాతలతండ్రులనుంచీ ఇదే వృత్తి. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోయినా రోజంతా కష్టపడి రూ.300 నుంచి రూ.400 వరకూ సంపాదించుకుని బతుకుబండి లాగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ కబేళాను కోలుకోలేని దెబ్బతీసింది. గత నెల 18న విజయనగరం కబేళా నిర్వహణా గడువు ముగిసింది. అంతకు ముందు నుంచే రెన్యువల్ కోసం అసోసియేషన్ నాయకులు అధికారుల చ ం ట వ్యా తిరుగుతున్నా 'అదుగో ఇదిగో' అంటూ నెట్టుకొ చ్చారు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లిందో ఏమో అధికారులు ఆకస్మికంగా చేతులు ఎత్తేశారు. తహశీల్దారు వద్దకు వెళ్లగా.. మున్సిపల్ కమిషనర్‌పైకి నెట్టారు. కమిషనర్ వద్దకు వెళ్లి అడగ్గా ఆర్డీఓ పేరు చెప్పారు. ఆయన వద్దకు వెళ్తే అంతా కలెక్టర్‌గారే చూసుకుంటు న్నారని సెలవి చ్చారు. తీరా కలెక్టర్ వద్దకు వెళ్తే ఆ ఒక్కటి తప్ప ఇంకేదైనా మాట్లాడండి అంటూ నిక్కచ్చిగా చెప్పేశారట. ఈ మోసపూరిత వ్యవహా రాన్ని అధికారుల పైకి మాత్రమే నెట్టివేయ లేమని సర్వత్రా వినవస్తోంది. ఢిల్లీ స్థాయిలో ఒత్తిడి ఉన్నట్టు తెలుస్తోంది. అధికారు లకు అందు తున్న ఫిర్యాదులు, పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా కేంద్ర ప్రభుత్వ అధికారులు నేరుగా జిల్లా కలెక్టర్లతో మాట్లాడుతు న్నట్టు సమా చారం. మరోవైపు స్థానిక గో సంరక్షణ సమితి నాయకులు కూడా తరచూ రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగం గానే.. కబేళాను రెన్యూవల్ చేయరాదని సదరు కలెక్టర్ వివేక్ యాదవ్‌పై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. బహుశా అందుకేనేమో కబేళా లను రెన్యువల్ చేసి దళిత, ముస్లింల ఉపాధిని పునరుద్ధరిం చాలని కోరిన సిపిఎం, కెవిపిఎస్, కబేళా నిర్వహకులతో మాట్లాడేందుకు కూడా నిరాకరిం చారు. దీంతో, నెలరోజులగా వెయ్యి కుటుంబాల జీవనం కష్టతరంగా మారింది. పనిలేక, ఆదాయం రాక కుటుంబ పోషణ కోసం అల్లాడిపోతున్నారు.

అనధికార పశువధను సాకుగా చూపి..

ఇప్పటికే ఉపాధి పోయి, ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్న కబేళా నిర్వాహకులు, అందులో పనిచేస్తున్న కార్మికులను అధికార యంత్రాంగం దొంగలుగా చిత్రీకరిస్తోంది. చర్మాల గోదాములో ఈనెల 7న జరిగిన గోవధకూ, ఖురేష్ అసోసియేషన్ నడుపుతున్న కబేళాకూ ఎలాంటి సంబంధమూ లేదు. గొల్లవీధిలో అధికారులు స్వాధీనం చేసుకున్న పశువులు కూడా అసోసియేషన్‌కు సంబంధించినవి కావు. అధికా రులు వాటిని సాకుగా చూపి, ఇక్కడ దొంగతనాలు జరుగు తున్నాయంటూ ఖురేష్ కబేళా వద్ద ఈనెల 8న సిసి కెమెరాల ఏర్పాటు చేసేందుకు అధికారులు కలిసి సన్నాహాలు చేశారు.



అనుమతులను పునరుద్ధరించాలి

కలెక్టరేట్‌కు చేరువలో పశువధ జరుగుతోందన్న నెపంతో చట్టబద్ధంగా నడుస్తున్న ఖురేష్ అసోసియేషన్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరికాదు. ఇప్పటికైనా కలెక్టర్ వాస్తవాలను తెలుసుకుని కబేళా నిర్వాహకులకు, అందులో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలి. కోర్టు స్టే నేపథ్యంలో.. కబేళాలపై నిర్వహించిన ఆంక్షలు ఎత్తివేసి, అందులో పనిచేస్తున్న కార్మికుల జీవనోపాధికి సహకరించాలి.

- తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి



మతాచారాలను దెబ్బతీస్తున్నారు

మేం దొంగలమా? మా వీధిలోకి వచ్చి, మేం చేస్తున్న పనులను చిత్రీకరించడానికి.. ఈ ప్రభుత్వం మైనార్టీలను అడుగడుగునా ఇబ్బందులకు గురిచేస్తోంది. కబేళా మూసివేతవల్ల వెయ్యి కుటుంబాల జీవనం ప్రశ్నార్థకంగా మారింది. పైగా అక్రమ గోవధ పేరుతో సిసి కెమెరాలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తూ మతాచారాలకు తూట్లు పొడు స్తోంది. ఇది అన్యాయం. మా ఉపాధికోసం ఎంతటి పోరాటానికైనా వెనకా డం.


- ఎండి ఉమార్, జమియా తుల్ ఖురేష్ అసోసియేషన్ అధ్యక్షులు



గోసంరక్షణ పేరుతో దళితులు, మైనార్టీలపై వివక్ష

ఆర్‌ఎస్‌ఎస్ విధానాలకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం దళితులు, ముస్లింలపై ఆర్థిక దోపిడీకీ, సామాజిక వివక్షకూ పాల్పడుతోంది. 150 ఏళ్లగా నడుస్తున్న కబేళాను రెన్యువల్ చేయలేదు సరికదా తిరిగి నిర్వాహకులపై నిందారోపణలు మోపుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే అందర్నీ సమీకరించి ఉద్యమిస్తాం.

- రాకోటి ఆనంద్, విజయనగరం జిల్లా, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి



ఏలేరు రిజర్వాయర్

ఏలేరుకు జలకళ వచ్చేనా?

- గోదావరి కోసం ఎదురుచూపు
- భారీగా పడిపోయిన నీటిమట్టం
- ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లాలో 97 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో నిర్మించిన ఏలేరు ప్రాజెక్టు గోదావరి నీటి కోసం ఎదురుచూస్తోంది. ఈ ప్రాజెక్టు ప్రతిఏటా వేసవిలో డెడ్ స్టోరేజీకి చేరుకుంటోంది. 24.11 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 4.66 టిఎంసిల నీరే ఉంది. ఈ ఏడాది భారీగా నీటిమట్టం పడిపోవడంతో ఖరీఫ్‌లో సాగునీరందుతుందో లేదో అని పిఠాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.మన్యంలో కురిసిన వర్షం నీరు జడేరు, మడేరు ద్వారా ఏలేరు ప్రాజెక్టులోకి చేరుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తయి 40 ఏళ్లు దాటడంతో రిజర్వాయర్‌లో పూడిక పెరిగింది. కొన్నేళ్లుగా పూడిక తీయకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. ఈనెల 15న పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా గండికోట వద్ద ఉన్న ప్రెజర్ మెయిన్ 1.60 కిలోమీటరు వరకూ 3,500 క్యూసెక్కుల నీటిని పోలవరం ఎడమకాలువలోకి తోడతారు. అక్కడి నుంచి ఎడమకాలువలో 50 కిలోమీటర్ల వరకూ నీటిని తీసుకెళ్లి 1400 క్యూసెక్కుల నీటిని ఏలేరు ప్రాజెక్టుకు అందిస్తామని రాష్ట్రప్రభుత్వం చెబుతోంది. పురుషోత్తపట్నం పథకం వల్ల ఏలేరు ఆయకట్టుతో 2.15 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామని, విశాఖకు 10 టిఎంసిల నీరందిస్తామని సిఎం చెబుతున్నారు. ఏలేరులో నిరంతరం 24 టిఎంసిల నీరు నిల్వ చేస్తామంటున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 4.66 టిఎంసిల నీరే ఉంది. మన్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోజుకు 83 క్యూసెక్కుల నీరే ప్రాజెక్టులోకి వస్తోంది. ఈ ఖరీఫ్‌లో ఈ ప్రాజెక్టు నుండి వెయ్యి క్యూసెక్కుల నీరు ఆయకట్టుకు విడుదల చేశారు.ఏలేరు ఆధునికరణకు మొత్తంగా రూ.350 కోట్లు అవసరం. 2014లో రూ.135 కోట్లతో ఆధునికీకరణ తొలిదశ పనులను చేపట్టారు. ఇప్పటికీ ఆ పనులు 30 శాతానికి మించి పూర్తి కాలేదు. ఈ వార్షిక బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.40 కోట్లే కేటాయించి చేతులు దులుపుకుంది. దీంతో ఈ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని ప్రధాన కాలువలు మెరక భూమిగా మారాయి. పంట కాలువలు తూడు, మట్టితో పూడుకుపోయి ఉన్నాయి. ఆధునికీకరణ పనులు పూర్తికానందు వల్లే పూర్తి ఆయకట్టుకు నీరందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరానికి నీరు లేకపోవడంతో పిఠాపురం, గొల్లప్రోలు మండల పరిధిలో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. పోలవరం ఎడమ కాలువ ద్వారా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి వచ్చే నీటిని ఏలేరులో కలుపుతామని ప్రభుత్వం చెబుతోంది. ఈనెల 15న పురుషోత్తపట్నం నుంచి ఏలేరుకు 1,400 క్యూసెకుల నీరు చేరితే ఖరీఫ్ నుండి గట్టెక్కే అవకాశాలున్నాయని రైతులు చెబుతున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

మృతుల్లో మేనత్త, మేనల్లుడు
మృతిరాలి కుమార్తెకూ తీవ్రగాయాలు

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)

విద్యుదాఘాతానికి గురై విజయనగరం జిల్లా భోగాపురం మండలం చాకివలస గ్రామానికి చెందిన ఇద్దరు ఆదివారం మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా బంధువులే. పోలీసుల కథనం మేరకు.. కలిశెట్టి పైడమ్మ(53) తన ఇంటి సమీపాన ఉన్న నీలగిరి తోటలోకి బహిర్భూమికి వెళ్లింది. అక్కడి మొక్కలపై తెగిపడిన విద్యుత్ తీగలను గమనించకుండా అటువైపుగా వెళ్లడంతో అవి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పైడమ్మ ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంపై ఆమె కుమార్తె లెంక తోటమ్మ ఆందోళనకు గురైంది. పైడమ్మ మేనల్లుడు నారాయణరావు(23)కు విషయాన్ని తెలియజేసింది. వారిద్దరూ నీలగిరి తోటలోకి వెళ్లి గాలించారు. పైడమ్మ కింద పడిపోయి ఉండడాన్ని గమనించి ఆమె వద్దకు వెళ్లి నారాయణరావు పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తోటమ్మ కూడా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడింది. ఆమె వేసిన కేకలకు స్థానికులు అక్కడికి చేరుకొని వారిద్దరినీ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో నారాయణరావు మృతి చెందాడు. సుందరపేట ఆస్పత్రిలో తోటమ్మను చేర్పించారు. నారాయణరావు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైల్డ్‌లైన్‌కు బీహార్ బాలుడు అప్పగింత

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

రైలులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ బాలుడిని శ్రీకాకుళం జిల్లాలోని చైల్డ్‌లైన్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ ఒడిశా సంస్థకు చెందిన విజయకుమార్ మహాపాత్రో ఆదివారం అప్పగించారు. బీహార్ రాష్ట్రంలోని మునీస్‌చౌక్ హిమత్‌పూర్ గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ అనే ఎనిమిదేళ్ల బాలుడిని రైల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా మహాపాత్రో గుర్తించారు. పలాసలోని జిఆర్‌పి పోలీసులకు ఆ సమాచారాన్ని అందించి, వారికి బాలుడిని అప్పగించారు. జిఆర్‌పి పోలీసులు చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ అరుణకుమారికి సమాచారం తెలియజేశారు. జిఆర్‌పి పోలీస్‌స్టేషన్‌కు ఆమె వెళ్లి బాలుడి వివరాలు సేకరించారు. బాలుని తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతి చెందడంతో చిన్నాన్న సంరక్షణలో ఉంటున్నాడని, రెండ్రోజుల కిందట ఇంటి నుంచి పరారయ్యాడని విలేకరులకు అరుణకుమారి తెలిపారు. బాలుడు తమ వద్ద ఉన్నట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించామని, వారు వచ్చేంత వరకూ చైల్డ్‌లైన్ తమ సంరక్షణలో బాలుడు ఉంటాడని ఆమె చెప్పారు.

ప్రచార హోరును పెంచిన వైసిపి, టిడిపి

- కేశవరెడ్డి, అగ్రిగోల్డు బాధితులను విస్మరించిన బాబు
- నంద్యాల రోడ్‌షోలో వైఎస్ జగన్

ప్రజాశక్తి - నంద్యాల క్రైం/నంద్యాల

నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వైసిపి, టిడిపి ప్రచార హోరును పెంచాయి. జగన్ పట్టణంలో రోడ్‌షో నిర్వహించగా.. టిడిపి నేతలు పట్టణ, పరిసర గ్రామాల్లో ప్రచారం చేశారు. రోడ్‌షోలో జగన్ మాట్లాడుతూ.. కేవశరెడ్డి, అగ్రిగోల్డ్ బాధితుల గోడును ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోవడం లేదని అన్నారు. కేశవరెడ్డి స్కూల్ అధినేత కేశవరెడ్డి డిపాజిట్ల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.850 కోట్లు వసూలు చేసిన సొమ్ము స్వాహా చేశాడని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం అనుకూలంగా ఉన్న సిబిసిఐడితో దర్యాప్తు చేయించి రూ.850 కోట్లు కాదు 280 కోట్లు అని చెప్పించారన్నారు. 2019లో తాను ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రభుత్వం తరపున కేశవరెడ్డి, అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బులు చెల్లించి ఆదుకుంటామని తెలిపారు. నంద్యాలలో జరిగే ఉప ఎన్నికల్లో వైసిపి అభ్యర్థికి పట్టం కట్టాలని కోరారు. నంద్యాలలో శిల్పా మోహన్‌రెడ్డిని ఆదరిస్తే నియోజకవర్గాన్ని పులివెందుల తరహాలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు స్థానిక రైల్వేస్టేషన్ వైపు ఉన్న పెద్ద చర్చిలో బిషప్ పుష్పలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రాంనాథ్‌రెడ్డి కుమారుడు ప్రతాప్‌రెడ్డితో ఆయన స్వగృహంలో అరగంట సుదీర్ఘ మంతనాలు జరిపారు.



శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించాలని నంద్యాల రోడ్‌షోలో మాట్లాడుతున్న వైఎస్.జగన్

టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని కోరుతూ నంద్యాల మండలం అబాండం తండాలో పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, నంద్యాలలోని సూరజ్ గ్రౌండ్‌లో జరిగిన బోయల ఆత్మీయ సమావేశంలో సమాచార శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడారు. నందమూరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో నంద్యాల రామకృష్ణా డిగ్రీ కాలేజీలోని వివేకానంద ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా నాగమౌనికలు పాల్గొన్నారు. విశ్వనగర్‌లోని గాయత్రీ దేవాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఎంపి ఎస్పివై రెడ్డి, భూమా బ్రహ్మానందారెడ్డి సిఎస్ఐ, ఆర్‌సిఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

7,8 వార్డుల్లో పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ, ఎమ్మెల్సీ ఎన్‌ఎండి.ఫరూఖ్, 30, 38వ వార్డుల్లో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు బోండా ఉమా మహేశ్వరరావు, సాంబశివరావు, నంది పరిశ్రమల ఎండి శ్రీధర్‌రెడ్డి, సజ్జల సుజల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ టౌన్ హాల్‌లో జరిగిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో మంత్రులతోపాటు ఎపి ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ అంబికా కృష్ణ పాల్గొన్నారు.



భూమా బ్రాహ్మనందరెడ్డిని గెలిపించాలని నంద్యాలలో ప్రచారం చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, నంది పరిశ్రమల ఎండి శ్రీధర్‌రెడ్డి

ప్రాణత్యాగానికైనా సిద్ధం : ముద్రగడ

19వ రోజూ పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)

కాపులకు ఇచ్చిన మాట కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధపడతానని కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో ముద్రగడ చేపట్టిన నిరవధిక పాదయాత్రను ఆయన నివాసం వద్ద 19వ రోజూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారిపై ముద్రగడ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపులను బిసిల్లో చేరుస్తామని 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీని నమ్మి టిడిపిని ఏకపక్షంగా కాపులు గెలిపించారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే ఈ విధంగా అణచివేయడం సరికాదన్నారు. తమ తొత్తులతో అబద్దాలు చెప్పించడం మానుకోవాలని చంద్రబాబుకు సూచించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకూ పాదయాత్ర కొనసాగుతూనే ఉంటుందన్నారు.

అనంతరం తన అనుచరులతో యథావిధిగా నివాసానికి వెనుదిరిగారు. అంతకుముందు రోడ్డుపై వంటావార్పు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాపు జెఎసి నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, రాటేడి ప్రకాష్, తుమ్మలపల్లి రమేష్, గౌతు స్వామి, కిర్లంపూడి సర్పంచ్ పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొన్నారు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలంటూ అమలాపురంలో ఉద్యమకారులు రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు.



అమలాపురంలో రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న ఉద్యమకారులు

కిడ్నీ వ్యాధిని సామాజిక రుగ్మతగా గుర్తించాలి

చర్చాగోష్టిలో పలువురు వక్తలు

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

ఉద్దానం ప్రాంత ప్రజలను పట్టిపీడిస్తోన్న కిడ్నీ వ్యాధి సమస్యను సామాజిక రుగ్మతగా గుర్తించాలని పలువురు వక్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లా పలాసలోని కాశీబుగ్గ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఉద్దానంలో కిడ్నీ వ్యాధులు - కుటుంబాలపై వాటి ప్రభావం - ప్రభుత్వ బాధ్యత' అనే అంశంపై ఆదివారం చర్చాగోష్టి జరిగింది.

ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి వ్యాప్తికి మూలాలను పూర్తిస్థాయిలో అన్వేషించాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. డాక్టర్ జీవితేశ్వరరావు, హరిపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ ఎం.ఖగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం కిడ్నీవ్యాధిపై పూర్తి స్థాయిలో స్పందించాలంటే పోరాటాలే మార్గమన్నారు. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి కిడ్నీ వ్యాధిగ్రస్తుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్, అమరుల బంధుమిత్రుల కమిటీ నాయకులు జోగి కోదండరావు కోరారు. ఈ కార్యక్రమానికి వేదిక కార్యదర్శి సిహెచ్.జగదీష్ అధ్యక్షత వహించారు.

నో ఫ్లైజోన్‌గా తారకరామ స్టేడియం

చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు నిర్వహించనున్న తిరుపతి తారకరామస్టేడియాన్ని నోఫ్లైజోన్‌గా ప్రకటించినట్లు చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పాల్గొననున్న నేపథ్యంలో స్థానికత ఉట్టిపడేలా అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశామని కలెక్టర్ వెల్లడించారు. స్టేడియంలో ఏర్పాట్లను పర్యవేక్షించడానికి వచ్చిన ఆయన మీడియాతో ఆదివారం మాట్లాడుతూ.. వివిధ శాఖలకు చెందిన 12 శకటాలను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అలాగే వేడుకల్ని వీక్షించేందుకు వీలుగా స్టేడియంలో 25 గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 5,580 మంది వీక్షకులు మైదానంలో కూర్చొని తిలకించేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. 2,160 మంది విఐపిలకు ఎ1, ఎ2, బి1, బి2 లు పాసులను కేటాయించినట్లు పేర్కొన్నారు. వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా రెయిన్‌ప్రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ బెటాలియన్‌కు చెందిన బైకులతో సాహస విన్యాసాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల రిహార్సల్స్‌ను వీక్షించారు.గ

మైనారిటీలకు డ్రైవింగ్‌లో శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

రాష్ట్రంలో మైనారిటీలకు భారీ, చిన్న తరహా వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎపి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎండి.హిదాయత్ తెలిపారు. గుంటూరు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిదాయత్ మాట్లాడుతూ.. రహదారులు, రవాణా అధికార సంస్థ ద్వారా జరిగే ఈ శిక్షణ కాలంలో నైపుణ్యాభివృద్ధితోపాటు స్టైఫండ్ కూడా అందజేస్తామని తెలిపారు. ఔత్సాహిక అభ్యర్థులు షషష.ఖజూంఎటష.ఞశీఎ వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మైనారిటీ నిరుద్యోగ యువతకు పలు వృత్తుల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు రూ.16.80 లక్షలు కేటాయించామన్నారు. విదేశీ విద్యోన్నతి పథకం ద్వారా ఒక్కొకరికి రూ.10 లక్షలు గ్రాంట్ ఇవ్వడంతోపాటు అవివాహిత మహిళల వివాహ ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు ఇస్తున్నామని తెలిపారు. హజ్ హౌజ్ కోసం రూ.12 కోట్లు కేటాయించామని వెల్లడించారు. సమావేశంలో మైనారిటీ ఆర్థిక సంస్థ జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు విజయకుమార్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ లాల్ వజీర్ పాల్గొన్నారు.




బాధితుని నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ విద్యాసాగర్ (ఇన్‌సెట్‌లో) కాలిపోయిన సెల్‌ఫోన్

సెల్‌ఫోన్ పేలి వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-రావులపాలెం (తూర్పుగోదావరి)

సెల్‌ఫోన్ పేలి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. రావులపాలెం శివాలయం వీధికి చెందిన భావన సూర్యకిరణ్ స్థానికంగా పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. 20 రోజుల క్రితం రెడ్‌మి ఎంఐ నోట్ 4 మోడల్ సెల్‌ఫోన్ కొన్నాడు. ఆదివారం ఉదయం సెల్‌ఫోన్ ప్యాంటు జేబులో పెట్టుకుని మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. కొంతదూరం వెళ్లాక సెల్‌ఫోన్ పేలింది. జేబులో నుంచి మంటలు రావడంతో స్థానికులు నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో బాధితునికి తొడ మీద తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సిహెచ్.విద్యాసాగర్ బాధితుడు సూర్యకిరణ్‌ను వివరాలడిగి తెలుసుకున్నారు. సెల్‌ఫోన్‌తో జాగత్తగా ఉండాలని, చిన్న పిల్లలకు సెల్‌ఫోన్లు దూరంగా ఉంచాలని ఎస్ఐ కోరారు.

మహనీయుల మాట



ఒక అవకాశం చేజారిపోతే కళ్ళ నీళ్లు పెట్టుకోకు. మరొక అవకాశం చేజారి పోకుండా జాగ్రత్తపడు.

– లింకన్

సంపాదకీయం

పాడుదమా స్వేచ్ఛాగీతం...

'స్వాతంత్ర్యం అంటే బానిసత్వం నుంచి విడుదలే కాదు... కుల, సాంఘిక అసమానతలను తొలగించడం, మత వైషమ్యాలను నశింప జేయడం' అంటాడు సుభాష్ చంద్రబోస్. స్వాతంత్ర్యం రాత్రికి రాత్రే వికసించే పుష్పం కాదు. స్వాతంత్ర్యం అంటే ఆకాంక్ష. స్వాతంత్ర్యం అంటే పరిపూర్ణత. ఒక రచయితకో, చిత్రకారుడికో వుండే స్వేచ్ఛ. కుల మత ప్రాంతీయ భేదాలు లేని సమానత. ఈ స్వేచ్ఛా మానసమే స్వాతంత్ర్యం. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో ఈ స్వేచ్ఛాఫలాలు సామాన్యుడి చెంతకు చేరని వైనం నిత్యం నినదించే గొంతుకల సాదృశ్యం. రోజురోజుకీ పెరుగుతున్న పాలకుల దాష్టీకం. ప్రజలు ఏం తినాలో, ఏం తినకూడదో కూడా రాజ్యమే చెపుతుండడం విడ్డూరం. 'నా దృష్టిలో భారతదేశానికి స్వాతంత్ర్యం అంటే పాలనాధికారం బ్రిటీష్ వారి చేతుల్లోంచి అగ్రవర్ణాల హస్తగతం కావడమే' అంటాడు అంబేద్కర్. స్వాతంత్ర్యం అంటే కేవలం రాజకీయంగా, ఆర్థికంగా తెచ్చుకునే మార్పుగా భావిస్తే దానికి మూల్యం మరికొన్ని తరాలు చెల్లించాల్సి ఉంటుందని అప్పటి కాంగ్రెస్ నాయకుల్ని, దేశాన్ని హెచ్చరించాడు అంబేద్కర్. సామాజిక పరివర్తన లేకుండా తెచ్చుకునే రాజకీయ, ఆర్థిక మార్పులు అధిక భాగం జనాభాకు చేరవనీ వివరించాడు. అదే నేడు జరుగుతున్న వాస్తవ దృశ్యం. అందుకే అంటాడు మహాకవి శ్రీశ్రీ...'మతకలహాల మారణ హోమాల మధ్య/ అర్ధరాత్రి ఆవిర్భవించిన స్వాతంత్ర్యం/ అవినీతిని భారీ పరిశ్రమ చేసింది/ ఆకలికి సార్వభౌమాధికారం ఇచ్చింది/ ధనస్వామ్యానికి ప్రజాస్వామ్యం అని పేరు పెట్టి/ పేదవాళ్ళని మరింత పేదలనే చేసింది' అని. ఇది రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్ని హరించే యత్నం. భావప్రకటనా స్వేచ్ఛకు భంగకరం. మతం, సంస్కృతి పేరుతో సాగే కాషాయ మూకల దాడులు సాంస్కృతిక వికాసానికి ఆటంకం. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో మహిళలను వస్తువుగా మార్చుతున్న మార్కెట్ తంత్రం. అన్నిరంగాలను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు సలాం కొడుతున్న ఆత్మగౌరవ రాహిత్యం. అడుగడుగునా వైఫల్యం చెందుతోన్న స్వాతంత్ర్య ఫలం. ఇదీ నేటి స్వతంత్ర భారతం.

స్వాతంత్ర్యం సాధించిన ఇన్నేళ్ల తర్వాత కూడా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై గళమెత్తాల్సిరావడం అనివార్యమైంది. 'తెల్లదొరలు పోయి నల్లదొరలు వస్తే ఆ స్వాతంత్ర్యం వట్టి బూటకం' అన్న భగత్‌సింగ్ మాటలు ఈ ఏడుపదుల స్వతంత్ర భారతంలో ఎంత వాస్తవమో తెలియజెపుతున్నాయి. స్వాతంత్ర్యం అంటే కేవలం అధికార మార్పిడి మాత్రమే కాదు. 'రైతులు ఆకలితో నిద్రపోనప్పుడు, చేనేత నగ్నంగా ఉండనప్పుడు, కార్మికుడికి గూడు దొరకని స్థితి లేనప్పుడు నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లు' అంటాడు భగత్ సింగ్. ధరలు తగ్గించమంటే, కూలి పెంచమంటే, ఉద్యోగాలు కావాలంటే... లాఠీలతోనే సమాధానం చెబుతున్నారు ఏలికలు. 'ఆకలై అన్నమడిగితే పిచ్చోడన్నారు నాయాళ్ళు... కడుపు మండి న్యాయమడిగితే ఎర్రోడన్నారు నాయాళ్లు..' అంటూ ప్రస్తుత వ్యవస్థలోని దుర్మార్గాన్ని ఎండగడతాడో సినీకవి. కుల, మతాల పేరుతో ఓట్లు దండుకునే కుటిల వ్యూహాలు, ప్రజలను బిచ్చగాళ్ళను చేసే వాగ్దానాల వాగాడంబరాలు, విజ్ఞత లోపించిన నేతలు ప్రజలతో ఆడుకొనే క్రూర పరిహాసం. అందుకే... 'కులాల కోసం గుంపులు కడుతూ, మతాల కోసం మంటలు పెడుతూ/ ఎక్కడలేని తెగువను చూపి తగువుకి లేస్తారే, జనాలు తలలర్పిస్తారే/ సమూహక్షేమం పట్టని స్వార్థపు ఇరుకుతనంలో ముడుచుకు పోతూ/ మొత్తం దేశం తగలడుతోందని నిజం తెలుసుకోరే, తెలిసి భుజం కలిపి రారే' అంటూ ప్రజలను ప్రశ్నిస్తాడు మరో కవి. అంతిమంగా దేశ స్వాతంత్ర్యాన్ని పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల పాదాక్రాంతం చేయడం, బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించిన వీరుల త్యాగాలకు తిలోదకాలివ్వడం, అంబానీలు, అదానీల అంతులేని ధనార్తికి దోహదం చేయడం నేటి పాలకుల దుర్నీతికి నిదర్శనం.

ఒక దేశ చరిత్రలో 70 ఏళ్లు అంటే తక్కువ సమయమేమీ కాదు. పాలకులు చిత్తశుద్ధిగా ప్రజల సంక్షేమాన్ని కోరుకుని ఉంటే... ఈ 70 ఏళ్ల స్వాతంత్ర్యం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా వుండేది కాదు. ఇది స్వరం మారిన వందేమాతర గీతం. ఇది వరస తప్పిన స్వతంత్ర భారతం. కార్పొరేట్లు గానం చేస్తోన్న సామ్రాజ్యవాద స్తోత్రగీతం. శ్రీశ్రీ చెప్పినట్టుగా 'ఇది మనకొక దీక్షా సమయం! ఇది మనకు పరీక్షా సమయం!'. దేశ స్వేచ్ఛకోరి తిరుగుబాటు చేయాల్సిన తరుణం. 'నా ఒక్కడి వల్లే ఈ దేశం మారిపోతుందా? అనుకునే ఏ ఒక్కడివల్లా ఈ దేశానికి ఉపయోగం లేద'ని ఫైడల్ క్యాస్ట్రో అంటాడు. ఇది అంగాంగం దోపిడీకి గురవుతున్న కన్నతల్లి జీవితం. 130 కోట్ల భారతావని ఆత్మవిశ్వాసంతో అప్రతిహతంగా ముందుకు సాగాలంటే... బడా బూర్జువాల, భూస్వాముల వారి సామ్రాజ్యవాద తాబేదార్ల అధికారం దించాలి. కులమతాలను పెంచి పోషించే అభివృద్ధి నిరోధకుల వెన్ను విరవాలి. భిన్నత్వంలో ఏకత్వం అనే మౌలిక సూత్రాన్ని కాపాడుకోవాలి. నిర్బంధాలకు వెరవక, ప్రలోభాలకు లొంగక, బెదిరింపులకు జడవక ముందుకు సాగే స్వేచ్ఛా భారతానికి ఊపిరిలూదాలి. ఓ కవి చెప్పినట్టుగా... 'జలియన్ వాలాబాగు దురంతపు/ నెత్తుటి ధారలు హత్తుకొని/ ఉరికొయ్యల చెరసాలల గోడల/ దారుణాలు తలకెత్తుకొని/ మృత వీరుల గాధలు తెలుసుకొని' దిగంతాలకు వినిపించేలా పాడదాం స్వేచ్ఛాగీతం... ఎగరేద్దాం జాతిపతాకం.

ప్రజాగళం

పారిశుధ్యంపై అవగాహన



ఇతర పట్టణాలు, పల్లెల నుండి వలసలు పెరగడంతో విజయవాడ ప్రాంతాల్లో జనాభా పెరిగిపోయింది. దీంతో నగరమంతా కిక్కిరిసినట్లుగా తయారవుతోంది. జనం పెరిగితే వాడకం పెరుగుతుంది. అందుకు తగ్గట్టుగా చెత్త పేరుకుపోతోంది. గతంలో ఇళ్ళల్లో ఇంత తడి చెత్త వుండేది కాదు. విపరీతంగా పెరిగిన ఫాస్ట్‌ఫుడ్స్ వేస్టేజి, పళ్ళ తొక్కలు వంటి వాటితో తడి చెత్త ఎక్కువవుతోంది. పారిశుధ్య కార్మికుల బండిలో చెత్తను వేయకుండా తమ ఇంటిముందున్న డ్రైనేజీల్లోనే వేసేస్తున్నారు. ఆ డ్రైనేజీల పక్కనే ఫాస్ట్‌ఫుడ్స్ బళ్లు పెట్టి అమ్ముకుంటున్నారు. అవి తిన్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చెత్తే కదా అని తేలికగా తీసుకొని ఎక్కడపడితే అక్కడ వేస్తున్నంత వరకు ఈ తిప్పలు తప్పవు. అందుకే పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన తీసుకు రావాలి. దీనికోసం పార్టీలకు అతీ తంగా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. అప్పుడే సమస్య పరిష్కారం అవుతుంది.

– కె వసుంధర, ముత్యాలంపాడు.

జిఎస్‌టి కల్లోలం



జిఎస్‌టి అమలుతో చిన్న వ్యాపారస్తులు కూడా కంప్యూటర్ వాడవల్సిన అవసరం వచ్చింది. అనేక గ్రామాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, జిఎస్‌టి బిల్లు అవగాహన లేని వారు కూడా కంప్యూటర్‌తో పని చేయాల్సి వస్తోంది. జమ, ఖర్చులు, అమ్మకం, కొనుగోళ్ళు రికార్డు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మన దేశంలో చిన్నదైనా, పెద్దదైనా వ్యాపారాల మీద ఆధారపడి వున్నవారు ఎక్కువమందే వున్నారు. ఇది కాక వస్తువులను సరఫరా చేసిన చోటనే పన్ను విధింపుతో కొనుగోలు చేయాలి. వీటి అన్నింటికి కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు పది నుంచి పదిహేను వేల రూపాయలతో ప్రోగ్రాం తయారు చేసి ఇస్తున్నారు. ఆడిటర్స్ ద్వారానే రిటర్న్ ఫైల్ చేయాల్సి వుంది. దీనికి కంప్యూటర్‌లో డిగ్రీ లేకపోయినా కంప్యూటర్ పరిజ్ఞానం వుంటే సరిపోతుంది. మరి అందుకు తగ్గ సిబ్బంది అన్ని చోట్లా వుంటారా? మారుమూల గ్రామాల్లో వ్యాపార స్థాయిలు లేకపోయినా పంటల అమ్మకాలు, కొనుగోళ్ళు తప్పక వుంటాయి. మరి ఆ ప్రాంతాల్లో వారి పరిస్థితి ఏంటి? దీని కోసం ప్రభుత్వమే చొరవ చూపాలి. విద్యార్థి దశ నుంచే కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలి.

– ఎం శ్రీధర్, సూర్యారావుపేట, విజయవాడ.


గాడి తప్పిన బాబు పాలన



గత మూడేళ్ళుగా అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రం లోనూ అరాచక పాలన కొనసాగుతోంది. ప్రజల మౌలిక సమస్యలతో పాటు సాధారణ సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వ రంగ పాలనా వ్యవస్థలు ప్రజలకు మేలు చేయకుండా బడా బాబులకు ఉపయోగపడే జేబు సంస్థలుగా మారి పోయాయి. ప్రపంచానికే పాఠాలు చెప్పానని, గొప్ప పాలనా అనుభవం వుందని గొప్పలు చెప్పుకొనే చంద్రబాబు మూడేళ్ళ పాలన పూర్తిగా గాడి తప్పింది. మంత్రులు సైతం తన మాట వినే స్థితిలో లేరు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన స్థానిక స్వ పరిపాలన వ్యవస్థను కాదని జన్మభూమి కమిటీల పేరుతో పచ్చ చొక్కాలకు అధికారం ఇచ్చారు. వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. దీంతో స్థానిక స్వ పరిపాలన వ్యవస్థ నిర్వీర్యమై పోయింది. ఇలా ఒక పక్క సర్కారు నిర్లక్ష్యం, వ్యాపారుల మాయజాలం, దళారుల దోపిడీ వెరసి రైతులను మింగేస్తున్నాయి. రైతు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన బాబు అధికారం లోకి వచ్చాక షరతులు విధించారు. దీంతో రైతుల పరిస్థితి అంతకంతకూ దిగజారిపోతోంది. డ్వాక్రా సంఘాల పేరిట బ్యాంకుల్లో వున్న అప్పుల్లో రూపాయి కూడా ప్రభుత్వం మాఫీ చేయలేదు. ఈ మూడేళ్ళల్లో వడ్డీ భారం రూ.750 కోట్లు పెరిగింది. పెట్టుబడిగా ఇస్తామన్న సొమ్మును కూడా రెండు విడతలుగా, అదీ ఇస్తామన్న దానికంటే తక్కువగా ఇచ్చి చేతులు దులుపు కున్నారు. విద్యారంగం కూడా అస్తవ్యస్తంగా మారింది. పిల్లలు తక్కువగా వున్నారనే సాకు చూపిస్తూ ప్రభుత్వ బడులను మూసివేస్తున్నారు. మద్యపానం నియంత్రిస్తా మని వాగ్దానం చేసిన బాబు ఊరు, వాడా బెల్టుషాపులు విస్తరించారు. గ్రామాల్లో తాగు నీరు దొరకటం లేదు గాని మద్యం మాత్రం ఏరులై పారుతోంది. 'జాబు రావాలంటే బాబు రావాలి' అంటూ ఊదరగొట్టిన బాబు ఇంతవరకూ ఉద్యోగాల భర్తీ చేయలేదు. నిరుద్యోగ భృతిని ఇవ్వడంలో కూడా డొల్లతనం చూపిస్తున్నారు. నామమాత్రం నిధులు విడుదల చేసినా అవి కూడా నిరుద్యోగులకు అందడం లేదు. ఇలా బాబు చేసిన మాటల గారడీ అంత ఇంతా కాదు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే రాజధాని నిర్మాణం పేర ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన భూములను ల్యాండ్ పూలింగ్ నెపంతో సేకరించారు. మూడేళ్ళవుతున్నా రాజధాని కాగితాల్లోనే వుంది కాని నేల మీదకు రాలేదు. రాజ్యాంగంలో రాసుకున్న ప్రజా సంక్షేమాన్ని అమలు చేసి ప్రజలకు మేలు చేయాలేకాని వారిపై స్వారీ చేయకూడదు. ఏదేమైనా ఈ పెట్టుబడిదారీ రాజకీయాలు ప్రజల సమస్యలు పరిష్కరించట్లేదని చరిత్ర చెబుతోంది. ప్రజలు మరో ప్రత్యామ్నాయ రాజకీయాలను నిర్మించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

– షేక్ కరిముల్లా.


సొమ్ము ఏమయ్యింది?



ఆర్‌బిఐ గవర్నర్ పాటకు ఇటు ప్రధాని అటు ఆర్థిక మంత్రి తాళం వేస్తే... దేశ ప్రజలు త్వరలో బిజెపికి బుద్ధి చెప్తారు. ఎందుకంటే పెద్ద నోట్లు రద్దు చేసిన మోడీ, వాటిని మార్చుకునేందుకు 50 రోజులు గడువు ఇచ్చారు. ఈ లోపునే దేశంలోని ప్రజల వద్ద వున్న ధనమంతా బ్యాంకులకు వచ్చేస్తుందని ఢంకా బజాయించి మరీ చెప్పారు. కాని ఆ గడువు ముగిసి ఆరు నెలలు అంటే అక్షరాల 180 రోజులయ్యింది. ఇంత సమయం అయినా ఎన్ని నోట్లు వెనక్కి వచ్చాయో ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్‌కి తెలియదంటే సామాన్య ప్రజలే నమ్మరు, అటువంటిది సాక్షాత్తు పార్లమెంట్ స్థాయీ సంఘం ముందు ఆయన ఇచ్చిన ఈ సమాధానానికి మోడీ, జైట్లీ వంత పాడారు. ఇది ప్రజలను అవమానించడమే! మన దేశంలోని ప్రతి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏ రోజు గణాంకాలు ఆ రోజే లెక్కకడతారు కదా! మరి దేశ వ్యాప్తంగా జరిగిన ఈ పెద్దనోట్ల రద్దుతో బ్యాంకులకు చేరిన నగదు ఎంతో ఇంతవరకూ తేలలేదంటే నమ్మగలమా! బ్యాంకులు ఇచ్చిన నోట్లు ఆర్బీఐకు చేరిన తర్వాతే కొత్తనోట్లు ఇస్తారు. ఎప్పుడైనా ఆర్బీఐకి సిబ్బంది కొరత వుంటే ఆ సొమ్మును లాకర్‌లో పెట్టి తర్వాత రోజున లెక్కపెడతారు, అంతేకాని ఇలా నెలలకొద్దీ లాకర్లలో వుంచరు. అయినా దేశంలోని ప్రజలందరి సొమ్ము బ్యాంకులకు చేరితే ఎన్ని లాకర్లలో పెడతారు. ఇంత వరకు లెక్క తేలలేదని ఆర్బీఐ గవర్నరు చెబుతున్నారంటే ప్రభుత్వం ఆశించిన తీరులో సొమ్ము జమ అవ్వలేదా? లేక బ్యాంకులకే కాక వ్యక్తిగతంగా సంస్థలకు జమ చేశారా అన్న అనుమానం రాకపోదు. అందుకే నోట్ల జమకు చెందిన వివరాలు బయట పెట్టకుండా తాత్సారం చేస్తున్నారు. ఇప్పటికైనా లెక్కించిన సొమ్ము ఎంతో వెంటనే ఆర్బీఐ గవర్నర్ బహిరంగపరచాలి. మిగిలిన సొమ్ము లెక్కించటానికి ఎంత సమయం పడుతుందో తక్షణం మీడియా ద్వారా ప్రజలకు తెలియపర్చాలి. నోట్లరద్దుతో అష్టకష్టాలు పడిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి వుంది. బాధ్యతను విస్మరిస్తే ఇబ్బందులు పడ్డ జనం ఎంతకైనా తెగిస్తారు. ఓటు ద్వారా రాబోయే ఎన్నికల్లో పాలకులకు తగిన గుణపాఠం చెబుతారు.

– సివిఆర్ కృష్ణ.

వ్యవసాయ రుణాలపై ఆర్థిక సర్వే వక్రభాష్యాలు



సారంపల్లి మల్లారెడ్డి

రైతురంగం

భారత ఆర్థిక సర్వే రెండవ భాగాన్ని పార్లమెంట్‌లో ప్రవేశ పెడుతూ 'రైతుల రుణాలు మాఫీ చేయడం వల్ల ధరలు మరింత తగ్గుతాయని, జిడిపి పెరుగుదలపై ప్రభావం ఉంటుందని, బ్యాంకుల అస్తిత్వం దెబ్బతింటుందని' ప్రకటించారు. ధరలు తగ్గడానికి, రైతుల రుణ మాఫీకి అంటగట్టడం అంటే 'మోకాలికి, బోడిగుండుకు జత పెట్టడమే'. ఈ వ్యాఖ్య ఆర్థికవేత్తలకే కాక సామాన్య పామర జనానికి కూడా హాస్యాస్పదంగా ఉంది. అనేక మంది కుహనా ఆర్థికవేత్తలు వ్యవసాయ రుణాలపై చాలా కాలంగా ఇలాంటి వ్యాఖ్యానాలు చేస్తూనే ఉన్నారు. బహుళ జాతి సంస్థలు, గుత్త సంస్థల రుణాలను రద్దు చేసినా పల్లెత్తు మాట అనని వీరు వ్యవసాయ రుణాల మాఫీ ప్రచారం జరుగుతున్నదంటేనే లబో, దిబో అంటున్నారు. బ్యాంకులు కూడా రైతుల రుణాలు మాఫీ చేస్తే తమ అస్తిత్వానికి ప్రమాదం అని ప్రకటనలు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలలోనే పేరెన్నికగన్న పారిశ్రామికవేత్తలు ల్యాంకో, కావూరి సాంబశివరావు లాంటి వారి ఇళ్ల ముందు... తమ రుణాలు చెల్లించాల్సిందిగా కోరుతూ బ్యాంకులు ధర్నాలు నిర్వహించిన సంగతి ప్రజలు మర్చిపోలేదు. భారత దేశంలో బ్యాంకుల డిపాజిట్లు రూ.96 లక్షల కోట్లు కాగా దాదాపు రూ.30 లక్షల కోట్లు 20 కుటుంబాలకు చెందిన బడా పారిశ్రామికవేత్తలు బాకీలు పడి ఉన్నారు. వీటిని మాఫీ చేయడానికి భారత ప్రభుత్వం సుముఖంగా ఉంది. ఏటా రూ.4 లక్షల కోట్ల మేరకు బడా పెట్టుబడిదారుల రుణాలు మాఫీ చేస్తూనే ఉన్నారు. అంతేకాక ఏటా రూ.5.50 లక్షల కోట్ల పన్ను రాయితీ ఇస్తున్నారు. ఇవేవీ ధరలపై ప్రభావం చూపడం లేదా? జిడిపికి నష్టం కలగడం లేదా? మొత్తం వ్యవసాయ రుణాలు రద్దు చేయడం వల్ల బ్యాంకులు దివాళా తీస్తాయన్నది అవాస్తవమని ఆర్థిక సర్వే పరిశీలన ద్వారా అర్థం చేసుకోవచ్చు.

దేశ ఆర్థికాభివృద్ధి ఉత్పత్తి రంగాలపై ఆధారపడి వృద్ధి రేటును నిర్ణయిస్తారు. అందులో ప్రాథమికంగా ఉన్న వ్యవసాయ రంగం, ద్వితీయ రంగంగా ఉన్న పారిశ్రామిక రంగం, తృతీయ రంగంగా ఉన్న సేవారంగాల ఉత్పత్తిని పరిగణలోకి తీసుకుని జిడిపిని నిర్ణయిస్తారు. స్థిర ఆదాయంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ఉత్పత్తే కీలకం. 1965 నుండి 1985 వరకు వ్యవసాయ రంగంలో ఉత్పత్తి, ఉత్పాదకత 5 రెట్లు పెరిగింది. జనాభా 4 రెట్లు పెరిగింది. అందువల్ల, ఆహార లభ్యతలో స్వయం సమృద్ధి సాధించగలిగాం. 1985 నుండి 1993 వరకు వ్యవసాయ రంగం ఉత్పత్తి ఎదుగూ, బొదుగూ లేకుండా స్థిరంగా ఉంది. 1995లో డబ్ల్యుటివోపై సంతకం పెట్టిన తరువాత వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావాలు కలిగాయి. విత్తన రంగం 80 శాతం బహుళ జాతి సంస్థల పరమైంది. దేశీయ విత్తన సంస్థలన్నీ మటుమాయ మైనాయి. నాణ్యత లేని విత్తనాల వల్ల ఏటా 25 శాతం పంటలకు నష్టం వాటిల్లుతుంది. 2004లో రూపొందించిన విత్తన చట్టం 2017 నాటికి కూడా పార్లమెంట్‌లో చట్టం కాలేదు. వ్యవసాయ ఉపకరణాల్లో రెండవ అతి ముఖ్యమైన రుణ లభ్యతలో బ్యాంకులు సంస్కరణల తరువాత తగ్గించి వేశాయి. రిజర్వు బ్యాంకు ఆదేశిక సూత్రాల ప్రకారం మొత్తం డిపాజిట్లలో 18 శాతం పంట రుణాలకు, 22 శాతం వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణ సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం ఉన్న రూ. 96 లక్షల కోట్ల డిపాజిట్లలో రూ.16 లక్షల కోట్లు భారత దేశంలో వ్యవసాయ రుణాలివ్వాలి. కానీ, గత సంవత్సరం రూ.8 లక్షల కోట్లు మాత్రమే భారత బడ్జెట్‌లో కేటాయింపులు చూపించి రూ.6 లక్షల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. తగినంత రుణం ఇవ్వకపోవడం వల్ల భారత రైతులు ప్రయివేట్ రుణాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. దాంతో ప్రయివేట్ వడ్డీ రుణ భారం పెరిగిపోయింది. పలు రాష్ట్రాలలో 50–82 శాతం వరకు రైతులు రుణగ్రస్తులైనారు. దీనికి తోడు పెట్టుబడి కూడా ధరలు నిర్ణయించడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోవడం, రైతులకు ఉపకరణాలు అందుబాటులో ఉంచకపోవడం వల్ల పంటల దిగుబడులు దెబ్బతిని రుణగ్రస్తులై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. సంస్కరణలు ప్రవేశపెట్టిన నాటి నుండి నేటికీ 4 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆత్మహత్యలకు ప్రధాన కారణం రైతుల రుణ భారం మాత్రమే. దేశవ్యాపితంగా ఆర్థిక సర్వే ప్రకారం రైతుల రుణ భారం రు. 2.7లక్షల కోట్లు ఉండవచ్చునని అంచనా వేశారు. అదే సందర్భంలో 20 పెట్టుబడిదారీ కుటుంబాలు రు. 28 లక్షల కోట్లు బాకీలు ఎగనామం పెట్టబోతున్నాయి. దేశ జిడిపిలో 15 శాతం ఉత్పత్తి చేస్తున్న వ్యవసాయ రంగం బాకీలు రు. 2.7 లక్షల కోట్లు మాఫీ చేయడం వల్ల భారత ఆర్థిక రంగంపై ఎంత ప్రభావం పడబోతోంది.



వాస్తవాలు పరిశీలించి ఇప్పటికైనా వాస్తవ సాగుదారులకు ఉన్న మొత్తం సంస్థాగత, ప్రయివేట్ రుణాలను రద్దు చేయాలి. ప్రపంచ జనాభాలో రెండవ స్థానంలో ఉన్న భారతదేశంలో అందరికీ ఆహారం అందించాలంటే వ్యవసాయ రంగానికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి.

ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ విడుదల చేసిన అప్పుల జాబితా

ముఖేశ్ అంబాని – రూ. 1,87,070 కోట్లు, అనిల్ అంబాని– రూ.1,24,956 కోట్లు, రూలియా బ్రదర్స్– రూ.1,01,461 కోట్లు, అనిల్ అగర్వాల్ – రూ. 1,03,340 కోట్లు, గౌతమ్ అదాని – రూ. 96,031 కోట్లు, సిరస్ మిస్త్రి – రూ.80,701 కోట్లు, మనోజ్‌గౌర్ – రూ. 75,163 కోట్లు, సజ్జన్ జిందాల్ – రూ. 58,171 కోట్లు, ల్యాంకో మధు – రూ.47,102 కోట్లు, జి.యం.ఆర్ – రూ.47,976 కోట్లు, వియన్ దూప్ – రూ.45,400 కోట్లు, జి.వి.కె – రూ.33,933 కోట్లు. వీరితో పాటు సహారా గ్రూప్, విజయ్ మాల్యా, రేణుకా షుగర్స్, నవీన్ జిందాల్, డిఎల్‌ఎఫ్ ప్రాపర్టీస్ కలుపుకుని రూ.28 లక్షల కోట్లు మొండి బకాయిలు ఉన్నాయి (భారత్ 2017–18 బడ్జెట్ 21.60 లక్షల కోట్లు మాత్రమే).

పాలక వర్గాలు 1997 నుండి వ్యవసాయ రంగం లోకి కార్పొరేట్ సంస్థలను ఆహ్వానిస్తున్నాయి. కార్పొరేట్ల వద్ద డబ్బులు బాగా పోగుపడటంతో మరొక వ్యాపారం లేనటువంటి ఈ సంస్థలు వ్యవసాయాన్ని తమ ఆధీనం లోకి తెచ్చుకోవడానికి పాలక వర్గాలతో లాలూచీ పడుతున్నాయి. ఇప్పటికే 30 కార్పొరేట్ వ్యవస్థలు భారీ వ్యవసాయాన్ని యంత్రాలతో కొనసాగిస్తున్నాయి. ఎంత రుణగ్రస్తులైనా భూములు వదులుకోవడానికి ఇష్టపడని రైతులను బలవంతంగా తొలగించడానికి 'రుణమాఫీ వల్ల ధరలు తగ్గుతాయని' ప్రచారం సాగిస్తున్నారు. వాస్తవానికి వ్యవసాయ ఉత్పత్తులు అందరికీ తక్కువ ధరలకు లభించాలి. అలా జరగాలంటే ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గాలి. వ్యవసాయోత్పత్తుల వ్యయంపై కనీసం 50 శాతం అధనపు ఆదాయం రావాలి. దేశంలో ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా మన దేశంలోనే ఎందుకు ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి? దీనిపై వేసిన కమిషన్లు ఇచ్చిన నివేదికలను ఎంతవరకు అమలు చేస్తున్నారు?

ఒకవైపున సహకార వ్యవస్థను దెబ్బతీసి, ప్రస్తుతం బ్యాంకులు రైతులకు రుణాలివ్వడం తగ్గించి వేశాయి. ఈ స్థితిలో వ్యవసాయానికి రక్షణగా సహకార వ్యవస్థను పటిష్టపరచాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లను సహకార వ్యవస్థలో డిపాజిట్ చేయాలి. ప్రభుత్వ డిపాజిట్లను కూడా వాణిజ్య బ్యాంకులే తక్కువ వడ్డీకి కాజేస్తున్నారు. ప్రభుత్వాధికారులకు బహుమానాలు ఇచ్చి ప్రభుత్వ బడ్జెట్లను తమ బ్యాంకులలో డిపాజిట్లు పెట్టుకుంటున్నారు. ఆవిధంగా కాక ప్రజల నుండి సేకరించిన రాష్ట్ర, కేంద్ర బడ్జెట్ మొత్తాలను సహకార వ్యవస్థలో పెట్టడం ద్వారా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తగినన్ని నిధులు అందుబాటులో పెట్టవచ్చు. కానీ, వాణిజ్య బ్యాంకులు ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి డిపాజిట్లు సేకరిస్తున్నారు. ప్రభుత్వ డిపాజిట్లు లేకుండా బ్యాంకులు మనగలుగుతాయా? సహకార బ్యాంకులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్‌ను డిపాజిట్ చేయడం ద్వారా అభివృద్ధి చేయవచ్చు. అలాగే ప్రభుత్వాలు రుణ మాఫీ ప్రకటించిన బ్యాంకులపై భారం పడదు.

తెలుగు రాష్ట్రాలలో తెలంగాణలో రు. 17 వేల కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రు. 24 వేల కోట్లు మాఫీ ప్రకటించినప్పటికీ, ఇంకా తెలంగాణలో రు. 35 వేల కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రు. 54 వేల కోట్లు బాకీ ఉన్నారు. ఈ బాకీలలో కూడా వ్యవసాయం చేయకుండా పట్టణాల్లో వ్యాపారాలు చేసుకునేవారు వ్యవసాయం పేరుతో రుణాలు పొందారు. మాఫీల వల్ల వారు ఎక్కువ లబ్ధి పొందుతున్నారు. వాస్తవ సాగుదారుకు రుణమాఫీ వర్తించింది చాలా తక్కువ. భూ రికార్డులు వాస్తవ సాగుదారుల పేరుతో లేకపోవడంతో భూస్వామ్యరైతులు పెద్ద మొత్తాల్లో మాఫీని కాజేస్తున్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణం. నేటి రైతులకు ఉపకరణాలు ఉచితంగా సరఫరా చేయాలి. ప్రయివేట్ రుణాల జోలికి వెళ్లకుండా సంస్థాగత వడ్డీ లేని రుణాలను ఇవ్వాలి. దీంతోపాటు ముందే పంటల ధరలు నిర్ణయించి అమలు జరపాలి. ప్రకృతి వైపరీత్యాల పరిహారాన్ని పూర్తిగా చెల్లించాలి. అప్పుడు రుణ మాఫీ సమస్య తలెత్తదు. ఇతర దేశాలలోని విధానాలను అనేక మంత్రివర్గ బృందాలు పరిశీలించి వచ్చినప్పటికీ ఏ ఒక్క విధానాన్నీ అమలు జరపలేదు. భారత పెట్టుబడిదారీ పాలక వర్గాలు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థల పరం చేయడం లక్ష్యంగా కొనసాగుతున్న దృష్ట్యా ఆర్థిక సర్వేలు ఇలాంటి వక్రభాష్యాలనే ప్రచారం చేస్తుంటాయి. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంతో దీనికి బహుళ ప్రచారం వస్తుంది. లక్షల్లో వేతనాలు పొందేవారు కూడా రైతుల రుణ మాఫీని వ్యతిరేకిస్తున్న ఘటనను చూస్తుంటే భారత ఆర్థిక విధానం ఎటువైపు వెళ్తుందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవాలు పరిశీలించి ఇప్పటికైనా వాస్తవ సాగుదారులకు ఉన్న మొత్తం సంస్థాగత, ప్రయివేట్ రుణాలను రద్దు చేయాలి. ప్రపంచ జనాభాలో రెండవ స్థానంలో ఉన్న భారతదేశంలో అందరికీ ఆహారం అందించాలంటే వ్యవసాయ రంగానికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి.

(రచయిత అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు)
9490098666

అభద్రత కాదు ఆత్మస్థైర్యం కావాలి



డా॥ కత్తి పద్మారావు

విశ్లేషణ

ఒక దశాబ్దం పాటు భారత దేశానికి ఉపరాష్ట్రపతిగా వున్న మహ్మద్ హమీద్ అన్సారీ రాజ్యసభ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆలోచించాల్సిన ఒక అంశాన్ని పేర్కొన్నారు. 'ముస్లింలలో భయం నెలకొంది. వారు అభద్రతతో ఉన్నట్టు భావిస్తున్నారు. భారత ముస్లింల మనోభావాల గురించి ఇది సరైన అంచనాయేనా లేక అతిశయీకరించినదా?' అని అన్సారీని ఇంటర్వ్యూ చేసిన కరణ్ థాపర్ ప్రశ్నించారు. 'దేశం లోని విభిన్న వర్గాల నుంచి వినవస్తున్న వాటన్నిటిని బట్టి చూస్తే నిజమే. అది సరైన అంచనాయే. బెంగళూరులో కూడా నేను అదే విషయాన్ని వింటున్నాను. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా విన్నాను. ఉత్తర భారతంలో మరింత ఎక్కువగా విన్నా. ఇబ్బందిలో ఉన్న భావన, అభద్రతా భావం మెల్లగా వ్యాపిస్తున్నాయి' అని హమీద్ అన్సారీ సమాధానం చెప్పారు. నిజానికి భారత దేశంలో మైనార్టీలు అభద్రతలో ఉన్నారనే మాట 150 కోట్ల భారతీయుల్లో 100 కోట్ల మందినైనా ఆలోచింపచేసి వుంటుంది. ఎందుకంటే అన్సారీ మేధావి. తొందరపడి మాట్లాడేవాడు కాదు. మేధావి అంటే ఎవరు? సత్యమే పలకాలన్న కోరిక ఉన్నవాడే నిజమైన మేధావి. ప్రతి కార్యాన్ని, ప్రణాళికను, వ్యవస్థను ప్రశ్నించగలిగే హేతుబద్ధత ఉన్నవాడు. భారత దేశంలో ఈ తరహా మేధావుల సంఖ్య తగ్గుతున్న సందర్భంగా అన్సారీ లాగే ముస్లింలే కాదు, క్రైస్తవులు, జైనులు, బౌద్ధులు, హేతువాదులు అందరూ ఆందోళనలోనే వున్నారు.

ఇటీవల హిందూ మతోన్మాదంతో చెలరేగి పోతున్న ఆర్.యస్.యస్, విశ్వహిందూ పరిషత్ వంటి సంస్థలు... ఆలోచనాపరుల మీద, హేతువాదుల మీద, చరిత్రకారుల మీద దాడులు చేస్తున్న సందర్భంగా అన్సారీ కంటే ముందే భారత్, అమెరికా, ఇంగ్లాండ్ తదితర దేశాలకు సంబంధించిన మేధావులు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న రాజకీయ వాతావరణం.... సహన సంప్రదాయాలు, వాక్ స్వాతంత్ర్యం, మత స్వేచ్ఛకు హాని కల్గిస్తుండడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత నెల 26న ప్రముఖ భారతీయ చరిత్రకారులు ఒక ప్రకటన చేస్తూ ఇదే విధమైన ఆందోళన వ్యక్తం చేశారు. శతాబ్దాలుగా నాగరిక ప్రపంచమంతటా భారతీయ సహన సంప్రదాయాలు ప్రశంసలు పొందుతున్నాయి. ఇప్పుడు వాటికి ముప్పు వాటిల్లడంపై చరిత్రకారులు సహజంగానే కలవరపడుతున్నారు. భారత్ వెలుపల అన్ని ఖండాలలోని వివిధ దేశాల విశ్వవిద్యాలయాలలో సమున్నత భారతదేశ చరిత్ర, సమాజం గురించి బోధనా పరిశోధనలు చేస్తున్న మేము భారతీయ చరిత్రకారుల ప్రకటనకు సంఘీభావం వ్యక్తం చేసేందుకు ఈ బహిరంగ లేఖ రాస్తున్నాం అన్నారు. 'భారత్‌లో ఇటీవల నెలకొన్న కొన్ని పరిణామాలు రచయితల, మేధావుల, కళాకారుల స్వేచ్ఛకు, చారిత్రక సామాజిక పరిశోధనలకు, ప్రతికూల పరిస్థితులను సృష్టించడంపై వ్యక్తమవుతోన్న తీవ్ర ఆందోళనలో మేమూ పాలుపంచుకొంటున్నాం' అన్నారు. ఆ పరిణామాలు సంకుచిత తత్వాన్ని, అసహనాన్ని, మత దురహంకారాన్ని దేశంలో సర్వవ్యాప్తం చేస్తున్నాయి. అంటే అన్సారీ తన పదవిలో వున్నప్పుడు చెప్పడానికి సందేహించిన అంశాలను వీరు ముందే బయటపెట్టారు. స్వాతంత్ర్యం వచ్చే కాలంలో భారతదేశంలో ఉండేటటువంటి ముస్లింలు, ముస్లిం హక్కులకు భంగం కలుగకూడదని అజాద్ ముస్లిం కాన్ఫరెన్స్ నిర్ధారించింది. డా॥బి.ఆర్.అంబేద్కర్ 'ముస్లింలు భారత దేశంలో భాగం. వారు బయటివారు కాదు. ఇక్కడ భారత దేశంలో పుట్టి ముస్లిం మతాన్ని స్వీకరించిన వారే. వారిలో జాతీయతకు ఎటువంటి కొదవు లేదు. పైగా స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిలో ముస్లింలు ఎంతో ఘనమైన పాత్రను నిర్వహించిన వారు వున్నార'ని చెప్పారు. దేశ స్వాతంత్ర్య సాధనకు ఇతరులతో సమానంగా ముస్లింలు కూడా త్యాగాలు చేశారు.



ముస్లింలు భారతదేశంలో ఎన్నో కళాఖండాలు సృష్టించారు. అరబ్ భాషలోని అనంత జ్ఞానాన్ని తీసుకొచ్చారు. అక్బర్ వంటి ముస్లిమ్ రాజులు శాంతి సామరస్యాలను భారతదేశంలో పాదుకొల్పారు. ముస్లిం అనేది ఒక మతం కాదు. ఒక సంస్కృతిగా విస్తరిస్తుంది అనే ఆధునిక భావాలు విస్తరిస్తున్నాయి. భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరు అనేక సంస్కృతీ సమ్మేళనాల ద్వారా నూతన రూపాన్ని ఆవిష్కరించారు. ఈ సామాజిక రాజకీయ సత్యాన్ని మరచిపోయి, ఎవరి ధర్మాన్ని వారు ఇతరులకు హాని జరగకుండా బోధించుకోవడం ప్రజాస్వామ్యం అవుతుంది. ఈ మతాలన్నిటి కంటే శాస్త్ర జ్ఞానం పెంపొందే కొలది హేతువాదులు నాస్తికులు పెరుగుతున్నారు. హేతువాదుల సంఖ్య భారతదేశ వ్యాప్తంగా ఈనాడు శాస్త్రజ్ఞానాన్ని జీవితానికి సమన్వయం చేసుకొని పెరుగుతుంది. ఉపాధి కోసమే శాస్త్రాన్ని అధ్యయనం చేయడం కంటే, భౌతిక ప్రపంచాన్ని దాని నియమాల నుండి అధ్యయనం చేయడం ద్వారా మనిషి కులమత భేదాలు లేకుండా అందరిని సమానంగా ప్రేమించగలుగుతాడనే అవగాహన పెరుగుతోంది. వీటన్నింటికి తోడు అసంఖ్యాకులైన భారతీయ శ్రామికులు కారల్‌మార్క్స్ భావజాలంతో సంఘటిత స్వరం వినిపిస్తున్నారు.

హిందువులు అభద్రతలో నుండి హిందూ మహాసభ పుట్టింది. ముస్లింల అభద్రతలో నుండి ముస్లింలీగ్ పుట్టింది. అభద్రత నుండే ఉగ్రవాద ఉన్మాద చర్యలు పుడతాయి. మానవులను జ్ఞానం నుండి, హేతువాద భావనల నుండి సాంకేతిక ప్రగతి నుండి ఐక్యం చేయాల్సింది పోయి మత భావన నుండి అభద్రతను కలిగించే మాటలు, చేతలకు హిందూమతోన్మాదులు పాల్పడుతున్నారు. మతాన్ని రెచ్చగొట్టడం ద్వారా వచ్చే రాజకీయాలు గాలికి కొట్టుకుపోక తప్పదు. ఎందుకంటే అవి అబద్ధాల పునాదుల మీద కట్టబడతాయి. నిజానికి భారత పౌరులెవ్వరూ అభద్రతలో వుండవలసిన అవసరం లేదు. అనేక సందర్భాల్లో రాజ్యాంగాన్ని కుదిపే అంశాలు భారతదేశంలో వస్తాయి. అయితే భారతదేశంలోని లౌకిక ప్రజాస్వామ్య వాదులు అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వస్తుంది. మాట్లాడటమే కాకుండా తమ మేథస్సుతో అనేక వైరుధ్యాలను సమన్వయం చేసుకోవాల్సి వుంది. చిన్న చిన్న వైరుధ్యాలతో ఛిన్నాభిన్నమై పోతున్న వారంతా మనకు ఎదురొస్తున్న పెను ముప్పును ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనాల్సిన అవసరం వుంది. భారత దేశానికి ఇప్పుడు వచ్చిన పెనుముప్పు సామాన్యమైంది కాదు. అది భారతీయుల స్వేచ్ఛ మీద, జీవన వ్యవస్థల మీద రాజ్యదండాన్ని అడ్డంపెట్టుకొని ఒక మతం పెత్తనంతో అణచివేయాలని చూడటమే కాక భారత రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైన చర్యలు పూనుకోవడం వాటికి అశాస్త్రీయమైన భాష్యాలను తాము కొనుక్కున్న మేధావుల చేత చెప్పించడం జరుగుతూ వుంది. ఈ సందర్భంగా ప్రతిపక్ష విపక్ష మిత్రపక్షాల్లో వున్న రాజకీయవేత్తలే కాక, సామాజిక సాంస్కృతిక వైజ్ఞానిక రంగంలో పనిచేస్తున్న వారిని కూడా కలుపుకొని వెళ్ళవలసిన చారిత్రక బాధ్యత అందరిమీద వుంది. మైనార్టీలు ఐక్యమైనప్పుడు మెజార్టీ అవుతారు. మెజార్టీగా వున్నవారు ఎప్పుడూ శాస్త్రీయంగా మైనార్టీలే. భారతదేశ రాజ్యాంగ సూత్రమే ఇది. ఈ దిశగా భారతదేశ పునరుజ్జీవనోద్యమానికి నడుం కడదాం.

(సామాజికత తత్వవేత్త, వ్యవస్థాపక అధ్యక్షుడు, నవ్యాంధ్రపార్టీ)
9849741695

జీవన the family







మెరిసే.. మెరిసే అద్దాలు మురిసే!

పార్టీలకో, ఫంక్షన్లకో రొటీన్‌గా వాడే డ్రెస్సులతోనో, చీరలతోనో వెళ్తే చాలా మూమూలుగా అనిపిస్తుంది. మిగతా సమయాల్లో ఎలా ఉన్నా... ప్రత్యేక సందర్భాలప్పుడు మాత్రం స్పెషల్‌గా కనపడాలని ఎవరికి మాత్రం ఉండదు చెప్పండి?. కానీ దానికి మొత్తం మీ దుస్తుల లుక్‌నే మార్చాల్సిన పనిలేదు. చాలా చిన్నచిన్న మార్పులతో లుక్ అంతటినీ మార్చేయొచ్చు. ఈ అద్దాలు అద్దిన చీరలనూ, డ్రెస్సులనూ ఒకసారి చూడండి ... నక్షత్రాల్లా భలే మెరిసిపోతున్నాయి కదా! ఇంకెందుకు ఆలస్యం చీరనో, డ్రెస్‌నో సెలెక్ట్ చేసుకుని, దాని లుక్ అంతటినీ మార్చేయండి మరి.

పుక్కిలింత ఓ పద్ధతి!

పుక్కిలించటమంటే నోటిలో నీరు పోసుకుని, బుగ్గల్ని కదపటమే అనుకుంటాం బ్రష్ చేసేప్పుడు కొందరు విచిత్రంగా తల పైకెత్తి అరుస్తుంటారు. కొందరు పళ్ల తోముకునే ముందు ఆయిల్ పుల్లింగ్ అంటూ పుక్కిలిస్తుంటారు. అయితే పుక్కిలించడానికి పద్ధతి ఉంది. పుక్కిలించేప్పుడు తలను వెనక్కు వాల్చి, ఆ తర్వాత పుక్కిలించాలి. దీని వల్ల నోటిలో నలుమూలలా నీరు వెళ్ళి బ్యాక్టీరియా బయటకు పంపేస్తుంది. ఇక పుక్కిలించేప్పుడు తలను బాగా పైకెత్తి గొంతు అంటే అంగిట్లోకి పోయేంతగా చేస్తే పూర్తిగా శుభ్రపడుతుంది. మామూలుగా పుక్కిలించటం వల్ల కేవలం నోటి ముందు భాగమే శుభ్రం అవుతుంది. కానీ లోపలి భాగం, అంటే కొండనాలుక వరకూ శుభ్రం కాదు. ఈ పద్ధతి ద్వారా లోపల దాగిన బ్యాక్టీరియాని శుభ్రపరచవచ్చు.



పుక్కిలించేప్పుడు మౌత్‌వాష్ లిక్విడ్ ఎక్కువగా తీసుకుంటే బాగా పని చేస్తుందనుకుంటారు కానీ ఇలా చేయటం వల్ల నోరు పొక్కిపోతుంది. అంతేకాక తక్కువగా వేసుకుని, తగినంతసేపు పుక్కిలిస్తేనే మంచిది. లిక్విడ్ వేసుకుని, నోటిలో నలుమూలలా వెళ్ళేలా చూసుకోవాలి. తరువాత ముందుకీ, వెనక్కీ బుగ్గల సాయంతో పుక్కిలించాలి. కొందరు వేడినీటితో పుక్కిలిస్తుంటారు. దీనికంటే చల్లటి నీటితో చేయడం వలన మౌత్‌వాష్ సరిగ్గా పనిచేస్తుంది. ఒకసారి పుక్కిలించిన తర్వాత నోటిలోని నీరు పూర్తిగా ఉమ్మివేయాలి. అప్పుడు నోటిలోని బ్యాక్టీరియా, క్రిములు బయటకు వచ్చేస్తాయి. నోటి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలంటే ఇలా చేయటం తప్పనిసరి. కొంచెం ఉప్పు వేసుకుని పుక్కిలించటం అనేది ఎంతో కాలంగా వాడుకలో ఉన్న అలవాటు. సాధారణంగా ఒక సగం టీస్పూన్ ఉప్పును తీసుకుని, దానికి వేడి నీటిని కలుపుకుని చేయవచ్చు. రోజుకు మూడుసార్లు కనుక చేస్తే గొంతు సంబంధిత సమస్యల నుంచీ బయటపడవచ్చు. ★


పిల్లలు అబద్ధాలెందుకు చెబుతారు?

సాధారణంగా పిల్లలు చిన్న చిన్న అబద్ధాలు చెబుతుంటే ఆ మాటలు వింటూ తల్లిదండ్రులు నవ్వుతుంటారు. అయితే ఆ పసికూనలు చెప్పే అబద్ధాల వల్ల ఏమవుతుందిలే అని నిర్లక్ష్యం చేస్తే మాత్రం ఫలితం అనుభవించక తప్పదంటున్నారు నిపుణులు. ఇంతకీ చిన్నపిల్లలు చెప్పే అబద్ధాల్ని తగ్గించటమెలా?

నిజానికి, అబద్ధానికి చిన్నరేఖ మాత్రమే ఉంది. ఎప్పుడూ నిజం చెప్పే పిల్లలు స్కూల్‌కు వెళ్లే సమయం నుంచి మెల్లమెల్లగా అబద్ధాలు చెప్పటం మొదలుపెడతారు. బడిలోని మిగతా పిల్లల ప్రభావం కావొచ్చు. చదువులో మార్కులు తక్కువ రావటం, లేకుంటే బ్యాగ్‌లోని ఏదైనా వస్తువు పోగొట్టుకోవటం లాంటివి జరిగినపుడు పిల్లలు తప్పు చేశామేమో అని భయపడతారు. ఇంట్లో తల్లిదండ్రుల భయం లేకుంటే బడిలో ఉపాధ్యాయుల భయం వల్ల పిల్లలు వెంటనే జరిగిన విషయాన్ని మార్చి చెప్పేందుకు సిద్ధపడతారు. ఈ క్రమంలోనే వారు తోచిన కథల్ని అల్లేసుకుని అటు స్కూల్లో, ఇటు ఇంట్లో అబద్ధాలు చెబుతుంటారు. పిల్లలు చెప్పే అబద్ధాల్ని తల్లిదండ్రులు గమనించాలి. ముఖ్యంగా పిల్లల్ని తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేసినపుడు దీంతో పాటు పిల్లల్లో ఆత్మవిశ్వాసం తక్కువగా ఉండటం, అభద్రతాభావం కూడా పిల్లలు అబద్ధాలు చెప్పటానికి కారణాలంటున్నారు మానసిక నిపుణులు. అందుకే పిల్లలు అబద్ధాలు చెప్పటాన్ని మొదటే అరికట్టాలి. చిన్నపిల్లల్ని ప్రేమగా దగ్గరకు తీసుకోవాలి. అబద్ధాలు చెప్పటం వల్ల వచ్చే పరిణామాల్ని చిన్నపాటి ఉదాహరణలతో తెలియజేయాలి. పిల్లల్లో దాగి ఉన్న భయాల్ని పోగొట్టాలి. ముఖ్యంగా వారిలోని పాజిటివ్ బిహేవియర్‌ను మెచ్చుకోవాలి. నిజం చెబితే బహుమతులు ఇవ్వటం వంటివి చేయాలి. ఇలా చేస్తే క్రమంగా పిల్లలు అబద్ధాలు చెప్పటం మానేస్తారు. ★



పట్టులాంటి జుట్టుకు...



గుమ్మడి గింజల నూనె జుట్టుపై ఎంతో బాగా పనిచేస్తుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్ వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటి ఏజింగ్ ఏజెంట్. ఈ ఆయిల్‌ని వాడాలనుకునేవారు తప్పనిసరిగా సంబంధిత వైద్యనిపుణుల సలహా తీసుకోవాలి. తమ దగ్గరకు వచ్చిన వాళ్ల చర్మంతీరు, వెంట్రుకల స్వభావాన్ని బట్టి ఈ ఆయిల్‌ని ఎలా వినియోగించాలో వైద్యులు చెప్తారు. వారి సూచనలకనుగుణంగా ఈ ఆయిల్‌ని వాడాలి.



'కండిషనర్' ఇలా ఉపయోగిద్దాం!

వెంట్రుకల కుదుళ్లకు కాదు: కండిషనర్‌ను వెంట్రుకల కుదుళ్లకు కాకుండా వెంట్రుకలకు మాత్రమే పట్టించాలి. మాడుకు కండిషనర్ పట్టిస్తే అక్కడ నూనె తయారై వెంట్రుకలు జిడ్డుగా తయారవటంతోపాటు చుండ్రు సమస్యా తలెత్తుతుంది. దాంతో దురద, జుట్టురాలే సమస్యలు మొదలవుతాయి.

రంగువేసిన జుట్టుకు: రంగువేసిన, పొడి వెంట్రుకలైతే కండిషనర్‌ను నేరుగా మాడుకే పట్టించటం మేలు. నీటి తాకిడికి జుట్టుకువేసిన రంగు తొలగిపోకుండా ఉండాలన్నా, రంగు వెంట్రుకలకు అంటుకుని ఉండాలన్నా కండిషనర్‌ను కుదుళ్లకే పట్టించాలి.

లేబుల్ చదవండి: కండిషనర్ కొనేటప్పుడు దాని మీదున్న లేబుల్ తప్పకుండా చదవాలి. దాన్లో సిలికాన్ ఉపయోగించారో లేదో తెలుసుకోవాలి. సిలికాన్ లేని కండిషనర్‌నే కొనాలి. సిలికాన్ వల్ల వెంట్రుకల మొదళ్లు చిట్లుతాయి. అలాగే వెంట్రుకల సహజసిద్ధ నూనెలను సిలికాన్ తొలగిస్తుంది.

ఆరిన తర్వాతే కండిషనర్: సాధారణంగా షాంపూ చేసిన వెంటనే కండిషనర్ అప్లై చేస్తూ ఉంటాం. కానీ ఇలా చేయటం వల్ల తిరిగి వెంట్రుకలను కడిగినప్పుడు కండిషనర్ మొత్తం తొలగిపోతుంది. అలాకాకుండా కండిషనర్‌ను వెంట్రుకలు పీల్చుకోవాలంటే తలస్నానం చేసిన తర్వాత టవల్‌తో వెంట్రుకల తడిని తొలగించాకే కండిషనర్ అప్లై చేయాలి. ★

మీ కోసం

ముఖం, కళ్ల దగ్గర మొక్కజొన్న పిండితో మర్దనా చేసుకుని పావుగంటయ్యాక కడిగేసుకోవాలి. ఇలా చేస్తే ముఖం కాంతివంతంగా ఉంటుంది.

జీవన సౌరభం

సహనం పాటించే వాళ్లే జీవితంలో.. అనుకున్నది సాధించగలరు.

వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటేనే లక్ష్య సాధన

నేటి కాలంలో అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు చదువుకుంటున్నారు. అయితే అమ్మాయి కష్టపడి చదువుకోవడం ఒకెత్తయితే, చదువుకున్న తర్వాత జాబ్ చేయడం, జాబ్‌లో నిలదొక్కుకోవడం, ఇంకొకెత్తు. అంటే పురుషుల కంటే కూడా మహిళలే రెండు రెట్లు ఎక్కువ శ్రమించాల్సి ఉంటుందని అధ్యయనాలే చెబుతున్నాయి. అలా శ్రమిస్తేనే వాళ్లకి పదోన్నతి దక్కుతుంది. ఇంతా... కష్టపడి మంచి స్థానంలో ఉన్నాంలే అనుకునేలోపే ఏదో ఒక రూపంలో ఇంకో సమస్య వెంటాడుతుంటుంది. ముఖ్యంగా లైంగిక వేధింపుల విషయంలో చెప్పనక్కర్లేదు. ఇక నిజాయితీ విషయంలో ప్రథమంగా మహిళలపైనే కన్ను పడుతుంది. ఎంత నిజాయితీగా ఉండాలన్నా.. ఉండనిచ్చే పరిస్థితులుండడం లేదు. మనసు చంపుకుని పని చేయలేక చాలామంది మహిళలు మధ్యలోనే ఉద్యోగం మానేస్తున్నారు.

ఒక్కో రంగంలో ఒక్కోలా ఉంటుంది. ప్రతిచోటా, ప్రతి ఒక్క విషయంలోనూ.. తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలంటే వర్ణనాతీతమైన ఒత్తిడికి, బాధకు లోనవుతుంది. అటు వేధింపుల్ని, ఇటు నిజాయితీని, బ్యాలెన్స్ తప్పకుండా అంతే స్థాయిలో కష్టపడుతూ నిలదొక్కుకోవడం అంటే మామూలు విషయం కాదు. ఎంతో జాగ్రత్తతో ఉండాల్సి వస్తోంది. కానీ తప్పదు వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటేనే లక్ష్యాన్ని చేరడానికి వీలౌతుంది.



కుటుంబానికి ఎంత ప్రాధాన్యతనిస్తున్నారో.. ఉద్యోగానికి కూడా అంతే ప్రాధాన్యతనివ్వాలి. కష్టమైన పనిని కూడా ఇష్టంగా చేయడం అలవర్చుకోవాలి. ప్రతీ సమస్యకి పరిష్కారం ఉంటుంది. ఆ పరిష్కారానికి తగ్గట్టుగా ప్రణాళికలు వేసుకుని వ్యవహరించాలి. సమస్యలున్నాయి....ఏం చేయగలం... అని అధైర్యపడకుండా...వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా.. ధైర్యంతో.. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. అప్పుడే అనుకన్నది.. సాధించగలరు.

- భవాని, గుంటూరు

సిటి100, ప్లాటినా ఇఎస్ స్పోక్ వేరియంట్లలో..!



సిటి100, ప్లాటినా బైకులను సరికొత్త వేరియంట్లో బజాజ్ ఆటో ఇండియా లైనప్‌లోని విడుదల చేసింది. ప్లాటినాలోని ప్రారంభ వేరియంట్‌గా ఇప్పుడు ఇఎస్ స్పోక్ వేరియంట్ అందుబాటులోకి వచ్చింది. బజాజ్ ప్లాటినాలో 102సీసీ సామర్థ్యం గల సింగల్ సిలిండర్ ఇంజన్ అమర్చారు. 4-స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్ అనుసంధానం గల ఈ సరికొత్త మోడల్ 8.1బిహెచ్‌పి పవర్‌తోపాటు 8.6ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తోంది. ప్లాటినా ఇఎస్ స్పోక్ వేరియంట్ ధర 42,650 రూపాయలు ఎక్స్-షోరూమ్(ఇండియా)గా ఉంది. బజాజ్ ఇఎస్ అల్లాయ్ వేరియంట్‌ను సిటి100లో విడుదల చేసింది. దీని ధర 41,997 రూపాయలు ఎక్స్-షోరూమ్(ఇండియా)గా ఉంది. సిటి100 శ్రేణిలో అల్లాయ్ వీల్స్ వేరియంట్ టాప్ ఎండ్ వేరియంట్‌గా ఉంది. ఎలక్ట్రిక్ స్టార్ ఫీచర్ కూడా అందించారు. సిటి100 లో 99.3సీసీ సామర్థ్యం గల పెట్రోల్ ఇంజన్, 4-స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌తో గరిష్ఠంగా 8.1బిహెచ్‌పి పవర్, 8.05ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేసేలా రూపొందించారు. సిటి100 ఇఎస్ అల్లాయ్ వీల్ వేరియంట్ ధర సిటి100 లోని ఇతర వేరియంట్ల ధర కంటే 3,300 రూపాయలు ఎక్కువగా ఉంది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితిని పరిశీలిస్తే బజాజ్ ప్లాటినా, సిటి 100 బజాజ్ ఆటో లైనప్‌లో బెస్ట్ సెల్లింగ్ ఎంట్రీ లెవల్ మోటార్ సైకిళ్లుగా ఉన్నాయి. దానికితోడు ఇప్పుడు రెండింటికీ ఎలక్ట్రిక్ స్టార్ట్ కూడా అందించడం కొనుగోలుదారులను ఆకర్షించేలానే ఉంది. ★

నీతి ఆయోగ్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?



టి.ఎం.దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 9000250127

1. 4వ పంచవర్ష ప్రణాళిక కాలంలో 'గారీభీ హఠావో' నినాదాన్ని ఇచ్చినవారు ?
ఎ. రాజీవ్‌గాంధీ బి. ఇందిరాగాంధీ
సి. నెహ్రూ డి. మొరార్జీదేశాయ్

2. 'ఏషియన్ డ్రామా' గ్రంథకర్త ?
ఎ. లక్డావాలా బి. డి.ఆర్.గాడ్గిల్
సి. గున్నార్ మిర్డాల్ డి. విశ్వేశ్వరయ్య

3. ఏ పంచవర్ష ప్రణాళికలో భారతదేశ ప్రణాళికలు 'హిందూ వృద్ధి రేటు'ను అధిగమించాయి ? (రాజ్‌కృష్ణ హిందూ వృద్ధి రేటు)
ఎ. 4వ బి. 5వ సి. 6వ డి. 7వ

4. కిందివానిలో సరైన సమాధానాన్ని జతపరచి చూడగా ఏది వాస్తవం ?

గ్రూప్-ఎ	గ్రూప్-బి
ఎ. స్టాక్ మార్కెట్ నియంత్రణలో శిఖరాగ్రసంస్థ	1. సెబీ (1988)
బి. గృహ నిర్మాణంలో అత్యున్నతమైన సంస్థ	2. ఎన్‌హెచ్‌బి (1988)
సి. వ్యవసాయ గ్రామీణాభివృద్ధిలో శిఖరాగ్ర విత్తసంస్థ	3. నాబార్డ్ (1982)
డి. పారిశ్రామిక ఋణ సహకారంలో శిఖరాగ్రబ్యాంక్	4. ఐడిబిఐ (1964)

ఎ. 1,2,3,4 బి. 4,3,2,1
సి. 2,1,3,4 డి. 4,2,1,3

5. గ్రామీణాభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడం కోసం డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (డిఆర్‌డిఎ)ను 8వ పంచవర్ష ప్రణాళికలో ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు ?
ఎ. 1994 బి. 1993 సి. 1995 డి. 1992

6. ప్రణాళికల అమలుకు కావాల్సిన వనరుల సమీకరణ విషయంలో కిందివానిలో ఏది విరుద్ధం ?
ఎ. 11వ, 12వ ప్రణాళికలలో 100% దేశీయ వనరులపై ఆధారపడ్డాము.
బి. 11వ, 12వ ప్రణాళికలలో 0% విదేశీ వనరులు, 10,11,12వ ప్రణాళికలలో 0% లోటుద్రవ్యం అనుసరించాం.
సి. 2వ ప్రణాళికలో అత్యధికంగా 20% లోటు ద్రవ్యం అనుసరించారు.
డి. పైవేవీ విరుద్ధం కాదు.

7. కిందివానిలో మొదటి పంచవర్ష ప్రణాళికతో సంబంధంలేని విషయం ?
ఎ. 1952 అక్టోబర్ 2న కేంద్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం మొట్టమొదటిగా సమాజ అభివృద్ధి పథకాన్ని అమలు పరిచింది.
బి. 1955లో చిన్నతరహా పరిశ్రమలపై మొదటిగా కార్వే కమిటీని ఏర్పాటు చేశారు.
సి. మొదటి ప్రణాళికలో 31% వనరులతో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతను ఇస్తూ, దేశంలోని ఆర్థిక అసమానతలను తగ్గించాలని, సరిదిద్దాలని లక్ష్యంగా నిర్ణయించారు.
డి. పైవేవీకావు.

8. రెండో పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యతనిస్తూ 4.5% వృద్ధిరేటు సాధించాలని నిర్ణయించారు. అయితే ఏయే భారీ పరిశ్రమల స్థాపనద్వారా పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చారు ?
ఎ. రూర్కెలా ఇనుము ఉక్కు కర్మాగారం (పశ్చిమ జర్మనీ సహకారంతో ఒడిషాలో)
బి. భిలాయ్ ఇనుము ఉక్కు కర్మాగారం (రష్యా సహకారంతో ఛత్తీస్‌ఘడ్‌లో)
సి. దుర్గాపూర్ ఇనుము ఉక్కు కర్మాగారం (బ్రిటన్ సహకారంతో వెస్ట్‌బెంగాల్‌లో)
డి. పైవన్నీ

9. రష్యా సహకారంతో జార్ఖండ్‌లో ఏర్పాటు చేసిన బొకారో ఉక్కు కర్మాగారం (అతిపెద్ద ప్రభుత్వరంగ ఇనుము ఉక్కు కర్మాగారం) ఏ ప్రణాళికలో స్థాపించారు ?
ఎ. రెండో బి. మూడో సి. నాల్గో డి. మొదటి

10. ఈ కిందివానిలో సరైన సమాధానం గుర్తించండి ?

గ్రూప్-ఎ	గ్రూప్-బి
ఎ. వ్యవసాయధరల కమిషన్	1.ఎ.కె.ఝా
బి. లీడ్‌బ్యాంక్ స్కీం	2. నారీమన్, గాడ్గిల్
సి. యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా	3. షరీఫ్
డి. గ్రామీణ బ్యాంకులు	4. నరసింహం, సరయూ
ఇ. నిరంతర ప్రణాళికలు	5. గున్నార్ మిర్డాల్

ఎ. 1,2,3,4,5 బి. 5,4,3,2,1
సి. 2,1,5,4,3 డి. 3,2,1,5,4

11. ఈ కింది వానిలో సరైన సమాధానాన్ని గుర్తించండి ?

గ్రూప్- ఎ	గ్రూప్- బి
ఎ. ప్రణాళికా సంఘం	1.2015 జనవరి 1
బి. జాతీయాభివృద్ధి మండలి	2.1957 సెప్టెంబర్19
సి. నీతి అయోగ్	3. 1950 మార్చి 15
డి. ఎపి మార్క్‌ఫెడ్	4. 1958 అక్టోబర్ 2
ఇ. నాఫెడ్	5. 1952 ఆగస్టు 6

ఎ. 5,4,3,2,1 బి.1,2,3,4,5
సి. 2,1,3,4,5 డి.3,5,1,4,2

12. పంచవర్ష ప్రణాళికలు అమలులోకి రాకపూర్వం వివిధ వ్యక్తులు రూపొందించి, అమలుపరచని ప్రణాళికలను కాగితపు ప్రణాళికలు (డ్రాఫ్టింగ్ ప్లాన్) అంటారు. దీనికి సంబంధించిన సరైనది కిందివానిలో..?

గ్రూప్-ఎ	గ్రూప్-బి
ఎ. సర్వోదయ ప్రణాళిక	1. మోక్షగుండం విశ్వేశ్వరయ్య
బి. ప్రిన్సిపుల్స్ ఆఫ్ ప్లానింగ్	2. ఎం.ఎన్ రాయ్
సి. గాంధీ ప్రణాళిక	3. కె.ఎన్ సేన్
డి. ప్రజా ప్రణాళిక	4. శ్రీమన్నారాయణ అగర్వాల్
ఇ. ప్లాన్డ్ ఎకానమి ఫర్ ఇండియా	5. పి.ఎస్ లోక్‌నాథ్
	6. జయప్రకాశ్ నారాయణ

ఎ. 6,5,4,2,1 బి. 1,2,5,4,3
సి. 2,6,5,1,3 డి. 1,2,3,5,6



13. నీతి అయోగ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా)కి ప్రణాళికా సంఘానికి మధ్య తేడాలలో సరికానిది ఏది ?
ఎ. ప్రణాళికా సంఘం, నీతి అయోగ్ రెండూ సలహా సంఘాలు మాత్రమేగానీ, రాజ్యాంగ, చట్టబద్ధమైనవి కావు.
బి. ప్రణాళికా సంఘంతో పోలిస్తే నీతి అయోగ్‌లో రాష్ట్రాలు మరింత కీలకమైన పాత్రపోషిస్తాయి.
సి. నిధుల కేటాయింపు అధికారం 'నీతి అయోగ్'కు లేదు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ పథకాలకు నిధులు కేటాయించే అధికారం ప్రణాళికా సంఘానికి ఉంది.
డి. అవసరాన్ని బట్టి 'నీతి అయోగ్' 'ప్రణాళికా సంఘంలో' సభ్యులను నియమిస్తారు.

14. 11వ పంచవర్ష ప్రణాళికకు సంబంధించి కిందివానిలో సరైనది ?
ఎ. 11వ ప్రణాళికలో 6 రంగాలకు 27 అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు.
బి. 11వ ప్రణాళికను భారత విద్యా ప్రణాళికగా వర్ణించారు.
సి. వ్యవసాయ రంగంలో 4%, పారిశ్రామికరంగంలో 10%, సేవారంగంలో 9.9% వృద్ధిరేటు లక్ష్యంగా నిర్ణయించారు.
డి. పైవన్నీ

15. 'వేగవంతమైన సమ్మిళిత వృద్ధి సత్వర ప్రగతి'కి ప్రాధాన్యతనిస్తూ 12వ పంచవర్ష ప్రణాళికను ఎంత శాతం వృద్ధిరేటు సాధించాలనే లక్ష్యంలో ప్రారంభించారు ?
ఎ. 6.5% బి.7% సి.8% డి. 9%

16. 12వ పంచవర్ష ప్రణాళికకు సంబంధించి కిందివానిలో సరైనది ?
ఎ. 12వ ప్రణాళికలో 7 రంగాలకు, 25 అంశాలకు ప్రాధాన్యతనిచ్చాం
బి. వ్యవసాయవృద్ధిరేటు 4%గాను, పారిశ్రామిక రంగవృద్ధిరేటు 8%గాను నిర్ణయించాం
సి. కేంద్ర, రాష్ట్రాల ప్రణాళికా వ్యయ వాటా 52:48గా, 76,69,807 కోట్లు అంచనా వ్యయంగా నిర్ణయించారు.
డి. పైవన్నీ

17. ఏ పంచవర్ష ప్రణాళికలో తొలిసారిగా ఆరుశాతం వృద్ధిరేటును సాధించడం జరిగింది ?
ఎ. 5వ ప్రణాళిక బి. 6వ ప్రణాళిక
సి. 7వ ప్రణాళిక డి. 8వ ప్రణాళిక

18. కిందివానిలో సరైనది ఏది ?
ఎ. 1986లో న్యూఢిల్లీ కేంద్రంగా గ్రామీణాభివృద్ధి సాధించడానికి సహాయం కోసం 'సిఎపిఎఆర్‌టి'ను స్థాపించారు.
బి. 1987లో గిరిజన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు టిఆర్ఐఎఫ్ఇడిను ఏర్పాటు చేశారు.
సి. 1988లో కంపెనీల నాణ్యతను తెలియజేసే సమాచారాన్ని అందించడానికి సిఆర్ఐఎస్ఐఎల్ ను ఏర్పాటు చేశారు.
డి. పైవన్నీ

19. 2001 సంవత్సరంలో పేద జిల్లాలలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 'జయప్రకాష్ నారాయణ్ రోజ్‌గార్ గ్యారంటీ యోజన' (జెపిఎన్ఆర్‌జివై)ను ఏ ప్రణాళికలో భాగంగా ప్రవేశపెట్టారు ?
ఎ. 8వ ప్రణాళిక బి. 9వ ప్రణాళిక
సి. 10వ ప్రణాళిక డి. పైవన్నీ

20.కిందివానిలో సరైన సమాధానం ఏది ?

గ్రూప్-ఎ	గ్రూప్-బి
ఎ. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్	1. 1998
బి. వాంబే	2. 2001
సి. జెఎన్ఎన్‌యుఆర్ఎం	3. 2005
డి. కేంద్ర మజుందార్ బీమాయోజన	4. 2001
ఇ. భాగ్యశ్రీ బాలికా కళ్యాణ్ యోజన	5. 2011
	6. 2013

ఎ. 5,6,3,1,2 బి. 1,2,3,4,5
సి. 1,3,6,5,2 డి. 5,4,3,2,1

21. కిందివానిలో వివిధ పంచవర్ష ప్రణాళికలలో అనుసరించిన నమూనాలు ఏవి సరైనవో గుర్తించండి ?

గ్రూప్-ఎ	గ్రూప్-బి
ఎ. వేతన వస్తు నమూనా	1. 8వ ప్రణాళిక
బి. బిట్‌లాండ్ నమూనా	2. 7వ ప్రణాళిక
సి. డి.ఆర్.గాడ్గిల్ నమూనా	3. 10వ ప్రణాళిక
డి. ఎల్.పి.జి నమూనా	4. 4వ ప్రణాళిక
ఇ. హరాడ్ డోమర్	5. 9వ ప్రణాళిక
	6. 1వ ప్రణాళిక

ఎ. 1,2,3,5,4 బి. 2,3,4,1,6
సి. 6,5,4,2,1 డి. 3,1,2,6,5

22. 2005 డిసెంబర్ 16న ప్రారంభించబడిన భారత నిర్మాణ ప్రోగ్రాంలోని ఆరు గ్రామీణ అవస్థాపనా సౌకర్యాలు లేనిది కిందివానిలో ?
ఎ. తాగునీరు, సాగునీరు
బి. విద్యుత్, రహదారులు
సి. గృహవసతి, టెలిఫోన్
డి. విద్యా, వైద్యం

23. 'సమ్మిళిత వృద్ధి, సత్వరప్రగతి'కి ప్రాధాన్యతనిస్తూ 11వ పంచవర్ష ప్రణాళికలో 8% వృద్ధిరేటు సాధించాలని నిర్ణయించారు. అయితే సమ్మిళిత వృద్ధి అనగా ఏమి ?
ఎ. మూడు రంగాలను కలుపుకుని అభివృద్ధి సాధించడం
బి. ఎస్‌సి,ఎస్‌టి మైనారిటీ, మహిళలను, కలుపుకుని అభివృద్ధి సాధించడం
సి. వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలను ఒకదానితో ఒకటిని అనుసంధానం చేయడం ద్వారా అభివృద్ధి సాధించడం
డి. పైవన్నీ

24. 'నీతి అయోగ్'ను ప్రణాళికా సంఘం స్థానంలో 2015 జనవరి 1 నుంచి ఏర్పాటు చేశారు. అయితే దీనికి సంబంధించి కిందివానిలో ఏది వాస్తవం ?
ఎ. నీతి అయోగ్ కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. దీని భవనం పేరు యోజన భవన్, ఇది నడిపే అధికారిక పత్రిక యోజన
బి. నీతి అయోగ్‌కు అధ్యక్షునిగా లేదా ఛైర్‌పర్సన్‌గా ప్రధాని ఉంటారు.
సి. ప్రస్తుత నీతి అయోగ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి – అమితాబ్ కాంత్.
డి. పైవన్నీ

25. నీతి అయోగ్ మొదటి సమావేశం 2015 ఫిబ్రవరి 6న ఏర్పాటు చేశారు. కాగా ఫిబ్రవరి 8న నీతి అయోగ్ పాలక మండలి సమావేశంలో నీతి అయోగ్ ప్రధాన నినాదంగా కిందివానిలో దేనిని స్వీకరించారు ?
ఎ. బలమైన రాష్ట్రాలలో వికేంద్రీకృతమైన పరిపాలనా విధానం
బి. అందరితోకలసి – వెనుకబడిన ప్రాంతాలలోని వారందరికీ వికాసం
సి. బలమైన రాష్ట్రాలతో – బలమైన దేశం, అందరితో కలిసి అందరికి వికాసం.
డి. పైవన్నీ

26. 1983లో పట్టణ ప్రాంతంలో విద్యావంతులైన నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించడానికి 'సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ఫర్ ఎడ్యుకేటెడ్ అన్ ఎంప్లాయ్డ్ యూత్' -(ఎస్ఇఇయువై) పథకాన్ని ప్రారంభించారు. 2008 నాటికి ఇది ఏ విధంగా మారింది ?
ఎ. 1993లో ఎస్ఇఇయువై పథకాన్ని 'పిఎంఆర్‌వై' – ప్రైమినిస్టర్ రాజ్‌గార్ యోజన'గా మార్చారు.
బి. 1995లో ఆర్ఎల్ఇజిపి – గా మార్చారు.
సి. 2008 నుంచి పిఎంఇజిపి (ప్రైమినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్)గా మార్చారు.
డి. ఎ, సి సరైనవి.

సమాధానాలు : 1.బి, 2.సి, 3.సి, 4.ఎ, 5.బి, 6.డి, 7.డి, 8.డి, 9.బి, 10.ఎ, 11.డి, 12.ఎ, 13.డి, 14.ఎ, 15.డి, 16.డి,17.సి, 18.డి, 19.బి, 20.డి, 21.బి, 22.డి, 23.బి, 24.డి, 25.సి,26.డి, ★

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

భూసంస్కరణలు - కౌలుసంస్కరణలు

ఇండియన్ ఎకానమి



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

తెలంగాణా ప్రాంతంలో 1950 జూన్‌లో హైదరాబాద్ కౌలు చట్టం అమలులోకి వచ్చింది. దీనినసరించి కౌలు ఒప్పందాలలో అనేక సంస్కరణలు చోటుచేసుకున్నాయి.

✧ ఈ చట్టం ప్రకారం కౌలు ఒప్పందాలు మౌఖిక రూపంలో కాకుండా తహశీల్దార్ సమక్షంలో లిఖితపూర్వకంగా ఉండాలి.

✧ మతపరమైన, ట్రస్ట్‌కు సంబంధించిన భూములు తప్ప మిగిలిన అన్ని రకాల భూములకూ ఈ చట్టం వర్తిస్తుంది.

✧ కౌలుదారు కౌలు సక్రమంగా చెల్లించినంతకాలం అతనిని తొలగించడానికి వీలులేదు.

✧ కౌలుభూమిని కౌలుదారు తనఖాపెట్టి రుణం పొందడానికి ఈ చట్టం ద్వారా వీలు కల్పించింది.

✧ ఏదైనా కారణాలవల్ల ప్రభుత్వం భూమిశిస్తును రద్దుచేస్తే భూయజమాని అనే విధంగా కౌలు చెల్లింపు నిర్ణయం తీసుకోవాలి.

కౌలు సంస్కరణల కోసం ప్రభుత్వం చట్టం తీసుకుని వచ్చినప్పటికీ చట్టంలో అనేక లొసుగులు ఉండడంవల్ల కౌలుదార్లకు భద్రత కరువైంది. దీనివల్ల కౌలుదార్లు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. అందువల్ల కౌలుదార్లకు భద్రత కల్పించడం కోసం హైదరాబాద్ కౌలు, వ్యవసాయ భూముల సవరణ బిల్లు 1953లో ప్రతిపాదించారు. దీని ప్రకారం...

✧ కౌలుదారుడు తాను సాగుచేస్తున్న భూమిని కొనే అవకాశం కల్పించారు.

✧ భూయజమాని తన భూమిని అమ్మాలని భావించినప్పుడు ముందుగా ఆ భూమిని సాగుచేస్తున్న కౌలుదారునికి అవకాశం కల్పించాలి.

✧ కౌలుదార్ల అనుమతి లేకుండా అమ్మిన భూపంటలు ప్రభుత్వం గుర్తించదు.

రక్షిత కౌలుదార్లకు మాత్రమే ఈ చట్టం యొక్క ప్రయోజనాలు కల్పించారు. కౌలుదార్లకు, భూస్వాములకు మధ్య కౌలు ఒప్పంద కాలపరిమితి రెండు సంవత్సరాలు మాత్రమే ఉన్నప్పుడు ఈ చట్ట ప్రయోజనాలు వర్తించవు.

భూస్వాములు సొంతగా వ్యవసాయం చేసుకుంటామనే సాకుతో కూడా రక్షిత కౌలుదార్లను తొలగించే స్వేచ్ఛ భూస్వామికి కలిగి ఉండడం ఈచట్టంలోని ప్రధాన లోపం..

వ్యవసాయ రంగంలో అనుపస్థితి భూస్వామ్యమే కౌలుదారీ సమస్యలకు ప్రధానకారణం. భూస్వాములు ప్రతిఏటా కౌలు పరిమాణం పెంచుకుంటూ కౌలుదారులను మారుస్తూ ఉండడంవల్ల కౌలుదారీ సమస్యలు తీవ్రమయ్యాయి. దీనిని పరిష్కరించడం కోసం కౌలు పరిమాణం, కౌలు భద్రత, కౌలదారునికి యాజమాన్య హక్కులు సంబంధించి కౌలు సంస్కరణలను తీసుకొచ్చారు.

1956వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటికీ వర్తించేటట్లు కౌలుదారీ చట్టం చేశారు. ఈ చట్టాన్ని అనుసరించి, మూడు చర్యలు చేట్టారు.



ఎ. కౌలు పరిమాణం

✧ ఈ చట్టం ద్వారా కౌలుదారుడు తన యజమానికి చెల్లించాల్సిన వార్షిక కౌలుపై గరిష్ట పరిమితి విధించడం.

✧ నీటిపారుదల ఆధారంగా పండే పంటల విషయంలో మొత్తం పంటలో యజమానికి చెల్లించాల్సిన గరిష్ట కౌలు 30 శాతం మించకూడదు. ఇతర భూములలో 20 శాతం మించకూడదని నిర్దేశించారు.

✧ వ్యవసాయానికి అయ్యే ఖర్చులన్నింటినీ కౌలుదారుడే భరించాలి. భూమిశిస్తును భూస్వాములు చెల్లించాలి.

✧ చెల్లించే కౌలు పండిన పంటను బట్టి చెల్లించాలి. లేదా పండిన పంటతో సంబంధం లేకుండా కొంత నిర్ధష్ట పంటను చెల్లించాలి. అనే అంశం మీద కౌలుదారుడు, భూస్వామికి మధ్య ఒక అంగీకారంతో కూడిన నిర్ణయానికి రావాలి.

✧ కౌలుదారుగానీ, భూస్వామిగానీ కౌలు మొత్తం సహేతుకంగా లేదని భావించినట్లయితే ప్రత్యేక అధికారి వద్దకువెళ్లి, న్యాయపూరితమైన కౌలును నిర్ణయించాలని అర్జీ పెట్టుకోవచ్చు. అయితే పంట కోతకు 15 రోజుల ముందు ఈ అర్జీ ప్రత్యేకాధికారికి చేరాలి.

✧ భూ యాజమాన్య హక్కులు మారినట్లయితే కౌలుదారుడి హక్కులకు భంగం వాటిల్లకుండా కౌలు యథావిధంగా కొనసాగుతుంది.

✧ కౌలు నిర్ధారించిన తర్వాత ఏకపక్షంగా కౌలును రద్దుచేసే హక్కు భూయజమానికి ఉండదు.

✧ ప్రకృతి వైపరీత్యాల ద్వారా పూర్తిగాగానీ, పాక్షికంగాగానీ పంటకు నష్టం వాటిల్లిన సందర్భాలలో కౌలు మొత్తాన్ని తగ్గించేందుకు లేదా పూర్తిగా రద్దు చేసేందుకుగానూ కౌలుదారు ప్రత్యేక అధికారికి అర్జీ పెట్టుకోవచ్చు.

✧ కౌలుదారునికి భూమికి సంబంధించి అనువంశిక హక్కులూ ఉంటాయి.

బి. కౌలు భద్రత

✧ 1974లో తెచ్చిన సవరణల ప్రకారం 1974 పూర్వం నుంచి కొనసాగుతున్న కౌలుదారులందరికీ శాశ్వత హక్కు కల్పించారు. తర్వాత భూస్వామి ఏ కౌలుదారుడినీ తొలగించడానికి వీలులేదు. ఈ నిర్ణయాన్ని కాదని తొలగిస్తే వారు సేద్యం చేసే భూమిలో 50 శాతం వారికి అప్పగించాలి.

✧ వ్యక్తిగత వ్యవసాయం నిమిత్తం కౌలుదారు నుంచి భూమిని తీసుకునే హక్కు భూస్వామికి ఉంటుంది.

✧ నిర్ధిష్ట కాలపరిమితికి ముందే భూస్వామి కింది కారణాలపై కౌలు ఒప్పందాన్ని రద్దు చేయవచ్చు.

1. గడువు తేదీ తర్వాత నెలరోజుల్లోగా కౌలు చెల్లించనట్లయితే.
2. కౌలుదారు భూమిని మరో కౌలుదారుకు అప్పగించినపుడు.
3. భూసారానికి నష్టం వాటిల్లే విధంగా భూమిని సాగుకోసం వినియోగిస్తే.

సి. యాజమాన్య హక్కులు

భూయాజమాని, కౌలుదారు మధ్య పరస్పరం కుదిరిన ధర లేదా ప్రత్యేకాధికారి నిర్ణయించిన మేరకు సహేతుకమైన ధర చెల్లించి, భూమిని సొంతం చేసుకునే హక్కు కౌలుదారుకు ఉంటుంది. భూమి ధర, ఆ భూమికి చెల్లించాల్సిన భూమి శిస్తుకు ఐదు రెట్లు మించకూడదు. అంతేగాకుండా ఈ మొత్తాన్ని వార్షిక వాయిదాలలో కూడా చెల్లించవచ్చు. దున్నేవాడిదే భూమి అన్నదే దీని లక్ష్యం.

ఈ విధంగా ఆంధ్రప్రదేశ్ కౌలుదారీ చట్టం – 1956 అనేక నిబంధనలను రూపొందించినప్పటికీ పూర్తిస్థాయిలో మాత్రం అమలుకాలేకపోయింది. కౌలుదారుల్లో ఎక్కువ శాతం నిరక్షరాస్యులు కావడం, కౌలు చట్టాల గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల కౌలు సంస్కరణల ఫలాలు పూర్తిస్థాయిలో అందలేదనే పేర్కొనాలి. ★

ఉద్యోగాలు

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(2)-2017

త్రివిధ (నేవీ/ ఆర్మీ/ ఎయిర్‌ఫోర్స్) దళాల్లోని 414 ఖాళీల భర్తీకి 'కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(2)–2017'కు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఆయా విభాగాల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించే ప్రత్యేక కోర్సుల్లోకి ప్రవేశం లభిస్తుంది.

విభాగాల వారీ ఖాళీలు...
ఇండియన్ మిలటరీ అకాడమీ (ఐఎంఏ)-డెహ్రాడూన్ : 100
ఇండియన్ నేవల్ అకాడమీ (ఐఎన్ఏ)-ఎజిమల : 45
ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ప్రి-ఫ్లైయింగ్)-హైదరాబాద్ : 32
ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (పురుషుల)-చెన్నై : 225
ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (మహిళల)-చెన్నై : 12

గమనిక : ఇండియన్ మిలటరీ అకాడమీలోని ఖాళీల్లో 13 ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ (ఆర్మీ వింగ్), ఇండియన్ నేవల్ అకాడమీలో ఆరు పోస్టులను ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్(నేవల్ వింగ్), ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీ (పురుషుల)లో 50 ఖాళీలను ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ (ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ) అభ్యర్థులకు రిజర్వ్ చేశారు.

అర్హతలు
ఇండియన్ మిలటరీ అకాడమీ (ఐఎంఏ) : అవివాహ పురుష అభ్యర్థులు అర్హులు. ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 1994 జులై 2–జులై 1, 1999 మధ్య జన్మించి ఉండాలి.
ఇండియన్ నేవల్ అకాడమీ (ఐఎన్ఏ) : అవివాహ పురుష అభ్యర్థులు అర్హులు. ఏదైనా ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 1994 జులై 2–జులై 1, 1999 మధ్య జన్మించి ఉండాలి.
ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ప్రి-ఫ్లైయింగ్) : ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఏదైనా డిగ్రీ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉండాలి. వయస్సు 20–24 ఏళ్ల లోపు ఉండాలి. డీజీసీఏ కమర్షియల్ పైలెట్ లైసెన్స్ ఉంటే గరిష్ఠ' వయోపరిమితిలో రెండేళ్లు సడలింపు ఉంటుంది. అయితే, 25 ఏళ్ల లోపు ఉన్నవారికి కచ్చితంగా వివాహం జరిగి ఉండకూడదు.
ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (పురుషుల) : ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత. 1993 జులై 2 – జులై 1, 1999 మధ్య జన్మించిన పురుష అభ్యర్థులు అర్హులు.
ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (మహిళల) : అవివాహిత/ విడాకులు పొంది తిరిగి పెళ్లి చేసుకోని/ వైధవ్యం పొంది తిరిగి వివాహం చేసుకోని మహిళలు అర్హులు. 1993 జులై 2–జులై 1, 1999 మధ్య జన్మించి ఉండాలి. ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి.
ఎంపిక విధానం : రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
రాతపరీక్ష విధానం : ఇండియన్ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ పోస్టుల అభ్యర్థులకు.. ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ విభాగాలపై పరీక్ష ఉంటుంది. ఒక్కో విభాగంలో 100 మార్కులు చొప్పున మొత్తం 300 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ప్రతి విభాగానికి పరీక్ష వ్యవధి రెండు గంటలు.
ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ అభ్యర్థులకు : ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్ విభాగాలపై పరీక్ష ఉంటుంది. ఒక్కో విభాగంలో 100 మార్కులు చొప్పున మొత్తం 200 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ప్రతి విభాగానికి వ్యవధి రెండు గంటలు.
దరఖాస్తు ఫీజు : రూ.200, ఎస్సీ/ఎస్టీ/ మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తులకు చివరి తేదీ : సెప్టెంబర్ 8, 2017
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.
వెబ్‌సైట్ : upsconline.nic.in , www.upsc.gov.in

ఐటీబీపీలో ఉద్యోగాలు

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ)లో కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మ్యాన్) కొలువుల భర్తీకి ప్రకటన వెలువడింది.
ట్రేడ్‌ల వారీగా ఖాళీలు : టైలర్–19, గార్డెనర్–38, కోబ్లర్–27, వాటర్ క్యారియర్–95, సఫాయి కర్మచారి–33, కుక్–55, వాషర్‌మ్యాన్–25, బార్బర్–11.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో మాత్రమే అప్లై చేయాలి.
దరఖాస్తు చివరి తేదీ : సెప్టెంబర్ 7, 2017.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.
వెబ్‌సైట్ : www.itbpolice.nic.in, www.recruitment.itbpolice.nic.in

యూజీసీ-నెట్

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)కు షెడ్యూల్ విడుదలైంది.
పోస్టులు : జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎలిజిబిలిటీ
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ : ఆగస్టు 30, 2017
ఫీజు : ఆగస్టు 31 వరకూ చెల్లించవచ్చు.
పరీక్ష తేదీ : నవంబర్ 19, 2017
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.
వెబ్‌సైట్ : cbsenet.nic.in

ప్రజల కష్టార్జితం లూటీ

- దేశంలో పెరుగుతోన్న ఇంటెలిజెంట్ కేపిటలిజం
- స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ పికె.దాస్ ఉద్ఘాటన
- 'సేవ్ పబ్లిక్ సెక్టార్ వర్క్‌షాప్' ప్రారంభం


విశాఖపట్నంలో మాట్లాడుతున్న పికె.దాస్

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

దేశంలో ప్రజల కష్టార్జితాన్ని పెట్టుబడిదారీ వర్గం ప్రశాంతంగా దోచుకుంటుందని, పాతికేళ్లుగా రూ.లక్షల కోట్ల సంపదను లూటీ చేసిందని స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆలిండియా జనరల్ సెక్రటరీ పికె.దాస్ ఉద్ఘాటించారు. 'సేవ్ పబ్లిక్ సెక్టార్..సేవ్ విశాఖ' పేరిట వైజాగ్ ఆటోనగర్ వాసివ్వా హాలులో ఏపి పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన మేథోమథనం ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి పికె.దాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల మధ్య తేడాపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రయివేట్ రంగంతో దేశ నాగరికత, సంపద ఎలా నాశనమవుతుందో పలు ఉదాహరణలతో వివరించారు. దేశంలో విదేశీ కార్లు కొనేలాగ, ఫ్లాట్‌లు విక్రయించేలా రుణాలివ్వడం.. చిట్‌ఫండ్స్‌లో కార్మికులు డబ్బు కట్టేలా... జూదం, కేసినో క్లబ్‌లను ప్రోత్సహించడం, బెట్టింగ్ వంటి కార్యకలాపాలను ఎరవేస్తూ అత్యంత తెలివిగా పెట్టుబడిదారీ వర్గం దేశ సంపదను పలు పద్ధతుల్లో లాక్కొని పెట్టుబడిగా చేసుకుంటుందనీ వివరించారు. దేశ పాలకులపై కార్పొరేట్లు తమకు 'నో టాక్సేషన్ జోన్స్' పెట్టాలని ఒత్తిడి పెంచడంతో సెజ్‌ల ఏర్పాటు, అందులో మౌలిక వసతుల కల్పనకు ప్రజాధనాన్నే వెచ్చిస్తున్నారన్నారు. ఉదాహరణకు దేశంలో 25 ఏళ్లలో రైల్వేలైన్లు 6 శాతం మాత్రమే వేయగా, జాతీయ రహదారుల్లో విదేశీ కార్ల ప్రయాణాల కోసమని 238 శాతం అభివృద్ధి చేశారని చెప్పారు. రైళ్లలో ప్రయాణం అత్యంత తక్కువ ఖర్చుతో కూడుకున్నదని, సామాన్యులకు మేలు జరిగేదని చెప్పారు. కార్పొరేట్లకు దీనివల్ల లాభం లేదన్నారు. జాతీయ రహదార్లు వేయడం ద్వారా కాంట్రాక్టులు ఆ తర్వాత దేశంలో విదేశీ కార్ల అమ్మకాలు జరిగి కార్పొరేట్ సంస్థలకు రూ.వేల కోట్లు దోచుకోడానికి వీలయ్యేలా చేసుకున్నారని ఇదే 'ఇంటెలిజెన్స్ కేపిటలిజం'గా పికె.దాస్ అభివర్ణించారు. దీనివల్ల దేశం ఉపాధి కల్పించే పరిశ్రమలను, ఉద్యోగాలను, రెవెన్యూను కోల్పోతుందని, పేదరికం విపరీతంగా పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో సామాన్యుల సంపదను దోచేసుకుంటూ మరోపక్క ఏటా కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం రూ.6 లక్షల కోట్ల రాయితీలను అందజేస్తుందని, కేంద్ర బడ్జెట్టే ఏటా రూ.8 లక్షలని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ జిఎస్‌టిని, అంతకుముందు నోట్లరద్దును చేపట్టి రూ.100 లక్షల కోట్లను దేశంలో ప్రయివేట్ రంగం దోచుకునేలా చేశారని విమర్శించారు. ప్రభుత్వ రంగం ఉంటేనే దేశ ఆర్థిక వ్యవస్థకు రక్షణ అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలకు విశాఖ నెలవుగా ఉందని, వీటిని కాపాడుకునేందుకు సైనికుల్లా వివిధ రంగాల్లో పనిచేస్తున్న యూనియన్ లీడర్లు పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగం ఎంత బలంగా ఉంటుందో భిలాయ్ ఉక్కు కర్మాగారం వెళ్లిచూడాలని, ప్రయివేట్ రంగం వస్తే ప్రజలకు కనీసం స్కూలు కూడా ఉండదని, వైద్యం అందదన్న సంగతిని రాయఘర్ వెళ్లి ఇస్కో పరిశ్రమను చూస్తే అర్థమవుతుందని ఉదహరించారు. దేశంలో ప్రభుత్వ రంగం ఇంకా బలంగా ఉందనడానికి బలమైన కారణం.. ఇటీవల ప్రపంచమంతా అమెరికా, బ్రిటన్, జర్మనీ, జపాన్ సహా దేశాల్లో తలెత్తిన ఆర్థిక సంక్షోభం ఆ దేశ ఆర్థిక వ్యవస్థలను తలకిందులు చేయగా భారతదేశంలో ప్రభుత్వరంగం ఉన్నందునే ఇక్కడ ఎకానమీ (ఆర్థిక వ్యవస్థ)ను పెట్టుబడిదారులు కైవసం చేసుకోలేకపోయారని గుర్తు చేశారు. ఈ సమావేశాలు దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ప్రభుత్వ రంగ పరిరక్షణకు మూడురోజుల పాటు చర్చలు జరిపి తగిన కార్యాచరణను చేపడతాయన్న విశ్వాసం తనకుందన్నారు. సిఐటియు స్టీల్‌ప్లాంట్ నాయకులు అయోధ్యరామ్ అధ్యక్షతన సాగిన సభలో పోర్టు డాక్ వర్కర్స్ యూనియన్ నాయకులు పద్మనాభరాజు, ఎపి పబ్లిక్‌సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జ్యోతీశ్వరరావు ప్రసంగించారు. విశాఖ ప్రభుత్వ రంగ పరిశ్రమలకు చెందిన యూనియన్ల నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రధాన గేటు వద్ద ఆందోళన కొనసాగిస్తున్న విద్యార్థులు

నకిలీ ఉద్యోగులను తొలగించే వరకూ ఆందోళన

ప్రజాశక్తి- బాపట్ల (గుంటూరు)

నకిలీ ఉద్యోగులను తొలగించే వరకూ తమ ఆందోళన ఆగదని, రద్దయిన జిఒ 64ను ప్రభుత్వం అమలు చేయాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యార్థులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. జిఒ 64 కప్పిపుచ్చటానికి వ్యవసాయ మండలిని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం కొత్తనినాదాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. వ్యవసాయ మండలి ఏర్పాటునకు కనీసం 5 నుంచి 6 నెలలు కాల వ్యవధి పడుతుందని, దీన్ని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించాల్సి ఉంటుందని, అయితే ఐసిఎఆర్ ప్రకటనను వ్యవసాయ కళాశాలలకు అక్రిడేషన్ అవసరం లేదని ఎక్కడా పేర్కొనలేదని విద్యార్థులు తెలిపారు. 2000లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ హయాంలో ఇచ్చిన జిఒ 16ను యథావిధిగా అమలు చేయడంతోపాటు 64 జిఒను పూర్తిస్థాయిలో రద్దు చేసి, ఆ జిఒతో ఉద్యోగాల్లో చేరిన నకిలీ ఉద్యోగులను తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

22న మున్సిపల్ కార్మికుల చలో విజయవాడ

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ)

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 22న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎపి మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, వైఎస్‌ఆర్‌టియుసి, ఐఎఫ్‌టియు, బిఎంఎస్, స్వతంత్ర్య సంఘాలు) నాయకులు తెలిపారు. ఈ మేరకు దుర్గాపురంలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జెఎసి నాయకులు కె.ఉమామహేశ్వరరావు, ఎ.రంగనాయకులు విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను కట్టుబానిసలుగా మార్చే 279 జిఒ టెండర్లు రద్దు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాలు చెల్లించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పర్మినెంట్ కార్మికులకు హెల్త్ కార్డులివ్వాలని, విజయవాడ, విశాఖ నగరాలకు 010 పద్దును వర్తింపజేయాలని తదితర డిమాండ్ల సాధనకు చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వివరించారు.

వైద్యం వికటించి బాలుడు మృతి

బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - నందిగామ (కృష్ణా)

ఆర్‌ఎంపి వైద్యుడు చేసిన వైద్యం వికటించి నాలుగేళ్ల బాలుడు మరణించాడు. ఈ సంఘటన కృష్ణాజిల్లా నందిగామలో ఆదివారం చోటుచేసుకుంది. గోళ్లమూడికి చెందిన తుళ్లూరి బాజిబాబు కుటుంబం నాలుగేళ్ల నుంచి నందిగామ యాదవ బజారులో నివాసముంటున్నారు. వీరికి రోహిత్ ఈశ్వర్ అనే నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. అతనికి జ్వరం రావటంతో ఆదివారం ఉదయం మయూరి టాకీస్ సమీపంలోని ఓ ఆర్‌ఎంపి వైద్యుని క్లినిక్‌కు తీసుకొచ్చారు. వైద్యుడు ఈశ్వర్‌కు ఇంజెక్షన్ చేసి మందులిచ్చి పంపించాడు. ఇంటికెళ్లిన గంట తరువాత బాలుడు మృతి చెందాడు. దీంతో బాలుని తల్లిదండ్రులు, బంధువులు మృతి చెందిన బాలుడిని తీసుకొని వైద్యుడి ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు. ఆ వైద్యుడు కాళ్ల బేరానికి దిగి తల్లిదండ్రులతో పలువురు పెద్దల మధ్య రాజీ కుదుర్చుకున్నట్లు సమాచారం. గతంలోనూ ఇదే ఆస్పత్రిలో ఇలాగే జరిగిందని పలువురు చెపుతున్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు

రాయలసీమ అభివృద్ధి కోసం విశాల వేదిక నిర్మించాలి

ప్రజాశక్తి - కర్నూలు సిటీ

రాయలసీమ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా విశాలమైన వేదిక నిర్మించాల్సిన అవసరం ఉందని రాయలసీమకు చెందిన మేధావులు పేర్కొన్నారు. ఆదివారం కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని మెగాసిరి ఫంక్షన్ హాలులో 'రాయలసీమ అభివృద్ధి - సవాళ్లు' అంశంపై జరిగిన సెమినార్‌ను జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి, మాజీ డిజిపి ఆంజనేయరెడ్డిలు మాట్లాడారు.

రాష్ట్ర విభజన అనంతరం రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. రాయలసీమలో రాష్ట్ర హైకోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించినప్పుడే రాయలసీమ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

జనావాసాల్లో మద్యం దుకాణాలను ఎత్తేయండి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల్లో ఏర్పాటు చేసిన మద్యం షాపులను ఎత్తేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం షాపులను ఎత్తేయాలని కోరుతూ ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. త్వరలో మహిళలతో కలిసి చలో వెలగపూడి చేపడతామని చెప్పారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టేలా బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఆగస్టు 15 తరువాత రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మిదేవి, సావిత్రమ్మ, నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రిక, యమున పాల్గొన్నారు.


కొత్త ఒరవడిని సృష్టించిన శాస్త్రవేత్త భార్గవ

- పుస్తకాల రూపంలో భార్గవ వ్యాసాలు
- భోపాల్ బాధితుల కోసం 19 ఏళ్లు పోరాడారు
- పిఎమ్ భార్గవ సంతాప సభలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బయోటెక్నాలజీ, సెల్యులార్ బయాలజీలో దేశంలోనే కొత్త ఒరవడిని సృష్టించిన పిఎమ్ భార్గవ శాస్త్రీయ దృక్పథం గల గొప్ప సామాజిక శాస్త్రవేత్త అని జెవివి, సైన్స్, వివిధ రంగాలకు చెందిన సభ్యులు కొనియాడారు. జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ఎమ్‌బి విజ్ఞాన కేంద్రంలో సిసిఎమ్‌బి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పిఎమ్ భార్గవ సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. సభకు అధ్యక్షత వహించిన జెవివి రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. రవికుమార్ మాట్లాడుతూ జెవివి గౌరవాధ్యక్షునిగా భార్గవ సేవలందించారని, సంస్థతో ఆయన కున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. సమాజం లో విజ్ఞాన శాస్త్రాన్ని అన్వయించేందుకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. జెవివి ఉమ్మడి కార్యదర్శిగా పనిచేసిన ప్రొఫెసర్ కట్టా సత్యప్రసాద్ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా డిఎన్ఎ ఫింగర్ ప్రింట్ టెక్నాలజీ అభివృద్ధి కోసం ఆయన సెంటర్ ఫర్ డిఎన్ఎ ఫింగర్ ప్రింట్ అండ్ డయాగ్నస్టిక్స్ (సిడిఎఫ్‌డి) విభాగాన్ని తీసుకొచ్చారన్నారు.

విశాలాంధ్ర మాజీ సంపాదకులు రాఘవాచారి మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా శాస్త్రవేత్తలకు 'సైంటిఫిక్ వర్కర్స్ యూనియన్' ను ఏర్పాటు చేసిన ఘనత భార్గవకే దక్కుతుందన్నారు. 21 ఏళ్లకే ఆయన పిహెచ్‌డి పొందారని, తామిద్దరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కలిసే చదివామన్నారు. నాస్తిక కేంద్రం నిర్వాహకులు విజయం మాట్లాడుతూ ప్రజల్లోకి శాస్త్రీయతను తీసుకెళ్తే సమాజంలో విప్లవాత్మక మార్పులొస్తాయని భార్గవ భావించేవారన్నారు. ఆలిండియా పీపుల్ సైన్స్ నెట్‌వర్క్ (ఏఐపిఎస్ఎన్) జాతీయ కార్యదర్శి టి. రమేష్ మాట్లాడుతూ ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞాన ఫలాలు ప్రజలకు చేరాలని భార్గవ తాపత్రయపడ్డారన్నారు. చేపమందు వంటి కొన్ని అశాస్త్రీయ నమ్మకాలను ప్రజల నుంచి పారద్రోలేందుకు స్వయంగా ఆయనే ప్రచారం చేశారన్నారు. భార్గవకు సంతాపం తెలిపేందుకు గవర్నర్‌కు తీరిక లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు ఉషారాణి మాట్లాడుతూ పిఎమ్ భార్గవ రాసిన వ్యాసాల్ని సేకరించి పుస్తక రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు సభ్యురాలు శాంతిశ్రీ మాట్లాడుతూ సైన్స్ ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లడమే ఆయనకిచ్చే అసలైన నివాళులన్నారు. ఎమ్‌బివికె కన్వీనర్ పి. మురళీకృష్ణ మాట్లాడుతూ భోపాల్ ఘటనలో బాధితులకు న్యాయం జరగాలని ఆయన 19 ఏళ్లు నిర్విరామంగా పోరాడా రన్నారు. ప్రజాసాహితీ సంపాదకులు కొత్తపల్లి రవిబాబు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, అరసం నాయకులు కొండపల్లి మాధవరావు, పలువురు ప్రజాసంఘాల నాయకులు, ప్రతినిధులు సభలో పాల్గొన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న రమేష్

కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ 151 జిఒ అమలు చేయండి

- ఎఎన్‌ఎంల రాష్ట్ర సమావేశంలో వక్తల డిమాండ్


రాష్ట్ర సమావేశంలో మాట్లాడుతున్న బాలకాశీ

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ)

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ 151 జిఒ అమలు చేయాలని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.బాలకాశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెజిబివిలలోని పార్ట్‌టైం కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్స్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్స్ ఎఎన్‌ఎంల రాష్ట్ర సమావేశం దుర్గాపురంలోని సిఐటియు నగర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఎస్‌ఎస్‌ఎ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అండ్ పార్ట్‌టైం ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న నాగేశ్వరరావు, బాలకాశీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. మహిళా కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయడం లేదని, దీని కారణంగా గర్భిణులుగా ఉన్న ఉద్యోగులు విధులకు తప్పనిసరిగా హాజరై ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పని ఒత్తిడితో ఒకింత అనారోగ్యం పాలై తనువు చాలించిన వారూ ఉన్నారని, వారికి పుట్టే పిల్లలూ అనారోగ్యం పాలవుతున్నారని గుర్తు చేశారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను ఇవ్వాలన్నారు. సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ)లో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు పెంచడానికి ప్రభుత్వం అంగీకరించిందని, అయితే దానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ మాత్రం ఇవ్వలేదని చెప్పారు.. తక్షణమే వేతనాల పెంపునకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రవిచంద్ర, ఎస్ఎస్ఎ జెఎసి రాష్ట్ర నాయకులు కాంతారావు, విజయ్, శ్రీనివాసులు, దేవేంద్ర, హుస్సేన్, నాగరత్నమ్మ, బాలరాజు, నాగరాజు, రెండో ఎఎన్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాధవి పాల్గొన్నారు.

ఈలప్రోలు బాధిత దళితులకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

కృష్ణాజిల్లా ఇబ్రహీం పట్నం మండలం ఈలప్రోలులో విష ప్రయోగం జరిగిన దానవాయి చెరువును సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ఆదివారం పరిశీలించారు. గ్రామంలో పర్యటించి, బాధిత దళితులను కలిసి పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు మిరియాల లక్ష్మణరావు నేతల బృందానికి సంఘటనను వివరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. దళితుల అభివృద్ధిని అడ్డుకునే విధంగా చంద్రబాబునాయుడు పాలన ఉందన్నారు. ఈలప్రోలులో జరిగిన ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. దళితుల అభివృద్ధిని జీర్ణించుకోలేక వారిపై దాడి చేసిన పెత్తందార్లపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ సభ్యులను ప్రభుత్వమే ఆదుకుని చేపల పెంపకానికి వనరులను కల్పించాలన్నారు. దళితులకు న్యాయం జరిగే వరకూ వారి పక్షాన సిపిఎం పోరాడుతుందని స్పష్టం చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నటరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై నానాటికీ హింస పెరిగిపోతుందని, తక్షణమే దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నటరాజ్ తదితరులు ఉన్నారు.


చెరువును పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ముగిసిన ఫార్మోరియా

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం (విజయవాడ)

విజయవాడ నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం నిమ్రా మెడికల్ కళాశాలలో ఫార్మా రంగానికి సంబంధించిన ఫార్మోరియా ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేట్ విద్యా సంస్థల సిఇఒ తుమ్మల నాగప్రసాద్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. భవిష్యత్తులో భారత ఫార్మారంగం అంతర్జాతీయ మల్టీ కంపెనీలను ఆకర్షించనుందని పేర్కొన్నారు. బి ఫార్మసీ, ఫార్మ్ డి, ఎం ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. క్లినికల్ ఛాలెంజ్‌లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతుల నందించారు. జాబ్ మేళా సందర్భంగా నిర్వహించిన రాత పరీక్షకు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి రెడ్డీస్ లేబొరేటరీస్, వివిధ ఆసుపత్రిల్లో ఉద్యోగాలివ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కరీముల్లా తెలిపారు. ఈ కార్యక్రమానికి రెడ్డీస్ ల్యాబ్ చైర్మన్ రంజిత్, పలువురు ఫార్మా రంగ నిపుణులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ఉహ్రూ కెన్యాట్ట
2. క్రీడాకారిణి మహేశ్వరి చౌహాన్
3. ప్రసూన్ జోషి, 4. బీహార్
5. జర్మనీ

విద్యా వ్యాపారానికే సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ చట్టం



విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలోని రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి లక్ష్మణరావు

- ఫిక్కియే దీన్ని రూపొందించింది
- కార్పొరేట్ చేతుల్లోకి విద్యారంగం
- ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యానికి కుట్ర
- రాష్ట్ర సదస్సులో ఆందోళన వ్యక్తం చేసిన వక్తలు
- ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యను వ్యాపారం చేసేందుకే ఎపి సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ -2017 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని రాష్ట్ర సదస్సులో వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం అమలైతే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని విమర్శించారు. ఎపి సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ యాక్ట్-2017పై ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రాష్ట్ర సదస్సు జరిగింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటీకరణ వైపు వెళ్లే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముందు ఉన్నాయని వరల్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. ప్రైవేట్ రంగంలో ప్రస్తుతం 40 శాతం మేర విద్యార్థులు చదువుతున్నారని, ఇది రానున్న ఐదేళ్లల్లో 60శాతానికి వెళ్తుందని కూడా హెచ్చరించిందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరితే చదువులు రావని, తమ సంస్థల్లో అయితే వస్తుందని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థుల్ని మభ్యపెడుతున్నాయన్నారు. కొత్తగా వచ్చే చట్టం అమల్లోకొస్తే కెజీ నుంచి ఇంటర్ వరకు విద్య పూర్తిగా కార్పొరేట్ శక్తుల్లోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ చట్టాన్ని ఐక్యంగా ఆదిలోనే అడ్డుకోవాలని, వచ్చే శాసనమండలిలో దీనిని అడ్డుకుంటామని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ చట్టం రూపొందించే ముందు ప్రభుత్వం ఏవరితో చర్చించిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, అధికారులు కూడా చర్చించలేదన్నారు. పారిశ్రామిక వేత్తలు సభ్యులుగా ఉన్న ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కి) ఈ చట్టాన్ని రూపొందించిందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏటా రూ.25వేల కోట్ల విద్యా వ్యాపారం జరగొచ్చని ఫిక్కి అంచనా వేసిందని, అందులో భాగంగానే ఈ చట్టాన్ని రూపొందించిందన్నారు. పరిశ్రమల్ని నడుపుతున్నట్లే, పెట్టుబడులు పెట్టి విద్యాసంస్థల్ని కూడా నడపొచ్చని ఈ రంగంలోకి ప్రవేశిస్తోందన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీల చట్టాన్ని తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వందల ఎకరాలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చే చట్టం వల్ల ప్రభుత్వ పాఠశాలలతో పాటు, చిన్న చిన్న ప్రైవేట్ పాఠశాలలు కూడా మూతపడే ప్రమాదముందన్నారు. ఈ చట్టంపై అందరినీ చైతన్య పరచి కార్పొరేట్ శక్తులను ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎపి విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ విద్యా రంగం ప్రభుత్వం చేతిలో ఉంటేనే ప్రజలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంటుందన్నారు. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన వారు, సైంటిస్ట్‌లు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనన్నారు. గతంలో పిపిపి విధానంలో ఇంజనీరింగ్‌లో ఫీజు రాయితీని ప్రభుత్వం కల్పించిందని, ప్రస్తుతం ఇంజనీరింగ్ కళాశాలల పరిస్థితి బాగోలేదని ఆయన పేర్కొన్నారు. కొత్త చట్టం అమల్లోకొస్తే ప్రభుత్వ పాఠశాలలకు ఇదే దుస్థితి పడుతుందన్నారు. ఉపాధ్యాయ మాస పత్రిక ప్రధాన సంపాదకులు జిలానీ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఇప్పటికే సొంత సిలబస్, పాఠ్యపుస్తకాలతో పాటు ఫీజుల్ని ఇష్టానుసారం వసూలు చేస్తున్నాయన్నారు. కొత్తగా వచ్చే ఈ చట్టం వల్ల ఆ ముసుగు తొలగిపోయిందన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఫ్యాప్టో చైర్మన్ పి బాబురెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ఫీజు రాయితీ కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉండరని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడిచే విధంగా ఈ చట్టాన్ని రూపొందించారన్నారు. ఈ చట్టాన్ని విరమింప చేసే బాధ్యత ఉపాధ్యాయ సంఘాలపై ఉందన్నారు. ఈ సదస్సులో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ జి హృదయరాజు, కో చైర్మన్లు పాండురంగ వరప్రసాద్, కృష్ణారావు, జివి నారాయణ రావు, రవిచంద్ర కుమార్, డిప్యూటీ సెక్రటరీలు వెంకటేశ్వరరావు, జెఎసి జనరల్ సెక్రటరీ ఐ వెంకటేశ్వరరావు, ఎస్టీయు అధ్యక్షులు సుధీర్ బాబు, డిటిఎఫ్ నాయకులు రమణ, ఎపిటిఎఫ్ వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

బెంగాల్‌లో రాజ్యాంగ పతనం

- మున్సిపల్ ఎన్నికల్లో రాజ్యాంగ సంస్థల వైఫల్యం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎమ్‌డి సలీమ్
- ఎన్నికలు రద్దు చేయాలని డిమాండ్

కోల్‌కతా: బెంగాల్‌లో మరోసారి రాజ్యాంగం పతనమైంది. రాష్ట్రంలో ఏడు మున్సిపాలిటీలకు ఆదివారం జరిగిన ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో రాజ్యాంగ సంస్థలు విఫలమయ్యాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎమ్‌డి సలీమ్ విమర్శించారు. రహస్య ఒప్పందం కుదుర్చుకున్న తృణమూల్ కాంగ్రెస్, బిజెపిలు రౌడీయిజానికి దిగి మూకుమ్మడి దాడులకు పాల్పడ్డాయని తెలిపారు. ముజఫర్ అహ్మద్ భవన్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో తృణమూల్ గూండాలకు పోలీసులు, ఎన్నికల అధికారులు, మీడియా బాహాటంగానే మద్దతు తెలిపాయని సలీమ్ పేర్కొన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని, న్యాయపోరాటం చేస్తామని అన్నారు. బిజెపి, టిఎంసి మధ్యే పోటీ అంటూ ఓ వర్గపు మీడియా ప్రచారాన్ని హోరెత్తించిందన్నారు. వేకువజామునుంచే బీర్భూమ్, జార్ఖండ్‌ల నుంచి రౌడీలు దుర్గాపూర్‌లోకి ప్రవేశించి ఓటర్లను లోపల నిర్బంధించారని, లెఫ్ట్ నేతలపై దాడులు చేసి అనైతిక ఓటింగ్‌కు పాల్పడ్డారని విమర్శించారు. బొగ్గు మాఫియా కూడా తనదైన శైలిలో రెచ్చిపోయిందని, వారంతా బిజెపి, తృణమూల్‌లకు సాయం చేశారని పేర్కొన్నారు. ఫాసిస్టులా వ్యవహరిస్తున్న మమతా బెనర్జీ...మోడీని ఫాసిస్టు అంటూ విమర్శలు చేస్తే ప్రజలు ఎలా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు. బిజెపి, తృణమూల్‌ల మధ్య రహస్య ఒప్పందం ఉందని, అందుకే పార్లమెంటులో తృణమూల్ ఎంపీలు మోడీకి వ్యతిరేకంగా మాట్లాడరని సలీం విమర్శించారు. నారదా, శారదా కుంభకోణాల్లో దర్యాప్తు మొదలౌతుందనే భయంతోనే మోడీపై విమర్శలు చేయొద్దని తృణమూల్ ఎంపీలకు మమతా బెనర్జీ ఆదేశించారని తెలిపారు.

తీవ్ర ఒత్తిడిలో కాశ్మీర్ తీవ్రవాదులు : జైట్లీ

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌లోని తీవ్రవాదులు తీవ్ర ఒత్తిడిలో వున్నారని కేంద్ర రక్షణ మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. నోట్లరద్దు నిర్ణయంతో పాటు విదేశాల నుంచి నిధులు రాకుండా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) చర్యలు తీసుకోవడంతో జమ్ముకాశ్మీర్‌లో తీవ్రవాద కార్యకలాపాలకు అడ్డుకట్ట పడిందని అరుణ్‌జైట్లీ ఆదివారం వెల్లడించారు. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాలపాటు కార్యక్రమాలు నిరాకంటంగా కొనసాగించిన తీవ్రవాదులు కొన్ని నెలల నుంచి తీవ్ర ఒత్తిడిలో వున్నారని, జమ్ముకాశ్మీర్ పోలీసులు తీవ్రంగా శ్రమించడమే ఇందుకు కారణమని జైట్లీ ప్రశంసించారు. అయితే జమ్ముకాశ్మీర్ సరిహద్దు వద్ద సమస్యలు, దేశంలో తీవ్రవాదం అనే ప్రధానమైన రెండు సమస్యలను భారత్ ఎదుర్కొంటుందని జైట్లీ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కూడా కాశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాంగాగా పాకిస్తాన్ అంగీకరించలేకపోతుందని అన్నారు. ఇది ఒక పరిష్కరించబడని అంశంగా వుండిపోయిందని అన్నారు. కాగా కాశ్మీర్‌లో తీవ్రవాదాన్ని రూపుమాపడానికి భద్రతా దళాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయన్నారు. తీవ్రవాదుల సంఖ్య చాలా తగ్గుముఖం పట్టిందని, తీవ్రవాదులు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందుకే చరిత్రలో తొలిసారిగా వారు బ్యాంకు దోపిడీలకు కూడా పాల్పడుతున్నారని మంత్రి తెలిపారు.

వానీ వారసుని సహా ముగ్గురు హతం

హిజ్బుల్ ముజాహిద్దీన్‌కు మరో ఎదురుదెబ్బ

శ్రీనగర్: కాశ్మీర్‌లో వేర్పాటువాద ఉగ్రవాద సంస్థహిజ్బుల్ ముజాహిద్దీన్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. షోపియాన్‌లో ఆదివారం పోలీసులకు ఉగ్రవాదులకు జరిగిన ఎదురు కాల్పుల్లో బుర్హాన్‌వానీ వారసుడు యాసిన్ ఇట్టూ సహా ముగ్గురు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు తెలిపారు. మహ్మద్ గజనావీ, ఇట్టూ పోలీసులు జరిపిన కాల్పుల్లో హతయ్యాడు. శనివారం రాత్రి పోలీసులు-ఉగ్రవాదులకు మధ్య ఈ కాల్పులు జరిగినట్లు తెలిపారు. పోలీసులు ప్రాణనష్టం లేకుండా చూసేందుకు ప్రయత్నించినప్పటికీ ఉగ్రవాదులు ఎదురుకాల్పులకు దిగినట్లు ఆయన తెలిపారు. బందిపోరాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఆర్మీ అధికారులు మృతిచెందారు. మరో ముగ్గురు ఇతరులు మృతిచెందారు. కూంబింగ్‌ల నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు స్వాతంత్ర్య దినోత్సవం వేడుకులను భగ్నం చేసేందుకు పథక రచన చేస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు.

మతస్వేచ్ఛ బిల్లుకు జార్ఖండ్ అసెంబ్లీ ఆమోద ముద్ర

తమ ఐక్యతను దెబ్బతీస్తుందన్న ఆదివాసీ నేతలు

రాంచి: మతస్వేచ్ఛ బిల్లు 2017 పేరిట ప్రవేశపెట్టిన బిల్లుకు జార్ఖండ్ అసెంబ్లీ శనివారం ఆమోదముద్ర వేసింది. అంతకు ముందు రోజే జార్ఖండ్ ప్రభుత్వం అసెంబ్లీలో మతమార్పిడి నిరోధక బిల్లును ప్రవేశపెట్టటం, మతమార్పిడి నిరోధంపై మహాత్ముడి ప్రసంగాన్ని ఉటంకిస్తూ జారీ చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రకటన వివాదాస్పదంగా మారటం వంటి పరిణామాల నేపథ్యంలో జార్ఖండ్ అసెంబ్లీ ఈ బిల్లును ఆమోదించటం ప్రాధాన్యతను సంతరించుకుంది. మొత్తం జార్ఖండ్ జనాభాలో 27 శాతం మేర వున్న ఆదివాసీలలో అధికశాతం మంది సర్నా (ప్రకృతి ఆరాధన) మతారాధకులు కాగా కొంతమంది క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్నారు. 2011 జనాభా లెక్కలప్రకారం ఆదివాసీలలో అత్యధికులు సర్నామతాన్నే అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఆదివాసీలపై రాజకీయంగా పట్టు సాధించే లక్ష్యంతో జార్ఖండ్‌లోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లు తమ మధ్య ఐక్యతను దెబ్బతీస్తుందని ఇటు సర్నా మతస్తులు, అటు క్రైస్తవ ఆదివాసీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రులు హేమంత్ సోరెన్ (జెఎంఎం), బాబూలాల్ మరాండీ (జెవిఎం) వంటి ఆదివాసీ నేతలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నప్పటికీ అక్కడి రఘువర్‌దాస్ సర్కారు ఈ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం పొందటం విశేషం.

ఎసి రెస్టారెంట్‌లో కొన్నా 18 శాతం జిఎస్‌టి

- నాన్ ఎసి ప్రాంతంలో వడ్డించినా అదే పన్ను
- స్పష్టం చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: రెస్టారెంట్లలో భోజనం తిన్నవారికీ, అక్కడ నుంచి భోజనం తీసుకెళ్లి వేరే చోట తిన్నవారికీ పడే జిఎస్‌టిపై ప్రభుత్వం ఆదివారం వివరణ ఇచ్చింది. ఎసి రెస్టారెంట్‌లో వండిన భోజనం అదే రెస్టారెంట్‌లోని నాన్‌ఎసి ప్రాంతం నుంచి కొనుగోలు చేసినా లేదా సమీపంలోని నాన్‌ఎసి ప్రాంతంలో వడ్డించినా 18 శాతం జిఎస్‌టి చెల్లించాలని పేర్కొంది. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన జిఎస్‌టి చట్టం ప్రకారం నాన్‌ఎసి రెస్టారెంట్లు, హోటళ్లలో ఆహారంపై 12 శాతం, మద్యం లైసెన్సు ఉన్న హోటళ్లు, ఎసి రెస్టారెంట్లలో ఆహారంపై 18 శాతం, ఫైవ్ స్టార్ హోటళ్లపై 28 శాతం పన్ను విధించారు. అయితే ఒకే రెస్టారెంట్‌లో ఎసి, నాన్‌ఎసి సౌకర్యం ఉంటే ఎంత శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ బోర్డు(సిబిఇసి)ను ఇటీవల ఓ వినియోగదారుడు ప్రశ్నించాడు. "ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో కింది ఫ్లోర్‌లో నాన్ ఎసి ఉంటుంది. అక్కడ కేవలం ఆహారాన్ని మాత్రమే వడ్డిస్తారు. పైఫ్లోర్‌లో ఎసి ఉంటుంది. మద్యంతో పాటు ఆహారం కూడా వడ్డిస్తారు. అలాంటి సందర్భంలో రెండు ఫ్లోర్‌లో తినేవాళ్లపై ఒకే పన్ను విధిస్తారా?" అని అడిగాడు. దీనికి సిబిఇసి సమాధానమిస్తూ రెస్టారెంట్‌లో ఏ భాగంలో ఎసి ఉన్నా సరే 18 శాతం జిఎస్‌టి చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. అటువంటి రెస్టారెంట్లు కూడా మిశ్రమ పన్ను పరిధిలోకి రావని పేర్కొంది.

యుజిసి, ఎఐసిటిఇ స్థానంలో ఒకే వ్యవస్థ

సందిగ్ధతలో కేంద్ర ప్రణాళికలు

న్యూఢిల్లీ: యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఎఐసిటిఇ)ల స్థానంలో ఏకీకృత ఉన్నత విద్యా నియంత్రణా వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కేంద్రం రూపొందించిన ప్రణాళికలపై సందిగ్ధత నెలకొంది. ఉన్నత విద్యా, సాధికారిక నియంత్రణా వ్యవస్థ (హీరా) పేరుతో ఏర్పాటు చేయతలపెట్టిన ఈ ఏకీకృత వ్యవస్థను కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ వ్యతిరేకించటమే ఇందుకు కారణం. సాంకేతిక, సాంకేతికేతర విద్యా సంస్థలను ఒకే ఛత్రఛాయలోకి తెచ్చేందుకు మానవ వనరుల మంత్రిత్వశాఖ, నీతి ఆయోగ్‌లు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రయత్నాలు ఇప్పటి వరకూ పట్టాలెక్కలేదు. యుజిసి, ఎఐసిటిఇ విలీనం అంశాన్ని గత వారం పార్లమెంట్‌లో సభ్యులు ప్రస్తావించినపుడు మానవ వనరుల మంత్రిత్వశాఖ సహాయ మంత్రి ఉపేంద్ర కుష్వాహా బదులిస్తూ ఇటువంటి ప్రతిపాదనేదీ ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. అయితే మీడియా ప్రతినిధులు ఇందుకు కారణాలను అడిగినపుడు మానవ వనరుల మంత్రిత్వశాఖ అధికారులు పెదవి విప్పలేదు. ప్రతిపాదిత కొత్త వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర ప్రణాలిక రూపొందుతోందని అధికారులు ఇంతకు ముందు చెప్పారు.

చీలిక దిశగా జెడి(యు)

- నిజమైన పార్టీ తమదే అంటున్న శరద్ యాదవ్
- 14 రాష్ట్ర శాఖల మద్దతు ఉందని ప్రకటన



పాట్నా: బీహార్‌లో బిజెపితో పొత్తు పెట్టుకుని నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పటి నుంచి జెడి(యు)లో భగ్గుమన్న విభేదాలు చీలిక దిశకు దారితీస్తున్నాయి.. జెడి(యు) పార్లమెంటరీ పార్టీ నాయకత్వం నుంచి సీనియర్ నేత శరద్‌యాదవ్‌ను తొలగించడంతో పార్టీలో చీలిక ఏర్పడింది. పార్టీపై హక్కు కోసం శరద్‌యాదవ్, నితీశ్ గ్రూపులు మధ్య పోటీ నెలకొంది. 14 రాష్ట్రాల్లోని పార్టీ శాఖల అధ్యక్షుల మద్దతు తమకు ఉంది కాబట్టి జెడి(యు) పార్టీ తమదేనని శరద్‌యాదవ్ గ్రూపు వాదిస్తోంది. అయితే ఆ వాదనను నితీశ్ గ్రూపు కొట్టిపారేసింది. "జెడి(యు) జాతీయపార్టీ అయినప్పటికీ బీహార్‌లోనే గుర్తింపు ఉంది" అని జవాబిచ్చింది. ఈ వ్యాఖ్యలపై యాదవ్‌కు అత్యంత సన్నిహితుడైన అరుణ్ శ్రీవాస్తవ మాట్లాడుతూ "ప్రారంభం నుంచీ పార్టీని శరద్‌యాదవే నడిపించారు. జాతీయపార్టీ హోదా కూడా జెడి(యు)కి ఉంది. బీహార్‌లో మాత్రమే జెడి(యు)కి ప్రాబల్యముందని చెబుతున్న నితీశ్ కుమార్ వేరే పార్టీ పెట్టుకుంటే మంచిది" అని వ్యాఖ్యానించారు. గతంలో నితీశ్ కుమార్ స్థాపించిన సమతా పార్టీని జెడి(యు)లో విలీనం చేసిన సంగతిని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే ఇద్దరు రాజ్యసభ ఎంపీలు అలీ అన్వర్ అన్సారీ, వీరేంద్ర కుమార్‌లు శరద్ యాదవ్‌కు మద్దతు ప్రకటించారు. ప్రజా మద్దతు కోరుతూ ఇటీవల 'జన్ సంవాద్' పేరుతో మూడు రోజుల పర్యటన కార్యక్రమాన్ని యాదవ్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

రాజ్యసభకు రాజీనామా చేయండి శరద్‌యాదవ్‌కు నితీశ్ వర్గం డిమాండ్

మరోవైపు రాజ్యసభకు రాజీనామా చేయాలని శరద్‌యాదవ్‌ను నితీష్ వర్గం డిమాండ్ చేస్తోంది. తొలి ప్రాధాన్యత పార్టీకి ఇవ్వాలని జెడి(యు) నేత అజయ్ అలోక్ అన్నారు. నితీశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పనిచేయాలని శరద్‌యాదవ్ భావిస్తే...ముందుగా రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని అలోక్ పేర్కొన్నారు. అహంకారాన్ని పక్కనబెట్టి పూర్తి స్థాయిలో రాజ్యసభ ఎంపీ బాధ్యతలపై దృష్టి పెట్టాలని వ్యాఖ్యానించారు. అవినీతి పాలన కోసం బీహార్ ప్రజలు మహాగట్‌బంధన్‌కు అధికారాన్ని అప్పగించలేదన్నారు. మరోవైపు శరద్‌యాదవ్ తీరుపై బిజెపి నేత ఎస్ ప్రకాశ్ స్పందించారు. ఆయన అలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో అర్థం కావట్లేదన్నారు. ప్రస్తుత పరిస్థితిని నితీశ్ కుమార్ చక్కదిద్దగలరని పేర్కొన్నారు.

అక్టోబర్‌లో భారత్, రష్యా యుద్ధ క్రీడలు

న్యూఢిల్లీ : అక్టోబర్‌లో భారత్, రష్యాలు భారీ ఎత్తున యుద్ధ క్రీడలు నిర్వహించనున్నాయి. తమ ప్రాంతంలో భద్రత పరిస్థితి తీవ్రంగా మారిన నేపథ్యంలో ఇరు దేశాలు తమ ఆర్మీ, నౌకా, వాయు సేన సిబ్బందితో తొలిసారిగా ఈ యుద్ధ క్రీడలు నిర్వహించనున్నాయి. ఇరు దేశాలకు ఇలాంటి విన్యాసాలు ఇదే తొలిసారి. రష్యాలో ఈ యుద్ధ క్రీడలు అక్టోబర్ 19 నుంచి 29 వరకూ జరగనున్నాయి. భారత్‌కు చెందిన త్రివిధ దళాలు భారీ ఎత్తున విదేశాల్లో ఇలాంటి యుద్ధ క్రీడల్లో పాల్గొనడం ఇదే మొదటిసారి. కేవలం భారత ఆర్మీ నుంచే 350 సిబ్బంది పాల్గొంటున్నారు. వాయుసేన, నౌకా దళం నుంచి కూడా భారీ సంఖ్యలో పాల్గొంటారని అంచనా. అలాగే రష్యాకు చెందిన త్రివిధ దళాలు కూడా విడివిడిగా ఇతర దేశాలతో ద్వైపాక్షిక విన్యాసాల్లో పాల్గొన్నాయి. సంయుక్తంగా ద్వైపాక్షిక విన్యాసాల్లో పాల్గొనడం రష్యా త్రివిధ దళాలకు కూడా ఇదే మొదటిసారి.రష్యాలోని వ్లాదివోస్తోక్ పర్వత ప్రాంతంలోని మూడు ప్రదేశాల్లో ఈ విన్యాసాలు జరుగుతాయి. ఇరు దేశాల భద్రతాదళాల మధ్య పరస్పర అవగాహన, సహకారం పొందడానికి ఈ కార్యక్రమం సహాయపడుతుందని సైనిక వర్గాలు అంటున్నాయి. భారత్‌కు రష్యా ఎప్పటి నుంచో బలమైన సైనిక మిత్రపక్షంగా వుంటోంది.

వీడియోలో చిత్రీకరించండి

- మదర్సాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై యుపి సర్కారు ఆదేశాలు
- ముస్లిం మత పెద్దల భిన్నాభిప్రాయాలు
- అన్ని విద్యాసంస్థలకూ వర్తింపచేయాలని సూచన

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా వున్న మదర్సాలలో మంగళవారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వీడియోలో చిత్రీకరించాలన్న ఆదిత్యనాథ్ సర్కారు నిర్ణయంపై ముస్లిం మతపెద్దలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ వీడియో చిత్రీకరణ పారదర్శకతను, నమ్మకాన్ని పెంచుతుందని కొందరు వాదిస్తుండగా మరికొందరు మాత్రం ఈ అసందర్భపు ఆదేశాలు ముస్లింల దేశభక్తిని శంకించే విధంగా వున్నాయని ఆరోపిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పూర్తి స్థాయిలో నిర్వహించి వాటిని వీడియోలో చిత్రీకరించాలని యుపి ప్రభుత్వం ఇటీవల ఆదేశించినట్లు రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి లక్ష్మీనారాయణ చౌదరి చెప్పారు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం పతాకావిష్కరణ, జాతీయ గీతాలాపనతో ప్రారంభమయ్యే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అమరవీరులకు పుష్పాంజలి ఘటించటం, విద్యార్థుల దేశభక్తి గీతాలాపన వంటి కార్యక్రమాలతో పాటు స్వాతంత్ర్య పోరాట యోధులు, స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేకతను విద్యార్థులకు వివరిస్తూ ప్రసంగాలు వుంటాయని, వీటితో పాటు జాతీయ ఐక్యతను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలు నిర్వహించాలని, చివరిలో విద్యార్థులకు మిఠాయిలు పంచాలని ప్రభుత్వం తన సర్క్యులర్‌లో వివరించింది. ఈ సర్క్యులర్‌పై స్పందించిన అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్ సభ్యుడు మౌలానా ఖలీద్ రషీద్ ఫారంగి మెహలీ మాట్లాడుతూ మైనార్టీ వర్గాలు 1947 నుండి ఏటా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహిస్తూనే వున్నాయని, ఇందులో కొత్తగా చెప్పాల్సిందేమీ లేదని అన్నారు. తాజాగా జారీ చేసిన ఆదేశాలు అన్ని విద్యాసంస్థలకూ వర్తింప చేస్తే తమకు ఎటువంటి సమస్యా లేదని, ఇది కేవలం మదర్సాలకు ఉద్దేశించినది మాత్రమే కావటంతో ప్రభుత్వం తమ దేశభక్తిని శంకిస్తోందన్న అనుమానం కలుగుతోందని వివరించారు. కాగా షియా పర్సనల్ లాబోర్డ్ సభ్యుడు యాసూబ్ అబ్బాస్ ప్రభుత్వ ఆదేశాల పట్ల తమకు ఎటువంటి అభ్యంతరమూ లేదని, అయితే దీనిని అన్ని విద్యాసంస్థలకూ వర్తింప చేయాల్సి వుంటుందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలను తాము స్వాగతిస్తున్నట్లు యుపి బిజెపి నేత రొమానా సిద్దికీ చెప్పారు.

కొండ చరియలు విరిగి పడి 49 మంది మృతి

- నేపాల్‌లో వరదల బీభత్సం



ఖాట్మాండ్: నేపాల్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వీటి తాకిడికి కొండ చరియలు విరిగి పడి 49 మంది మృతిచెందారు. పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వేలాది కుటుంబాలలోని ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ వరదల కారణంగా జరిగిన ప్రమాదంలో 13 మందికి తీవ్రగాయాలు కాగా, మరో 17 మంది గల్లంతయ్యారని ఆ దేశ హోం మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. 21 జిల్లాల్లో వరదలు తీవ్ర ప్రభావం చూపినట్లు స్థానిక మీడియా పేర్కొంది. పంచతూర్‌లో ఒకరు, సింధూలి, జాపా, బాంకేలలో ఐదుగురు చొప్పున, సున్సారిలో ఎనిమిది మంది, సర్లహి, సూర్‌కేత్‌లో మూడు, బర్దియాలో ఇద్దరు, ధనూష, మక్వన్‌పూర్, కైలాయి, పల్పా జిల్లాలో ఒక్కొక్కరు చొప్పున మృతిచెందారు. 35,843 ఇళ్లు వరద ప్రభావంతో చిక్కుకున్నాయి. వెయ్యి ఇళ్లు ధ్వసం అయ్యాయి. 397 పశువులు మృతిచెందినట్లు అధికారులు ప్రకటించారు. తరాయి పరిధిలోని పలు నగరాలు వరద గుప్పట్లోకి వెళ్లాయి. తూర్పు -పడమర రహదారుల్లో రవాణా పూర్తి స్థాయిలో నిలిచిపోయింది. వరదల నేపథ్యంలో ప్రధాని షేర్ బహదూర్ దేవ్ అత్యవసర సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎన్నికల బాటలో మోడీ సర్కార్

ప్రజాకర్షక పథకాలకు పెద్దపీట వేస్తుందంటున్న విశ్లేషకులు

న్యూఢిల్లీ: మరో ఏడాదిన్నర కాలంలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న కేంద్రంలోని మోడీ సర్కారు మూడేళ్ల క్రితం తాను చేపట్టిన భారీ సంస్కరణలకు తాత్కాలికంగా తెరదించే ప్రయత్నాలు చేస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. ఏడాది క్రితం పెద్ద నోట్ల రద్దు, ఇటీవల జిఎస్‌టి అమలు వంటి ఆర్థిక సంస్కరణలు దేశ ప్రజల జీవితాలను భారీగా కుదిపేసిన నేపథ్యంలో ఇకపై ప్రజాకర్షక పథకాలకు తెరతీయాలని కేంద్రం భావిస్తోందని వీరు విశ్లేషిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు తాయిలాలు అందించే ప్రజాకర్షక పథకాలను అమలు చేయటంతో పాటు ఇప్పటి వరకూ సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతోందంటున్నారు. ఇప్పటి వరకూ విజయవంతంగా అమలు చేసిన పథకాలను మరింత పటిష్టం చేయటంతో పాటు ఇప్పటికే ప్రారంభించిన మౌలిక వసతుల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసే అంశంపై ప్రధాని నరేంద్రమోడీ దృష్టి సారిస్తారని భావిస్తున్నట్లు ప్రముఖ ఆర్థిక వేత్త సిద్ధార్థ సన్యాల్ తన వారాంతపు విశ్లేషణలో పేర్కొన్నారు. స్థూల ఆర్థిక రంగంలో చట్టపరమైన సంస్కరణలపై కాక పాలనాపరమైన విధానాలపై ప్రభుత్వం మరింత దృష్టి సారిస్తుందని భావిస్తున్నామన్నారు. 2014లో అధికారం చేపట్టిన వెంటనే దూకుడుగా ఆర్థిక సంస్కరణలు చేపట్టిన మోడీ 2019 ఎన్నికల నాటికి తనకు రాజకీయంగా ప్రయోజనం కల్పించే అంశాలను మాత్రమే చేపడతారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోడీ తన రాజకీయ వనరులన్నింటినీ తన సంస్కరణ వాద ప్రతిష్ట కన్నా తన రాజకీయ ప్రయోజనాలపైనే దృష్టి కేంద్రీకరిస్తారని భావిస్తున్నట్లు సన్యాల్ వివరించారు. ఒక వేళ రానున్న ఏడాదిన్నర కాలంలో ఆమోదం పొందేందుకు మోడీ ప్రయత్నించే అవకాశాలు ఉన్నప్పటికీ అవన్నీ గతకాలంలో ఈపథకాల అమలులో సాధించిన జయాపజయాలపైనే ఆధారపడి వుంటాయని ఆయన తన పత్రంలో పేర్కొన్నారు. గతంలో పక్కన పెట్టిన భూ, కార్మిక సంస్కరణలపై గట్టి ప్రయత్నాలు చేయకుండా తనకు తక్షణ ఫలితాలను అందించే పథకాలకే ప్రధాని పరిమితమవుతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటే రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీ చేపట్టే విధానపరమైన చర్యలు అవినీతిపై పోరు, ప్రస్తుత విధాన ప్రాధాన్యతల పూర్తి, మౌలిక వసతుల ప్రాజెక్టుల పూర్తి వంటి అంశాలకు మాత్రమే పరిమితమవుతాయని, తన ప్రయత్నాలు సామాన్యుడికి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏ విధంగా సహాయ పడుతున్నాయన్న అంశాన్ని ప్రచారం చేసుకునేందుకు ప్రాధాన్యతనిస్తారని భావిస్తున్నట్లు సన్యాల్ వివరించారు.

ప్రభుత్వానిదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

రెండురోజుల ముందు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాస్పిటల్‌ను సందర్శించారు కానీ ఆక్సిజన్ సరఫరాకు నిధులను మాత్రం విడుదల చేయలేదు. పిల్లల మరణాలు మరింత పెరిగి ఈ ఘటన మీడియాను ఆకర్షించడంతో తమ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. పిల్లల మరణాలకు ఆక్సిజన్ అందకపోవడం కారణం కాదని చెప్తున్నారు. కానీ వాస్తవాలు మాత్రం అదే కారణమని, దానికి ప్రభుత్వానిదే పూర్తి బాధ్యతని వెల్లడిస్తున్నాయి. ఆస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్లను సరఫరా చేసే పుష్పా సేల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమకు అందాల్సిన బకాయిలపై ప్రభుత్వాన్ని గత ఏడు నెలల్లో ఏడుసార్లు హెచ్చరించినట్లు తెలుస్తోంది. తమ బకాయిలు చెల్లించకుంటే తాము సిలిండర్ల సరఫరాను కొనసాగించలేమని, తరువాతి పరిణామాలకు తాము బాధ్యత వహించబోమని ఆ సంస్థ ఆస్పత్రి యాజమాన్యాన్ని హెచ్చరించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుండి ఆగస్టు వరకూ ఈ సంస్థ వైద్య కళాశాల యాజమాన్యానికి కనీసం ఏడు సార్లు లేఖలు రాసినట్లు తెలుస్తోంది. ఈ లేఖలను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజీవ్ మిశ్రాకు పంపిన కంపెనీ సేల్స్ మేనేజర్ మీడియాతో మాట్లాడుతూ తమ బకాయిలకు సంబంధించి ఆస్పత్రి యాజమాన్యానికి గత నెల 31న లీగల్ నోటీసును కూడా పంపామని, కానీ స్పందన కరువైందని వివరించారు. ఆస్పత్రి యాజమాన్యం తమతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ప్రతి పదిహేను రోజులకోసారి చెల్లింపులు జరపాలని, బకాయిలు రు.పది లక్షలకు మించనివ్వరాదని నిబంధనలు విధించామన్నారు. అయితే గత మే, జూన్ నెలల్లో కేవలం రెండు సార్లు మాత్రమే పాక్షిక చెల్లింపులు జరిపారని, కానీ తాము మానవతా దృష్టితో ఆక్సిజన్ సరఫరాను దాదాపు తొమ్మిది నెలలపాటు కొనసాగించామని ఆయన వివరించారు. ఈ నెల 4వ తేదీ వరకూ కూడా ఆక్సిజన్ సరఫరాను కొనసాగించామన్నారు. శుక్రవారం నాడు చిన్నారుల మరణాలు వెలుగు చూసిన తరువాత మాత్రమే ఆస్పత్రి యాజమాన్యం రు.20 లక్షలు చెల్లించిందని, ఇంకా రు.40 లక్షల మేర బకాయి పెండింగ్‌లో వుందని ఆయన చెప్పారు. బకాయిల చెల్లింపు జరిపి ఆర్నెల్లు దాటిపోయిందని, తదుపరి జాప్యానికి ఆస్పత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలని హెచ్చరిస్తూ తాము గత నెల 18న లేఖ రాశామని, దాని నకలును గోరఖ్‌పూర్ జిల్లా మేజిస్ట్రేట్‌కు కూడా పంపామని ఆయన వివరించారు. తాము ఆక్సిజన్ పంపిణీ దారులం మాత్రమేనని, రాజస్థాన్‌లోని ఒక సంస్థ నుండి తాము సిలిండర్లను తెప్పించుకుని స్థానికంగా పంపిణీ చేస్తుంటామని చెప్పారు. ఆస్పత్రికి సిలిండర్ల సరఫరా పునరుద్ధరణకు మరో రోజు పడుతుందన్నారు.

ప్రభుత్వ వ్యాఖ్యలతో విభేదించిన బాధితులు

గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరాలో సమస్య అరుదుగా మాత్రమే తలెత్తుతుంటుందని యుపి ప్రభుత్వం చేసిన ప్రకటనను బాధితులు తీవ్రంగా ఖండించారు. ఘటన సంభవించిన 10వ తేదీకి రెండు రోజుల ముందు సైతం ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరాలో తీవ్రమైన సమస్య తలెత్తిందనిఈ ఘటనలో మరణించిన ఒక నవజాత శిశువు తల్లిదండ్రులు వివరించారు. ఆక్సిజన్ కొరత కారణంగానే తమ కుమార్తె చనిపోయిందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అయితే ఆస్పత్రి యాజమాన్యం మాత్రం ఊపిరి సంబంధిత సమస్యలతో ఆ శిశువు మరణించిందని చెబుతోంది. ఈ నెల ఎనిమిదో తేదీన సైతం ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరా మానిటర్ ప్రమాద సంకేతాలను వెలువరించిందని వారు గుర్తు చేశారు. ఘటన జరిగిన 10వ తేదీసైతం ఆక్సిజన్ సరఫరా స్థాయి బాగా తగ్గిపోయిందని, ఆస్పత్రిలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. ఆ రోజు అర్ధరాత్రి నుండి మరునాడు ఉ.6.30 గంటల మధ్యలో ఆరుగురు చిన్నారులు మరణించారని, ఆ రోజు మధ్యాహ్నం 1.30 గంటల నుండి సాయంత్రం 5 గంటలలోపు మరో ఐదుగురు మృత్యువాత పడ్డారని వారు వెల్లడించారు. తాము చెబుతున్న విషయాలకు సంబంధించి ఆస్పత్రిలో సిసిటీవీ దృశ్యాలను, ఆక్సిజన్ మానిటర్ సంకేతాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

దర్యాప్తునకు ఆదేశించిన యోగి సర్కారు

ఆదివారం ఉదయం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జెపి నడ్డాతో కలిసి ఆస్పత్రిని సందర్శించిన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దాస్ ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. ఆక్సిజన్ సరఫరా బకాయిలకు సంబంధించిన నిధులకు తాము ఈ నెల 5నే క్లియరెన్స్ ఇచ్చినప్పటికీ ఆస్పత్రి యాజమాన్యం 11వ తేదీ వరకూ చెల్లింపులు జరపలేదని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఆక్సిజన్ సరఫరా లేకుండా వైద్య చికిత్సలు జరిపిన సమయంలో సైతం ఈ ఆస్పత్రిలో ఒక్క మరణం కూడా నమోదు కాలేదని వెల్లడించింది. బకాయిల చెల్లింపులో జాప్యానికి రెడ్ టేపిజమే కారణమని సస్పెండయిన ఆస్పత్రి చీఫ్ రాజీవ్ మిశ్రా చెప్పారు. చిన్నారుల మరణానికి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన శనివారం రాత్రి తన పదవికి రాజీనామా చేశారు.

కలవరపరచిన చిన్నారుల మరణాలు: సిఎం ఆదిత్యనాథ్

ఆక్సిజన్ సరఫరా లోపంతో శుక్రవారం చోటు చేసుకున్న చిన్నారుల మరణాలు తనను తీవ్రంగా కలవరపరిచాయని యుపి ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ దాస్ చెప్పారు. ఆదివారం ఉదయం ఆస్పత్రిని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను గత నెల 9న ఆస్పత్రిని సందర్శించినపుడు ప్రభుత్వం నుండి ఏదైనా సాయం కావాలా? అన్న ప్రశ్నకు అధికారులు ఏమీ అవసరం లేదని బదులిచ్చారన్నారు. ఆస్పత్రిలో మెదడు వాపు వ్యాధికి అవసరమైన చికిత్సకు సంబంధించిన ఏర్పాట్లపై వివరించాలని తాను అధికారులను కోరానని, ఆస్పత్రి సిబ్బంది సమస్యల గురించి కూడా అడిగానని వివరించారు. ఈ విషయంలో అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రధాని నరేంద్రమోడీ హామీ ఇచ్చారని ఆయన వివరించారు. ఆస్పత్రిలో పరిస్థితిని, ఏర్పాట్లను సమీక్షించేందుకు ఢిల్లీ నుండి వైద్య నిపుణులతో కూడిన బృందం ఆస్పత్రిని సందర్శించిందన్నారు. చిన్నారుల మరణానికి దారి తీసిన పరిస్థితులపై విచారణ జరిపి దోషులుగా తేలిన వారిని శిక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీని నియమించామన్నారు. కేవలం ఒక్క గోరఖ్‌పూర్‌లో మాత్రమే కాక యుపిలో ప్రజా జీవితానికి ఎక్కడ హాని జరిగినా అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ట్రిపుల్ తలాక్‌పై మరో పిటీషన్‌కు సుప్రీం తిరస్కరణ

న్యూఢిల్లీ : ట్రిపుల్ తలాక్ అంశంపై మరొక తాజా పిటిషన్‌ను విచారణకు స్వీకరించలానే అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ట్రిపుల్ తలాక్ చట్టబద్ధత, నికా హలాల, బహుభార్యతత్వం వంటి అంశాలపై ప్రస్తుతం ఒక పిటిషన్ విచారణలో వుందని, ఈ పిటిషన్ విచారణలో వుండగా, మరో పిటిషన్ అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. గతంలో ట్రిపుల్ తలాక్ చట్టబద్ధతను ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన ఐదుగురు జడ్జీలతో కూడిన ధర్మాసనం తీర్పును మే 18న రిజర్వ్‌లో పెట్టిన విషయం తెలిసిందే. ఈ కేసులో కేంద్రం, అల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, అల్ ఇండియా ముస్లిం వుమెన్ పర్సనల్ లా బోర్డు, ఇతరులు తమ నివేదికలు కోర్టుకు సమర్పించారు.

నీట్ నుంచి తమిళనాడుకు మినహాయింపు

న్యూఢిల్లీ : 2017 జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) నుంచి తమిళనాడుకు మినహాయింపు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా వుంది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామ్ తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ వైద్య కళాశాల్లో ప్రవేశం పొందడానికి సహాయంగా నీట్ నుంచి ఒక ఏడాది తమిళనాడును మినహాయింపు ఇస్తామని అన్నారు. అయితే మినహాయింపు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ జారీ చేయాల్సివుందని మంత్రి తెలిపారు. ఇప్పటికే తమిళనాడులోని ప్రైవేట్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్శిటీలు నీట్ ప్రకారమే విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నాయని, అయితే ప్రభుత్వ కళాశాల నిబంధనలతో సమస్య వస్తోందని అన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల్లో ప్రవేశం పొందడటం గ్రామీణ విద్యార్థులకు కష్టంగా వుందన్నారు.

అక్రమ వలసదారులతో జాతీయ భద్రతకు ముప్పు

- వారిని త్వరగా పంపేయాలని రాష్ట్రాలకు సూచించిన కేంద్రం

న్యూఢిల్లీ: పొరుగున వున్న దేశాల నుండి మన దేశంలోకి ప్రవేశిస్తున్న అక్రమ వలసదారులతో దేశ భద్రతకు పెను ముప్పు పొంచి వుంటుందని కేంద్రం హెచ్చరించింది. గత కొన్ని దశాబ్దాలుగా అనేక దేశాలను వేధిస్తున్న అత్యంత తీవ్రమైన సమస్య ఉగ్రవాదం అని, ఉగ్రవాద సంస్థలు రిక్రూట్ చేసుకున్న వ్యక్తులు అక్రమ వసలదారుల రూపంలో ప్రవేశిస్తుండటం పట్ల అప్రమత్తంగా వుండాలని కేంద్ర హోం మంత్రిత్వశాఖ రాష్ట్రాలకు పంపిన ఒక లేఖలో సూచించింది. ఈ అక్రమ వలసదారులు కేవలం భారతీయ హక్కులకు విఘాతం కలిగించటం మాత్రమే కాక వారి నుండి దేశానికి పలు సవాళ్లు ఎదురవుతున్నాయని వివరించింది. పొరుగునే వున్న మయన్మార్‌లోని రఖినే రాష్ట్రం నుండి భారత భూభాగంలోకి వస్తున్న రోహింగ్యాల వంటి వారి వల్ల పరిమిత స్థాయిలో వున్న దేశ వనరులపై భారం పడటంతో పాటు భద్రతా పరమైన సవాళ్లు కూడా ఎదురవుతున్నాయని హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది.


గుజరాత్‌ను వణికిస్తున్న స్వైన్‌ఫ్లూ

ఈ యేడాదిలో 138 మంది మృతి

అహ్మదాబాద్: గుజరాత్‌లో స్వైన్‌ఫ్లూ విజృంభిస్తోంది. యేడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఈ వైరస్ సోకి 138 మంది చనిపోయినట్టు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శంకర్ చౌదరీ వెల్లడించారు. జనవరి నుంచి ఈనెల 11 వరకు 1,344 మందికి స్వైన్‌ఫ్లూ సోకిందని, వీరిలో 138 మంది వ్యాధి తీవ్రతరమై మృతి చెందారని వివరించారు. 708 మంది ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, మిగిలిన 498 మందికి వ్యాధి పూర్తిగా నయమైందని ఆయన తెలిపారు. వైరస్ సోకి అహ్మదాబాద్‌లో అత్యధికంగా 37 మంది చనిపోగా..రాజ్‌కోట్‌లో 17 మంది మృతి చెందారు. స్వైన్‌ఫ్లూ కేసులు అంతకంతకూ పెరుగుతుండడంతో రాష్ట్ర సీఎం విజయ్ రూపానీ.. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాధి నివారణ కోసం తీసుకోవల్సిన జాగ్రత్తలపై, ఇప్పటికే సోకిన వారికి అందిస్తున్న చికిత్సపై ఈ సమావేశంలో సీఎం ఆరా తీశారు. తగు జాగ్రత్తలు తీసుకొని, వ్యాధి నివారణకు కృషి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

లిబియా జలాల్లోకి ఇటలీ నౌకలు

లిబియా ఖండన



రోమ్ : లిబియా జలాల్లోకి నావికదళాలను మోహరించడానికి ముందుగా తనను సంప్రదించలేదని లిబియన్ జనరల్ జలిఫా హఫ్తార్ ఇటలీ ప్రభుత్వాన్ని విమర్శించారు. లిబియా సముద్ర జలాల గుండా జరుగుతున్న మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా సంయుక్త విన్యాసాల కోసం లిబియా తీర ప్రాంత రక్షక దళాలకు సాంకేతిక, నిర్వహణాపరమైన తోడ్పాటును అం దించాలని ఇటలీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో హఫ్తార్ ప్రకటన వెలువడింది. లిబియా ప్రధాని ఫయేజ్‌అల్ సెరాజ్ చేసిన అభ్యర్థన మేరకు ఇటలీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం జోర్డాన్‌లో వున్న హఫ్తార్ దీనిపై స్పందిస్తూ, ఈ అంశంపై తనతో చర్చించకుండానే అటు ఇటలీ ప్రభుత్వం, ఇటు లిబియా ప్రభుత్వం ఈ నిర్ణ యం తీసుకోవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఇటీవల పారిస్‌లో కుదిరిన ఒప్పందాన్ని ప్రధాని సెరాజ్ ఉల్లంఘించారని అన్నారు. లిబియా ప్రాదేశిక జలాల్లోకి ఇటలీ నౌకలు ప్రవేశించేందుకు అనుమతి ఇవ్వడానికి సెరాజ్‌కు అధికారం లేదనే విషయం ఇటలీకి కూడా తెలుసునని ఆ రకంగా ఇటలీ ప్రభుత్వం కూడా దీనికి బాధ్యురాలేనని ఆయన పేర్కొన్నారు.

14మంది షియాల మరణశిక్ష ఆపండి


సౌదీ సర్కార్‌కు నోబెల్ బహుమతి గ్రహీతల విజ్ఞప్తి

రియాధ్ : నిరసనలకు సంబంధించిన నేరాలకు పాల్పడినందుకు 14మంది షియాలకు విధించిన ఉరిశిక్షలను నిలుపుచేయాల్సిందిగా సౌదీ అధికారులను కోరుతూ ప్రపంచవ్యాప్తంగా గల నోబెల్ బహుమతి గ్రహీతలు ఒక బహిరంగ లేఖ రాశారు. 2012లో నిరసనలకు సంబంధించి వీరిపై మోపిన అభియోగాలు రుజువయ్యాయి. అలాగే అల్లర్లు, చౌర్యం, దోపిడీ, సాయుధ తిరుగుబాటు వంటి అభియోగాలు కూడా రుజువు కావడంతో షియాలైన 14మంది సౌదీ పౌరులను వెంటనే ఉరి తీస్తారనే భయాందోళనలు పెరిగాయి. అమ్నెస్టీ ఇంటర్నేషనల్, మానవ హక్కుల పర్యవేక్షక సంస్థలు సౌదీ చర్యను తీవ్రంగా విమర్శించాయి. విచారణ సక్రమంగా జరగలేదని, ఒత్తిడితో వారు నేరం చేసినట్లు అంగీకరించేలా చేశారని పేర్కొన్నాయి. కాగా వర్ణవివక్షపై పోరాడిననేత డెస్మండ్ టుటుతో సహా పలు వురు బహిరంగ లేఖపై సంతకాలు చేశారు. వారి మరణ శిక్షలను ధృవీకరించకుండా క్షమాభిక్ష పెట్టాల్సిందిగా సౌదీ రాజుకు వారు విజ్ఞప్తి చేశారు.

కెన్యాలో నిరసనల వెల్లువ

పోలీసుల కాల్పుల్లో 11మంది మృతి

నైరోబి : కెన్యా అధ్యక్ష ఎన్నికల అనంతరం జరిగిన ఘర్షణలు, నిరసనలను అణచివేయడానికి పోలీసులు చేపట్టిన చర్యల్లో 11మంది మరణించారు. అధ్యక్షుడుగా ఉహూరు కెన్యట్టా తిరిగి ఎన్నిక కావడాన్ని తీవ్రంగా నిరసిస్తూ పశ్చిమ ప్రాంత పట్టణమైన కిసుములో, రాజధానికి చుట్టుపక్కల గల మురికివాడల ప్రాంతాల్లో ఘర్షణలు చెలరేగాయి. వాటిని నియంత్రించే క్రమంలో 11మంది మరణానికి పోలీసులు కారణమయ్యారని ప్రత్యక్ష సాక్షులు శనివారం తెలిపారు. నైరోబిలోని మాథరే మురికివాడలో 9మంది యువకులను పోలీసులు కాల్చి చంపారని అధికారులు తెలిపారు. మరో సంఘటనలో పోలీసు కాల్పుల్లో ఒక బాలిక మరణించిందని ప్రత్యక్షసాక్షి తెలిపారు. కిసుము చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు బాష్పవాయు గోళాలను, తూటాలను ప్రయోగించారని చెప్పారు. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ప్రతిపక్షం ఆరోపిస్తున్నా, కెన్యట్టా (55) మరో ఐదేళ్ళ పదవీకాలానికి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఆ తర్వాత కాస్సేపటికే హింస, ఘర్షణలు చెలరేగాయి. ఇది చట్టబద్ధమైన రీతిలో జరుపుతున్న రాజకీయ నిరసనలు కాదని, నేరపూరిత శక్తులు కొన్ని పాల్పడుతున్న హింసాకాండ అని హోం మంత్రి వ్యాఖ్యానించారు.



అమెరికా బెదిరింపులకు వెనిజులా ఖండన



కారకస్ : వెనిజులాపై సైనిక చర్యకు దిగుతామంటూ అమెరికా చేసిన బెదిరింపులను జాతీయ రాజ్యాంగ అసెంబ్లీ (ఎఎన్‌సి) అధ్యక్షురాలు డెల్సీ రొడ్రిగజ్ ఖండించారు. వెనిజులా ప్రజల మద్దతు, తోడ్పాటు అధ్యక్షుడు నికొలస్ మదురోకే వుందంటూ ఆమె ట్విట్టర్‌లో స్పష్టం చేశారు. అవసరమనుకుంటే వెనిజులాపై సైనిక చర్యతో సహా పలు అవకాశాలను పరిశీలిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. రాజ్యాంగ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించవద్దంటూ అమెరికా పదే పదే హెచ్చరించినా వాటిని పట్టించుకోకుండా వెనిజులా ఈ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించింది. దాదాపు 80లక్షల మందికి పైగా వెనిజులన్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ చర్య అమెరికాకు ఆగ్రహం తెప్పించింది. వెనిజులా సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకునేందుకు, శాంతిని కాపాడుకునేందుకు ఎఎన్‌సిని ఎన్నుకోవడమే మార్గమని ప్రజలు భావించారని డెల్సీ రొడ్రిగజ్ పేర్కొన్నారు. అధ్యక్షుడు మదురోకి ఎఎన్‌సి పూర్తి అండదండలను అందిస్తుందని తెలిపారు.


మయన్మార్‌లో సైన్యం మోహరింపు

ఐక్యరాజ్య సమితి ఆందోళన



నెపిడా : ఉత్తర రాఖినే రాష్ట్రంలో తీవ్రవాద కార్యకలాపాలు ముమ్మరం కావడంతో అక్కడకు వందల సంఖ్యలో బలగాలను తరలించినట్లు ప్రభుత్వాధికారులు తెలిపారు. కాగా, ఆ ప్రాంతంలో సైనిక బలగాలను ముమ్మరంగా మోహరిస్తున్నట్లు వచ్చిన వార్తలపై ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. గతేడాది అక్టోబరు నుండి రాఖినే రాష్ట్రం హింసాకాండతో అట్టుడుకుతోంది. ఆ సమయంలో అక్కడ సైనిక అణచివేత చర్యలు కొనసాగాయి. ముస్లిం మైనారిటీలైన రోహింగ్యాలను పూర్తిగా తుడిచిపెట్టేందుకే ఈ చర్యలంటూ ఐక్యరాజ్య సమితి కూడా ఆందోళన వెలిబుచ్చింది. 70వేల మందికి పైగా రోహింగ్యాలు సరిహద్దులు దాటి బంగ్లాదేశ్‌కు పారిపోయారు. ఇటీవల అక్కడ వరుసగా కొన్ని హత్యలు జరగడంతో తాజాగా బలగాలను మోహరించినట్లు ప్రభుత్వ అధికారులు శనివారం తెలిపారు. తీవ్రవాదులు శిక్షణ పొందుతున్న పర్వత ప్రాంతాలకు సైనికులను పంపినట్లు వారు చెప్పారు. అవసరమనుకున్న ప్రాంతాల్లో కొత్తగా ప్రభుత్వం కర్ఫ్యూను విధిస్తోందని మీడియా తెలిపింది. రోహింగ్యాలపై అణచివేత చర్యలకు పాల్పడుతున్నారంటూ సైన్యంపై ఐక్యరాజ్య సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, మయన్మార్ మాత్రం ఆ ఆరోపణలను కొట్టిపారేస్తోంది.

113 ఏళ్ల కురు వృద్ధుడు కన్నుమూత



హైఫా, (ఇజ్రాయిల్) : ప్రపంచంలోనే కురు వృద్ధుడైన ఇజ్రాయిల్ క్రిస్టల్ (113) శుక్రవారం కన్నుమూసినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు ప్రపంచ యుద్ధాలను చూసిన, ఆష్విట్జ్ నిర్బంధ శిబిరం నుండి బతికి బయటపడిన ఇజ్రాయిల్ క్రిస్టల్ మరో నెలలో 114వ పుట్టిన రోజు జరుపుకోబోతుండగా మరణించినట్లు ఆయన మనవడు ఓరెన్ క్రిస్టల్ తెలిపారు. గతేడాది గిన్నెస్ రికార్డు బుక్ నిర్వాహకులు హైఫాలోని క్రిస్టల్ ఇంటిని సందర్శించి ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడుగా గుర్తించినట్లు ఆయనకు ఒక సర్టిఫికెట్‌ను అందచేశారు. 1903లో పోలెండ్‌లోని జర్నొ పట్టణంలో సంప్రదాయవాదులైన యూదు కుటుంబంలో జన్మించారు. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో జర్మన్ నాజీలు విచక్షణారహితంగా జరిపిన యూదుల ఊచకోతలో మొదటి భార్యను, ఇద్దరు పిల్లలను క్రిస్టల్ కోల్పోయారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసేనాటికి బక్కచిక్కిపోయి కేవలం 37కిలోల బరువుతో అతిపెద్ద కుటుంబంలో మిగిలింది ఆయనొక్కరే. 1950లో తనలాంటి మరో బాధితురాలితో కలిసి ఇజ్రాయిల్‌వచ్చేశారు. అక్కడ కొత్త జీవితాన్ని ప్రారంభించి విజయవంతంగా వ్యాపారాన్ని కూడా నిర్వహించారని ఆయన మనవడు తెలిపారు.

అమెరికాలో భగ్గుమన్న జాత్యహంకారం

(మొదటి పేజీ తరువాయి)

మరో గ్రూపు సభ్యులతో వీరు ఘర్షణ పడ్డారు. ఈ సందర్భంగా శ్వేత జాతీయులు సృష్టించిన బీభత్సంలో ఒక మహిళ (32) మరణించగా 19మంది గాయపడ్డారు. శ్వేత జాతీయుల ర్యాలీని వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు జరుపుతున్న నిరసనల్లో ఆ మహిళ పాల్గొంది. అయితే ఆ మహిళ ఎవరో ఏమిటో పేరు ఇంతవరకు వెల్లడించలేదు. శ్వేత జాతీయులకు చెందిన వ్యక్తి ఆందోళనాకారులపైకి కారును అడ్డదిడ్డంగా పోనివ్వడంతో ఆ మహిళ మరణించింది. కాగా ఆ నిరసనల ప్రదేశానికి కాస్త దూరంలో గగనతలం నుండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్న హెలికాప్టర్ కూలి మరో ఇద్దరు మరణించారు. శనివారం దాడి జరిగిన వెంటనే అధ్యక్షుడు ట్రంప్ ఈ ఘటనను ఖండించ లేదు. కొన్ని గంటలు గడిచిన అనంతరం స్పందిస్తూ, ఈ సంఘటనను భయంకరమైనదిగా వ్యాఖ్యానించారు. విద్వేషం, వివక్ష, హింసను ఇలా ప్రదర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని న్యూజెర్సీలోని గోల్డ్ రిసార్ట్‌లో ట్రంప్ విలేకర్లతో మాట్లాడుతూ, వ్యాఖ్యానించారు. 'ఈ తరహా హింస చాలాకాలం నుండి మన దేశంలో కొనసాగుతోంది. ట్రంప్, లేదా ఒబామా హయాంలో అని కాదు, సుదీర్ఘకాలంగా ఈ పరిస్థితి కొనసాగుతోంది. అమెరికాలో ఈ తరహా పరిస్థితులకు అవకాశమివ్వరాదు. తక్షణమే శాంతి భద్రతల పరిస్థితిని పునరుద్ధరించాల్సిన అవసరం వుంది. అమాయకులైన ప్రజల ప్రాణాలను కాపాడాల్సి వుంది." అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మన సమాజంలో ఏ పౌరుడు కూడా భద్రత కోసం భయపడరాదని అన్నారు. ఏ పిల్లవాడు కూడా బయటకు వెళ్లి ఆడుకునేందుకు లేదా తల్లితండ్రులతో కలిసి తిరిగేందుకు భయపడే పరిస్థితులు వుండరాదని అన్నారు. ప్రస్తుత పరిస్థితిపై వర్జీనియా గవర్నర్‌తో ట్రంప్ చర్చించారు. విద్వేషం, విచ్ఛిన్నకర పరిస్థితులు ఇకపై నెలకొనేందుకు అనుమతించరాదన్నారు. ఈ నాజీ ప్రదర్శకులను కాపాడేందుకు శనివారం తెల్లవారు జామునుండే డజన్ల సంఖ్యలో సైనికులు ఆయుధాలు ధరించి నగరమంతా మోహరించారు. ప్రదర్శన జరగడానికి ముందు రోజు రాత్రి వందలాదిమంది నాజీలు వర్జీనియా యూనివర్శిటీ కేంపస్‌ను తమ స్వాధీనంలోకి తీసుకుని, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఒక దేశం, ఒకటే ప్రజలు, వలసలు వద్దు, అంటూ నినాదాలు చేశారు. జర్మనీ నాజీలు విజయోత్సవాల్లో ఉపయోగించే విజయ చిహ్నం చూపిస్తూ వారు గట్టిగా నినదించారు. ఘర్షణలు జరిగిన అనంతరం అధికారులు అక్కడ అత్యవసర పరిస్థితి విధించారు. పోలీసులను, భద్రతా బలగాలను మోహరించారు. ఆందోళనకారులపైకి కారును అడ్డదిడ్డంగా పోనివ్వడమే కాకుండా, అత్యధిక వేగంతో వెనక్కి తిప్పి మరింతమందిని ఢీకొంటూ కారు వెళ్ళిందని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. దాడికి దిగిన కారు డ్రైవర్‌ను అరెస్టు చేశారు. కాగా అక్కడకు సమీపంలో మరో ఇద్దరి మరణానికి కారణమైన హెలికాప్టర్ కూలడానికి గల కారణాలు వెంటనే తెలియరాలేదు. దానిపై దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. అందరూ ప్రశాంతంగా ఇళ్ళకు వెళ్ళాలంటూ చార్లెట్స్‌విల్లే మేయర్ మైక్ సింగర్ ప్రజలను కోరారు. శ్వేత జాతీయుల విద్వేష పూరిత చర్యకు కారణాలేంటో కనుగొనాలని ఇండియన్ అమెరికన్ వనతి గుప్తా అధ్యక్షుడు ట్రంప్‌ను కోరారు. ఈ హింసాకాండపై ఎఫ్‌బిఐ దర్యాప్తు నిర్వహించాలని కోరారు. శ్వేత జాతీయుల ఆధిపత్యం, దురహంకారమే ఈనాటి పరిస్థితికి కారణమని ఆమె వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి

అన్ని జిల్లాలు ప్రతిబింబించేలా ఐకానిక్ టవర్

అతి పెద్దనని సిఎం పేర్కొన్నారు. అమరావతిలో రూ.1000 కోట్ల వ్యయంతో అధునాతన వైద్య సదుపాయాలతో కూడిన సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను లండన్ కింగ్స్ హాస్పటల్ నిర్మిస్తోందన్నారు. దీనికి ఈ నెల 16న శంకుస్థాపన చేస్తామన్నారు. సులభతర వ్యాపార సరళి విధానంతో రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని, పారిశ్రామిక పెట్టుబడులతో యువతకు ఉపాధి, రాష్ట్రానికి ఆర్థిక ప్రగతి లభిస్తుందన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో మంత్రులు దేవినేని ఉమ, పి.నారాయణ, సిఎం స్పెషల్ సిఎస్ సతీష్‌చంద్ర, ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఇంధన, సిఆర్‌డిఏ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, సిఆర్‌డిఎ కమిషనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలంలో నీట మునిగిన వరినారు

కోస్తాలో భారీ వర్షాలు

సగటు వర్షపాతం 5.6 మిల్లీమీటర్లుగా నమోదైంది. ప్రధానంగా పల్నాడు ప్రాంతంలో ఉదయం నుండి సాయంత్రం వరకూ జల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం ఎనిమిది గంటల సమయంలో గంటపాటు మోస్తరు వర్షపాతం నమోదైంది. విత్తనాలు నాటిన పొలాలకు, విత్తనాలు నాటాలనుకునే రైతులకు ఈ వర్షం మేలు చేస్తుందని వ్యవసాయ శాఖాధికారులు చెప్పారు. అయితే ఇప్పటికే మొక్కలు వచ్చిన పత్తి, మినుము పొలాల్లో మొక్కలు ఉరకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. డెల్టా ప్రాంతంలోని భట్టిప్రోలు మండలంలో వరి పొలాలు, నారుమళ్ల కొద్దిమేర నీట మునిగాయి. ఇప్పటికే పొలాల్లో నీరున్న నేపథ్యంలో వర్షం వల్ల నారు నీట మునిగింది. తూర్పుగోదావరి జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు ఖరీఫ్‌కు అనుకూలమని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో మెట్ట ప్రాంతంలో సాగునీటి సమస్య ఏర్పడింది. ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు తక్కువగా ఉండడంతో రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. ఆదివారం కురిసిన వర్షాలు ఖరీఫ్‌కు మేలు చేశాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం మండలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈనెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని ప్రారంభించనుండడంతో జలవనరుల శాఖాధికారులు పథకం పనులను వేగవంతం చేశారు. ఆదివారం కురిసిన వర్షంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారి, పనులకు ఆటంకం ఏర్పడింది. మన్యంలోనూ భారీ వర్షాలు కురిశాయి. రాజమహేంద్రవరం, రంపచోడవరం, పెద్దాపురం డివిజన్‌లో వర్షాలు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమడోలు, దేవరపల్లి ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఏలూరు, గుండుగొలను, భీమడోలు, దేవరపల్లి, జంగారెడ్డిగూడెం ప్రాంతంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకూ భారీ వర్షం కురిసింది. దీంతో జన జీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమవ్వగా రోడ్లపైకి వర్షపు నీరు చేరింది. డెల్టా ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు మాత్రమే పడ్డాయి. నెల్లూరు జిల్లాలో చిరుజల్లులు పడ్డాయి. నెల్లూరు నగరం, రూరల్ మండలం, కోవూరు, వెంకటాచలం, ముత్తుకూరు, తదితర ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. ఆకాశం మేఘావృతమై ఉంది.

మా డబ్బులొచ్చేదెప్పుడు!



విజయవాడలో రిలే దీక్షలు చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

(మొదటిపేజీ తరువాయి)

పట్టించుకోవడం లేదు. ఈ సమస్యను పరిష్కరిస్తామని సాక్ష్యాత్తూ ముఖ్యమంత్రే అసెంబ్లీలో హామీ ఇచ్చినా పరిష్కారానికి నోచుకోలేదు.

అగ్రిగోల్డ్ సంస్థ 1995లో ఏర్పడింది. 18 ఏళ్లపాటు నిరాటంకంగా కొనసాగింది. దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాల్లో 32 లక్షల మంది నుంచి సుమారు రూ.7 వేల కోట్లు డిపాజిట్లు సేకరించారు. ఈ సంస్థలో ఏజెంట్లు, ఉద్యోగులు కలిపి రాష్ట్రానికి లక్షమంది చొప్పున ఎనిమిది లక్షల మంది పని చేసేవారు. 2015 జనవరి 4న ఈ సంస్థ బోర్డు తిప్పేసింది. ఆంధ్రప్రదేశ్‌లోనే 19,52,000 మంది రూ.3,996 కోట్లు పెట్టుబడి పెట్టారు. ఈ మొత్తంలో సగానికిపైగా డిపాజిట్లు తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాల నుంచే ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలోనే 2.50 లక్షల మంది సుమారు రూ.వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టారు.

వివిధ రూపాల్లో ఆందోళనలు

అగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన డిపాజిట్టుదారులు, ఏజెంట్లు కలిపి అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ రెండున్నరేళ్లుగా పోరాటం చేస్తున్నారు. తొలుత వినతిపత్రాలు సమర్పించారు. ఆ తర్వాత కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, రాస్తారోకోలు, రిలే నిరాహార దీక్షలు, వంటా వార్పు, భిక్షాటన తదితర రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు కూడా చేపట్టారు. అప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గత మార్చి నెలలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. బాధితులు చేపట్టిన ఆందోళనలకు సిపిఎం, సిపిఐ, వైఎస్‌ఆర్‌సిపి, జనసేన, బిజెపి, లోక్‌సత్తా, పలు ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి.

142కు చేరిన మృతులు

అగ్రిగోల్డ్ బాధితులు ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా 142 మంది చనిపోయారు. మృతుల్లో ఆత్మహత్యలు చేసుకున్నవారితోపాటు మనోవ్యాధితో చనిపోయిన వారు, గుండెపోటుతో చనిపోయిన వారు ఉన్నారు. సీఎం బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన తర్వాత సుమారు 30 మంది బలవన్మరణం పొందినా ప్రభుత్వంలో చలనం లేదని బాధిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో పోరాటానికి సిద్ధపడుతున్న బాధితులు

రెండున్నరేళ్లుగా పోరాటం చేసినా న్యాయం జరగకపోవడం, సిఎం హామీ ఇచ్చి నాలుగునెలలైనా పట్టించుకోకపోవడంతో బాధిత సంఘం ఆధ్వర్యాన మరో పోరాటానికి సిద్ధపడుతున్నారు. ఈ నెల 16న శ్రీకాకుళం జిల్లా నుంచి అనంతపురం జిల్లా వరకూ బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. అన్ని జిల్లాల్లోనూ బాధితులను చైతన్యవంతులను చేయడంతోపాటు ఆత్మహత్యలకు పాల్పడవద్దని మనోధైర్యం కల్పించేందుకు సిద్ధపడుతున్నారు. సెప్టెంబరు 19 వరకూ ఈ యాత్ర చేపట్టనున్నారు. ఆందోళనలో అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాల మద్దతు కూడగట్టి న్యాయ పోరాటం చేయనున్నారు.

గుండెపోటుతో ఏజెంట్ తండ్రి మృతి

ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన యాళ్ల దాసుబాబు అగ్రిగోల్డ్‌లో ఏజెంట్‌గా పనిచేసి సుమారు కోటి రూపాయలు డిపాజిట్ చేయించారు. ఆయన తండ్రి యాళ్ల వీరాస్వామి దాచుకున్న రూ.28 వేలు కూడా డిపాజిట్ చేశారు. సంస్థ మూతపడడం, డిపాజిట్టుదారులు ఇంటికి వచ్చి ఒత్తిడి తీసుకురావడంతో భరించలేని తండ్రి వీరాస్వామి ఈ ఏడాది మార్చి 6న గుండెపోటుతో చనిపోయారు.

ట్రైన్ కింద పడి ఏజెంట్ దుర్గాప్రసాద్ ఆత్మహత్య

రాజమహేంద్రవరానికి చెందిన కంచెర్ల వెంకట దుర్గా ప్రసాద్ అలియాస్ రాము పదేళ్లపాటు అగ్రిగోల్డ్‌లో ఏజెంట్‌గా పనిచేశారు. కోటి రూపాయల వరకూ అగ్రిగోల్డ్‌లో డిపాజిట్లు చేయించారు. అగ్రిగోల్డ్ ఎత్తేశాక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. డిపాజిట్టుదారులకు న్యాయం చేయలేకపోవడం, వారు ఇంటికి వచ్చి గొడవ చేయడంతో గతేడాది నవంబరు నెలలో ఆత్మహత్య చేసుకున్నారు.

కస్టమర్ల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు సిద్ధపడ్డా

అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా పదేళ్లపాటు పనిచేశాను. రూ.98 లక్షల పెట్టుబడులు సేకరించాను. నా సొంత డబ్బులు లక్షల రూపాయలు డిపాజిట్ చేశాను. నెలకు రూ.10 వేలు జీతంతో కుటుంబాన్ని పోషించుకునేవాడిని. అర్థాంతరంగా అగ్రిగోల్డ్ సంస్థ బోర్డు తిప్పేయడంతో ఎక్కడా పనిదొరక్క ఇబ్బందులు పడుతున్నాను. డిపాజిట్టుదారుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలని భావించాను. తోటి ఏజెంట్ మిత్రులు ధైర్యం చెప్పడంతో ఆ ప్రయత్నం మానుకున్నాను. సరైన ఉద్యోగం లేక భార్య, ఇద్దరు పిల్లలను పోషించడం కష్టంగా మారింది.

– పొన్నమళ్ల ఏసురాజు, ఏజెంట్, జగన్నాథపురం

బాధితులకు న్యాయం చేయాలి

రెండున్నరేళ్లుగా అగ్రిగోల్డ్ బాధితులు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయం. ఎంతోమంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేల కోట్లు ఉభయ గోదావరి జిల్లాల నుంచి చెల్లించారు. సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చాలి. బాధితులకు న్యాయం చేసే వరకూ ఆ పోరాటంలో భాగస్వాములం అవుతాం.

– దువ్వా శేషబాబ్జి, సిపిఎం జిల్లా కార్యదర్శి

సిఎం హామీ నెరవేరే వరకూ విశ్రమించం

అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేరే వరకూ పోరాటాన్ని విరమించే ప్రసక్తే లేదు. బాధితులకు అండగా సంఘం ఆధ్వర్యాన పోరాటం ఉధృతం చేస్తాం. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఖాతాదారులు, ఏజెంట్లను కలుపుకుని విజయవాడలో మరోసారి నిరవధిక నిరాహార దీక్షలు చేపడతాం. అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరం న్యాయం చేసేందుకు రూ.20 వేల లోపు ఉన్న చిన్న ఖాతాదారులకు రాష్ట్రప్రభుత్వం రూ.1180 కోట్లు అడ్వాన్స్‌గా చెల్లిస్తే సుమారు 13 లక్షల మంది బాధితులకు న్యాయం జరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– అంబటి రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్.

ఇంటి నిర్మాణం కలగా మారింది

నా భర్త అనారోగ్యంతో పదిహేనేళ్ల క్రితమే మరణించారు. కూలి పనులు చేసుకుంటూ నా ఇద్దరు పిల్లల్నీ పోషించుకుంటున్నాను. మా అత్తగారు ఇచ్చిన 50 గజాల స్థలంలో ఇల్లు కట్టుకుందామని అగ్రిగోల్డ్‌లో రూ.రెండున్నర లక్షలు వరకూ దాచుకున్నాను. ఆరు సంవత్సరాలకు రూ.5 లక్షలు వస్తే ఇల్లు కట్టుకోవచ్చని అనుకున్నాను. ఇంతలోనే అగ్రిగోల్డ్ మూతపడడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాను. ఇంటి అద్దె, పిల్లల చదువులు, కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారింది. ప్రభుత్వం వెంటనే అగ్రిగోల్డ్ డబ్బులు ఇప్పించి ఆదుకోవాలి.

– చీకట్ల సత్యవేణి, పనసపాడు, కాకినాడ రూరల్ మండలం

హిమాచల్‌లో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

విరిగి పడిన ఘటనల్లో ప్రాణ నష్టం సంభవించినట్లు వచ్చిన వార్తలను తనను కలచి వేశాయని ఆయన ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 50కి పెరిగే అవకాశం వుందని రాష్ట్ర రవాణా మంత్రి జిఎస్ బాలీ చెప్పారు. సహాయ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టామని, సంబంధిత అధికారులతో సంప్రదిస్తున్నామని ఆయన వివరించారు. ఈ ప్రమాద ఘటనపై కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ ట్విట్టర్‌లో సంతాపం తెలియచేశారు. బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని హిమాచల్ ప్రభుత్వాన్ని, స్థానిక కాంగ్రెస్ కమిటీలను ఆయన కోరారు.

కాలువలో దూకి దంపతులు గల్లంతు

- అనాధగా మారిన చిన్నారి

ప్రజాశక్తి – కొత్తపేట (తూర్పుగోదావరి)

పాప పుట్టుకతోనే అంధురాలైందన్న మానసిక వ్యథతో దంపతులు కాల్వలోకి దూకి గల్లంతయ్యారు. ఈ సంఘటన కొత్తపేట మండలం కండ్రిగ శివారు గుబ్బలవారిపాలెంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గుబ్బలవారిపాలేనికి చెందిన కముజు శ్రీనివాస్(30)కు, అయినవిల్లి మండలం ముక్తేశ్వరానికి చెందిన భవానీ(28)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. శ్రీనివాస్ రావులపాలెం చైతన్య స్కూలులో పిఇటిగా పని చేస్తున్నారు. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. కుమార్తె అంధురాలు కావడంతో వారు మానసికంగా బాధపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో కండ్రిగలోనే ఉన్న శ్రీనివాస్, భవాని దంపతులు అమలాపురంలోని బంధువులు ఇంటికి పెళ్లికి వెళ్లి వస్తామని పాపతో కలిసి మోటారు సైకిల్‌పై బయలుదేరారు. డేగలవారిపాలెం బ్రిడ్జి వద్దకు వెళ్లాక పాపను మోటారు సైకిల్‌పై ఉంచారు.



అమ్మానాన్న కోసం ఎదురుచూస్తున్న చిన్నారి

అనంతరం భార్యాభర్తలిద్దరూ బ్రిడ్జిపై నుంచి దూకేశారు. మోటారు సైకిల్‌పై కూర్చున్న చిన్నారి ఏడుస్తుండటంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. బైకు నెంబరు ఆధారంగా కండ్రిగలోని వారి బంధువులకు సమాచారం అందించడంతో వారు పాపను, మోటారు సైకిల్‌ను గుర్తించారు. కాలువలో గల్లైంతైన వారి ఆచూకీ కోసం పోలీసులతోపాటు బంధువులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉన్నత స్థాయి న్యాయ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఆక్సిజన్ కొరత ఉందంటూ గత కొన్ని నెలలుగా అధికారులు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించింది. ఆక్సిజన్ సిలిండర్ సరఫరాదారులకు బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరత ఏర్పడి ఉంటుందని పేర్కొంది. ఆ చిన్నారులు ఆక్సిజన్ కొరతతో మరణించలేదని, పారిశుధ్య లోపం, పరిసరాల పరిస్థితుల వల్ల మరణించారంటూ స్వయంగా యోగి ప్రకటించడాన్ని ఖండించింది. మోడీ, బిజెపి ప్రచారంతో హోరెత్తిస్తున్న 'స్వచ్ఛభారత్' పథకంలో డొల్లతనాన్ని ఇది బయటపెడుతోందని పేర్కొంది. గత 20 ఏళ్లుగా గోరఖ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం ఎంపీగా ఉన్న యోగి, అక్కడి పరిసరాల పరిశుభ్రత మెరుగుదలకు చేసిందేమీ లేదని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

నేడే ముహూర్తం


మహేష్ బాబు

మహేష్ బాబు ఇప్పటి వరకూ 22 సినిమాలు పూర్తి చేశాడు. ప్రస్తుతం రెండు సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. అందులో మురగదాస్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'స్పైడర్' చిత్రం పోస్టు ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటోంది. ఈ సినిమా దసరా బరిలో నిలవనుంది. కొరటాల శివ దర్శకత్వంలో 'భరత్ అనే నేను' అనే మరో చిత్రం ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. దీని తర్వాత ప్రిన్స్ తన 25వ సినిమాను మొదలు పెట్టనున్నాడు. అది వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కనుంది. సోమవారం కృష్ణామిని పురస్కరించుకుని ఈ చిత్ర వివరాలను ప్రకటించనుందీ చిత్రబృందం. అశ్వనీ దత్, దిల్‌రాజు సంయుక్తంగా ఈ సినిమాని నిర్మించనున్నారు. ఇక్కడ ఇంకొక విశేషం కూడా ఉంది. అశ్వనీ దత్ నిర్మాతగా వ్యవహరించిన 'రాజకుమారుడు' చిత్రంతోనే మహేష్ బాబు కథానాయకుడిగా వెండితెరకు పరిచయమయ్యాడు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య స్నేహపూర్వక బంధం ఉంది. ఇప్పుడు రాబోతున్న 25వ చిత్రానికీ అశ్వనీ దత్తే నిర్మాత. ఈ సినిమాకు సోమవారం పూజా కార్యక్రమంతో ప్రారంభించనున్నారు.


విశ్వేష్, మురళి, శ్రీముఖి, హర్షవర్ధన్

పెళ్లి సాధారణం... షష్టి పూర్తి ఘనం

హర్షవర్ధన్ దర్శకుడిగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా రూపొందుతోన్న చిత్రం 'గుడ్ బేడ్ అగ్లీ'. అంజిరెడ్డి ప్రొడక్షన్, ఎస్.కె.విశ్వేష్ బాబు సమర్పణలో ఈ సినిమా తెరకెక్కుతోంది. అంజి రెడ్డి నిర్మాత. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను ఆదివారం విడుదల చేశారు.

హర్షవర్ధన్ మాట్లాడుతూ 'పెళ్లిని ఘనంగా చేయడం చూస్తుంటాం. షష్టి పూర్తి కార్యక్రమాలు జరగడమే లేదు. ఆశించడం కూడా తప్పే అవుతుంది. కానీ పెళ్లి సాధారణంగా జరగాలి. షష్టిపూర్తి ఘనంగా జరగాలనే ఆలోచన నుండి ఈ సినిమా కథ పుట్టింది. కాన్సెప్ట్ మూవీస్‌ను మొదలు పెట్టడం కంటే పూర్తి చేయడం చాలా కష్టం. కాబట్టి నేను సైలెంట్‌గా సినిమాను పూర్తి చేసుకుంటూ వచ్చాను. మొదటిసారి సినిమాకు దర్శకత్వం వహించడం వల్ల సినిమా గురించి, నా గురించి చాలా విషయాలను నేర్చుకున్నాను. సినిమా ఇప్పుడు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల తుది దశకు చేరుకుంది. ఇంత బాగా పూర్తికావడానికి నేను చెప్పిన బడ్జెట్‌ను నమ్మి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా చేసిన విశ్వేష్‌గారికి థాంక్స్. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' అనే ఇంగ్లీష్ టైటిల్ ఎందుకు పెట్టానని చాలా మంది అడిగారు. కానీ ఇప్పుడు చిన్న చిన్న పల్లెటూర్లలో కూడా ఈ పదాలను విరివిగా వాడుతున్నారు. అందుకే ఈ టైటిల్ పెట్టాం. అలాగే మంచి, చెడు, తింగరితనం అనేవి సందర్భాన్ని బట్టి మన నుండి బయటపడతాయి. అందుకే ఈ టైటిల్ ఖరారు చేశాం. రైటర్ నుండి దర్శకుడిగా మారిన నేను పాత్రలకు తగ్గట్లు నటీనటులను ఎంపిక చేసుకున్నాను. సినిమాలో ఏకైక లేడీ క్యారెక్టర్‌ను శ్రీముఖి చేసింది. 1988-89 కాలంలో ఓ మారుమూల గ్రామంలో జరిగిన ప్రేమకథే ఈ చిత్రం. ఫీల్ గుడ్ ఎలిమెంట్స్‌తో పాటు పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఉంటాయి. పెద్ద హీరోల స్థాయికి తగ్గకుండా సినిమా ఉంటుంది" అని తెలిపారు.


సాయి పల్లవి

ఇది నిజమేనా?

సాయి పల్లవి...మలయాళంలో 'ప్రేమమ్' చిత్రంలో మలార్ పాత్రలో మెప్పించింది. మొదటి సినిమాకే ఉత్తమ నటి పురస్కారం వరించింది. తెలుగులో ఎంట్రీ కూడా అదరగొట్టేసింది. అది మామూలుగా కాదు...ఇక్కడ ప్రేక్షకులను 'ఫిదా' చేసేటంతగా...'ఫిదా' చిత్రంలో సాయి పల్లవి పాత్ర కొత్త ట్రెండ్ క్రియేట్ చేసింది. ఈ క్యారెక్టర్‌తో తనకు అమాంతంగా క్రేజ్ పెరిగిపోయింది. దీంతో ఈ డాక్టర్ తన పారితోషికాన్ని పెంచేసిందట. అదీ కూడా భారీ మొత్తంలోనే అని సమాచారం. ఆమె మున్ముందు చేయబోయే తెలుగు, తమిళ చిత్రాలకు ఇంతకుముందు పారితోషకంటే రెట్టింపు డిమాండ్ చేస్తున్నట్లు చిత్రవర్గాల సమాచారం. ఇందుకు నిర్మాతలు కూడా వెనకడుగు వేయడం లేదట. ప్రస్తుతం సాయి పల్లవి నానికి జోడీగా 'ఎంసీఏ' చిత్రంలో నటిస్తోంది. వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి దిల్‌రాజు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

'ఓయ్...నిన్నే' గీతావిష్కరణ


బుచ్చయ్య చౌదరి, భరత్, సృష్టి, వంశీ కృష్ణ, కోన వెంకట్, రామజోగయ్య శాస్త్రి, శేఖర్ చంద్ర తదితరులు

ఎస్.వి.కె.సినిమా బేనర్‌పై భరత్, సృష్టి హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'ఓయ్..నిన్నే'. వంశీకృష్ణ శ్రీనివాస్ నిర్మాత. సత్య చల్లకోటి దర్శకుడు. శేఖర్ చంద్ర సంగీతం అందించిన ఈ సినిమా ఆడియోను విడుదల చేశారు. బిగ్ అండ్ ఆడియో సీడీలను కోన వెంకట్ విడుదల చేశారు. తొలి సీడీని అనిల్ రావిపూడి అందుకున్నారు.

మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ ' ఎన్టీఆర్, ఏఎన్నార్, దాసరి సహ ఎందరో వేసిన దారి ఇప్పుడు ఎంతో బావుంది. తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ తరుణంలో కొత్త నటీనటులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని చెప్పారు.

కోన వెంకట్ మాట్లాడుతూ 'మంచి సినిమా తీయడానికి మంచి కథ, దానికి తగ్గ నటీనటులు అవసరమని నమ్మే నిర్మాతల్లో వంశీకృష్ణ ఒకరు. సినిమా బావుంటే తుఫానులు, నోట్ మార్పిడిలు, జిఎస్‌టిలు ఏవీ ఆపలేవు. అలాంటి మంచి కాన్సెప్ట్ ఇందులో నాకు కనపడుతుంది. సత్య మంచి వ్యక్తి. మంచి రచయిత. ట్రైలర్, పాటలు చూస్తుంటే సినిమా ఎంత బాగా తను తెరకెక్కించాడో తెలుస్తుంది' అని పేర్కొన్నారు.

చిత్ర నిర్మాత వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ 'మా బ్యానర్‌లో నేను చేసిన సినిమాల్లో సోలో నాకు బాగా నచ్చింది. ఓయ్ నిన్నే సినిమా సోలో కంటే బావుంటుందనిపిస్తుంది. కొత్తవారితో చేసిన ఈ ప్రయత్నం. నేను సెట్స్ దగ్గరకి వెళ్లకపోయినా, దర్శకుడు సత్య సినిమాను చక్కగా తెరకెక్కించాడు. తను భవిష్యత్ పెద్ద డైరెక్టర్‌గా ఎదగాలి. సాయిశ్రీరామ్ పనితనం ఎంటో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. రామజోగయ్యగారికి థాంక్స్. శేఖర్ చంద్రగారు ఎక్సలెంట్ మ్యూజిక్ ఇచ్చారు. నా నెక్స్ట్ మూవీకి కూడా ఆయనే మ్యూజిక్ డైరెక్టర్. కథ పరంగా చాలా మంచి కథ. కచ్చితంగా సినిమా సూపర్‌డూపర్ హిట్ అవుతుందని ధైర్యంగా చెప్పగలను' అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అనిల్ రావిపూడి, కోనవెంకట్, చంద్రసిద్ధార్థ్, కృష్ణ చైతన్య, భరత్, సృష్టి, శేఖర్‌చంద్ర, రామజోగయ్య శాస్త్రి తదితరులు విడుదల చేశారు.

'ప్రాజెక్టు Z'లో ఏముంది!


లావణ్య త్రిపాఠి, సందీప్ కిషన్

సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి, జాకీ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'మాయావన్'. ఇది తమిళ్‌లో తెరకెక్కింది. సి.వి.కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను 'ప్రాజెక్ట్ జెడ్'గా ఎస్‌బీకే ఫిలింస్ కార్పొరేషన్‌లో ఎస్.కె.బషీద్ సమర్పణలో నిర్మాత ఎస్.కె. కరీమున్నీసా తెలుగు ప్రేక్షకులకు అందించనున్నారు. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని సెప్టెంబర్ ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ సందర్భంగా చిత్ర సమర్పకుడు ఎస్.కె.బషీద్ మాట్లాడుతూ 'ఆద్యంతం ఆసక్తి కలిగించేలా.. ఉత్కంఠతతో కథ నడుస్తుంది. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సందీప్ కిషన్ నటనను చూసిన ప్రతి ఒక్కరూ మంత్రముగ్ధులవుతారు. జాకీష్రాఫ్ పాత్ర మరో హైలెట్ అవుతుంది. ఇక లావణ్య త్రిపాఠి ఇప్పటి వరకు కనిపించని, నటించని విధంగా ఈ సినిమాలో ఆమె పాత్ర ఉంటుంది. ఈ చిత్రానికి సంగీతం : గిబ్రాన్, ఎడిటర్ : లియో జాన్ పాల్, మాటలు : శశాంక్ వెన్నెలకంటి, ఆర్ట్ : గోపి ఆనంద్.

యోధురాలు


కృతి సనన్

కృతి సనన్ త్వరలో యోధురాలుగా కనిపించబోతుంది. అదీ డీగ్లామర్ రోల్ చేయనుంది. దర్శకుడు అశ్విన్ కుమార్ లేయర్ ఓ ప్రాంతీయ మాండలికం ఆధారంగా ట్రయాంగిల్ ప్రేమకథను తెరకెక్కించబోతున్నాడు. అందులో కృతి సనన్ లీడ్ రోల్ పోషిస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో ఓ చిన్న పాటి ప్రాంతానికి చెందిన ప్రత్యేక మాండలికం ఉన్న ప్రజలకు సంబంధించిన కథ ఇది. ఇందులో కృతి ఆ ప్రాంత యోధురాలుగా చేయబోతుంది. ఈ తరహా కథ చేయడం ఈ అమ్మడుకు ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ " ఈ పాత్ర ఎలా ఉంటుందోనని నాక్కూడా చాలా ఆతృతగా ఉంది. నేను మొదటిసారిగా ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా, అదీ ఓ ప్రాంతానికి యోధురాలుగా చేయడం ఇదే మొదటిసారి. ఆ మాండలికంపై మొదట అవగాహన ఏర్పరుచుకుని ఈ పాత్ర బాగా చేయడానికి ప్రయత్నిస్తాను. ముఖ్యంగా ఇది డీ గ్లామర్ రోల్ కూడా" అని చెప్పింది. ఈ సినిమా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది.

'సంతోషం' పురస్కారాలు

సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అంగరంగ వైభవంగా ఆట, పాటల నడుమ ఘనంగా జరిగింది. ఉత్తమ నటుడిగా నాగ చైతన్య (ప్రేమమ్), ఉత్తమ దర్శకుడు (సరైనోడు)గా బోయపాటి శ్రీను పురస్కారాలను గెలుచుకున్నారు. ఉత్తమ నటిగా సమంత (అ..ఆ), ఉత్తమ చిత్రంగా 'పెళ్ళిచూపులు' నిలిచింది. దాసరి నారాయణరావు స్మారక అవార్డు..అల్లు రామలింగయ్య స్మారక అవార్డులతో పాటు ఇతర భాషలకు చెందిన నటీనటులను సంతోషం అవార్డులతో ఘనంగా సత్కరించారు. మన్నారా చోప్రా, రిచా పనయ్ , అనసూయ స్పెషల్ పెర్ఫామెన్స్‌తో వేడుకకు మరింత శోభ తీసుకొచ్చారు.

అవార్డుల ప్రదానోత్సవం అనంతరం హీరో నాగచైతన్య మాట్లాడుతూ '15 ఏళ్లగా సంతోషం వార్షికోత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహించడం అంటే చిన్న విషయం కాదు. ప్రతీ ఏడాది సంతోషం వార్షికోత్సవాలు ఎక్కడా తగ్గకుండా ఎంతో గొప్పగా చేస్తున్నారు. అందుకు చాలా సంతోషంగా ఉంది. నాకీ అవార్డు దక్కిందంటే కారణం నేను కాదు.. 'ప్రేమమ్' సినిమానే. మలయాళం వెర్షన్ నన్ను...సినిమా చూసిన ఆడియన్స్‌ను ఎంతో ఇనస్పైర్ చేసింది. క్రిటిక్స్ కూడా ఎంతో ఎంకరేజ్ చేశారు. అందుకే ఈ అవార్డు వచ్చింది. అలాగే సమంత ఇంటినిండా అవార్డులే ఉంటాయి. ఆ ఖాతాలో ఇప్పుడు సంతోషం అవార్డు కూడా చేరింది' అని చెప్పారు. రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ 'కె.వి రెడ్డిగారి అవార్డు ఎంత పాపులర్ అయిందో సురేష్ అందించే దాసరి స్మారక అవార్డు అంత పాపులర్ అవ్వాలి. దాసరి పేరిట సురేష్ ఈ ఏడాది మాకు అందించడం చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.



అల్లు అరవింద్, బోయపాటి శ్రీను, నాగ చైతన్య

నాగ్ పుట్టిన రోజు నాడే


అఖిల్

అఖిల్ అక్కినేని మొదటి చిత్రం తీవ్ర నిరాశ పరిచింది. ఇక రెండో చిత్రంతోనైనా కచ్చితంగా ప్రేక్షకులను మెప్పించే విధంగా ఉండాలని అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు నాగార్జున. దర్శకుడు ఎంపిక దగ్గర నుంచి అన్నీ తన పర్యవేక్షణలోనే సాగింది. మొన్నామధ్య ఓ కార్యక్రమంలో పాల్గొంటూ తన కొడుక్కి సూపర్ హిట్ ఇస్తానని చెప్పాడు. ఆ సినిమాను నాగార్జునే స్వయంగా నిర్మిస్తున్నాడు. 'మనం' ఫేం విక్రమ్ కుమార్ దర్శకత్వంలో రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తెరకెక్కిస్తున్నారు. చాలా రోజులుగా సినిమా షూటింగ్ జరుగుతున్నా దానికి సంబంధించిన అప్ డేట్స్ ఏవీ బయటకు రాకుండా జాగ్రత్త పడుతోందీ చిత్ర యూనిట్. ఇంత వరకు హీరోయిన్ ఎవరన్న విషయంలోనూ స్పష్టతనివ్వలేదు. 'జున్ను', 'ఎక్కడ ఎక్కడ ఉందో తారక', 'రంగుల రాట్నం' లాంటి టైటిల్స్ వినిపించినా.. యూనిట్ సభ్యుల మాత్రం దేన్నీ నిర్ధారించలేదు. అయితే ఈ చిత్రం అప్‌డేట్స్ విషయంలో ఫ్యాన్స్‌కు తీపి కబురు వచ్చింది. నాగార్జున పుట్టిన రోజును పురస్కరించుకుని ఈనెల 29న అఖిల్ ఈ సినిమా ఫస్ట్ లుక్ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ రోజే చిత్రం టైటిల్ ఏంటో తెలిసే అవకాశం ఉంది. ఈ చిత్రం డిసెంబర్ రెండో తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రూపాయి



ఏదైనా తినేటప్పుడు.. పంటి కింద చిన్నపాటి రాయిపడితే.. ఎలాంటి బాధ కలుగుతుందో.. ఆదాయంలోంచి కొంత మొత్తాన్ని పన్ను చెల్లింపు రూపంలో కట్టాలంటే.. అంతే బాధపడతుంటారు చాలామంది. కానీ ఆర్జించే ఆదాయం, సంపాదనలోంచి.. వార్షిక పన్ను చెల్లించడం అనేది అందరి గురుతర బాధ్యత. ప్రతీ ఒక్కరూ క్రమం తప్పకుండా తమ సంపాదన ఆధారంగా.. పన్ను చెల్లింపులు చేయాల్సిందే. అయితే, కాస్తంత ప్రణాళికబద్ధంగా ఉంటే.. పన్నుభారం పడకుండా జాగ్రత్తపడొచ్చు. పన్ను భారాన్ని తగ్గించుకోడానికి మేలైన పొదుపు పథకాలూ అందుబాటులో ఉన్నాయి. అవి ఏంటి? ఎందులో పెట్టుబడి పెట్టాలి? అనేదే మనకు తెలియాలి. ఆదాయపు పన్ను తగ్గించుకోవడానికి హడావిడిగా తీసుకునే నిర్ణయాలు ఎప్పుడూ మంచి ఫలితాలు ఇవ్వవు. ఆచితూచి పెట్టుబడులు పెట్టాలి. మరి పన్నుభారం పడకుండా ఉండాలంటే ఎలాంటి ప్రణాళికతో సిద్ధం కావాలి? ఈ వారం 'రూపాయి'లో తెలుసుకుందాం!!



ఇలా.. ఆదా చేస్తే?! భారం ఉండదు

పొదుపు ప్రణాళికలో పన్ను ఆదా చేసుకోవడమూ ఒక భాగం. అయితే, పన్ను ఆదా పెట్టుబడి పథకాలే ఆర్థిక ప్రణాళిక అనిపించుకోదు. ప్రతి పెట్టుబడి పథకం వెనకా ఒక లక్ష్యం ఉండాలి. అది మనకు సాధ్యమైనన్ని విధాలుగా ఉపయోగపడాలి. అందులో పన్ను ఆదా అనేది అదనపు సౌకర్యం కావాలి. పెట్టిన మొత్తానికి మినహాయింపు పొందుతూనే.. సంపద వృద్ధికి కూడా ఆస్కారం ఇవ్వాలి. వయసు, జీవనశైలిని బట్టి పన్ను ఆదా పథకాలను ఎంచుకోవాలి. అప్పుడే ఫలితాలు బాగుంటాయి.

సంపాదన.. కొత్తల్లో





ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం ఇలా ఏదో ఒక రూపంలో సంపాదన మొదలైనప్పటి నుంచే వీలైనంత వరకూ పన్ను పడకుండా చూసుకోవాలి. చిన్న వయసులో ఉంటారు కాబట్టి, కాస్త నష్టభయం ఉన్నా తట్టుకునే శక్తి ఉంటుంది. అందుకని, పెట్టుబడులు పెట్టి, సాధ్యమైనంత వరకూ పన్ను మినహాయింపులు పొందాలి. స్వల్ప వ్యవధి ఉండే ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలను (ఈఎల్ఎస్ఎస్) పరిశీలించవచ్చు. పెట్టుబడిని కనీసం మూడేళ్లపాటు కదపకుండా ఉంచితే చాలు. సమీప భవిష్యత్తులో సొమ్ము అవసరం లేదనుకొనేవారికి ఇవి చక్కగా సరిపోతాయి. మొదటిసారి మార్కెట్లోకి ప్రవేశించేవారు రూ.12 లక్షలలోపు వార్షికాదాయం ఉంటే.. రాజీవ్‌గాంధీ ఈక్విటీ పొదుపు పథకాన్ని పరిశీలించవచ్చు. ఇందులో గరిష్ఠంగా రూ.50 వేల వరకూ మదుపు చేసుకోవచ్చు. పెట్టిన పెట్టుబడిలో సగ భాగానికి సెక్షన్ 80 సీసీజీ కింద పన్ను మినహాయింపు వర్తిస్తుంది. వరుసగా మూడేళ్లపాటు ఈ పథకంలో మదుపు చేసే వీలుంది. మూడేళ్లపాటు పెట్టుబడిని కొనసాగించాలి. వీటితోపాటు, యూనిట్ ఆధారిత బీమా పథకాలను, ఆరోగ్య బీమా పాలసీలనూ ఎంచుకొని, పన్ను ఆదా చేసుకోవడానికి ప్రయత్నించవచ్చు.


పెన్షన్ పథకాల్లో

పెరిగిన ఆదాయానికి, బాధ్యతలకు అనుగుణంగా జీవిత బీమా మొత్తాన్ని పెంచుకోవడంతో పాటు పెన్షను పాలసీలు తీసుకోవడానికి ఇదే సరైన తరుణం. పదవీ విరమణ తర్వాత ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా కులాసాగా గడిపేందుకు పెన్షను పాలసీలు అవసరం అవుతాయి. పెన్షను పథకంలో పెట్టిన పెట్టుబడులనూ సెక్షన్ 80సీ కింద మినహాయింపుగా చూపించుకోవచ్చు. శ్లాబును బట్టి 10 నుంచి 20 శాతం పన్ను ఆదా చేసుకోవచ్చు.

భాగస్వామి కోసం

జీవితబీమా అవసరాలనూ మరోసారి సమీక్షించుకోవాల్సిన సమయం ఇది. ఆదాయం ఆర్జిస్తున్నా.. లేకపోయినా.. మీ భార్య/భర్తకు జీవితబీమా పాలసీ తీసుకోవడం అవసరం. అదనపు మినహాయింపు పొందడానికి ఇది అవకాశం కల్పిస్తుంది. ఆరోగ్య బీమా పాలసీ లేకపోతే వెంటనే కుటుంబానికి అంతటికీ వర్తించేలా బీమా పాలసీని తీసుకోవడం మంచిది.

రేపటి అవసరాల కోసం



కుటుంబ బాధ్యతలు పెరిగినప్పుడు ఆర్థిక విషయాల్లో సాహసాలకు దిగే ప్రయత్నం చేయలేము. పిల్లలకు పెద్ద చదువులు చెప్పించడం.. వాళ్ల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రయత్నాలు చేయడం ఇవే మనకు లక్ష్యాలవుతాయి. ఈ దశలో ఉన్నవారు.. పిల్లల బీమా పాలసీ తీసుకోవడం తప్పనిసరి. మీ అవసరాలను, లక్ష్యాలను బట్టి ఎండోమెంట్ లేదా మనీబ్యాక్ పాలసీలను ఎంచుకోండి. వీటిపై మీరు చెల్లించే ప్రీమియం ద్వారా సెక్షన్ 80సీ కింద మినహాయింపు పొందవచ్చు. అలాగే పన్ను కోత తగ్గించుకునేందుకు జాతీయ పొదుపు పత్రాలు (ఎన్ఎస్‌సీ), పీపీఎఫ్‌లను కూడా ఎంచుకోవచ్చు.



-వి. చైతన్య

'రూపాయి'కి మీరూ రాయండి!



బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమాపథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయా లపై మీరూ మీ అనుభ వాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

గతంలో వ్యక్తిగతంగా ఎవరైనా పన్ను చెల్లింపులు చేయాలంటే ఆడిటర్ లేదా ఏజెంట్ సహాయం తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఎవరికివారే, సంబంధిత విషయాలు తెలుసుకుని స్వయంగా ఆన్‌లైన్లో తమ పన్ను చెల్లింపులు చేసుకోవచ్చు.

రిటర్న్ దాఖలు.. ఆన్‌లైన్లో



చెల్లింపుదారులు తమ రిటర్నులను సులభంగా దాఖలు చేయడానికి ఆదాయపు పన్ను శాఖ ఎప్పటికప్పుడు పలు కీలక మార్పులను తీసుకొస్తూనే ఉంది. ఇందులో ముఖ్యంగా ఈ రిటర్నులు దాఖలు చేయడం ఒకటి. ప్రస్తుతం కొత్త ఫారాలు అందుబాటులోకి వచ్చాయి. ఆధార్‌లాంటి అదనపు సమాచారాన్ని అందించాలి. అందుకే, పన్ను చెల్లింపుదారులుగా మనం ఈ కొత్తగా వచ్చిన మార్పును గమనించాలి. www.incometaxindiaefiling.gov.in లోకి వెళ్లి మీ పాన్ కార్డు ఆధారంగా నమోదు చేసుకోవాలి. మీ పుట్టిన తేదీ, మీ పేరు అన్నీ సరిగ్గా పేర్కొంటేనే నమోదు చేసుకోవడానికి వీలవుతుంది. ఆ తర్వాత అడిగిన వివరాలన్నీ సమర్పిస్తే మీ మెయిల్‌కు ఒక సమాచారం పంపిస్తారు. మీరు పేర్కొన్న మొబైల్‌కు ఒక రహస్య సంఖ్య వస్తుంది. ఈ రెండింటి ఆధారంగా మీ ఖాతా వెబ్‌సైటులో యాక్టివేట్ అవుతుంది. ఇప్పటికే నమోదు చేసుకున్నవారు పాన్‌కార్డు, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ ఆధారంగా సైట్లోకి నేరుగా ప్రవేశించవచ్చు. పాస్‌వర్డ్ మర్చిపోతే కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పడం లేదా మీ మొబైల్, ఈమెయిల్‌కు రహస్య సంఖ్యలను పొందడం ద్వారా కొత్త పాస్‌వర్డ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో మీ మెయిల్, మొబైల్‌ను వెబ్‌సైటు మరోసారి ధ్రువీకరించుకుంటుంది.

ప్రస్తుతం సైట్లోకి ప్రవేశించగానే మీ ఆధార్ సంఖ్యను అనుసంధానించు కోవాల్సిందిగా సమాచారం వస్తోంది. మీకు ఇష్టమైతే వెంటనే మీ ఆధార్ సంఖ్యను పేర్కొనవచ్చు. లేకపోతే తర్వాత అని చెప్పవచ్చు.

వెబ్‌సైట్లోకి ప్రవేశించిన తర్వాత Quick e file ITR అనే బటన్‌ను క్లిక్ చేయాలి. తర్వాత మీకు వర్తించే ఐటీఆర్‌ను ఎంపిక చేసుకొని, 2016–17 అసెస్‌మెంట్ సంవత్సరాన్ని ఎంపిక చేసుకోవాలి. తర్వాత వచ్చే ఫారంలో మీ వ్యక్తిగత వివరాలు, ఆదాయ వివరాలు, మినహాయింపులు తదితరాలన్నీ పూర్తిచేయాలి.



మీ పుట్టిన తేదీ, చిరునామా, పాన్ నెంబరు, ఈ మెయిల్, ఫోన్ నెంబరు తదితర వివరాలు తప్పుల్లేకుండా చూసుకోవాలి. మీరు చెల్లించిన పన్ను మొత్తం వివరాలను కూడా జాగ్రత్తగా నింపండి. రిటర్నుల ఫారంలో కూడా ఆధార్ సంఖ్య పేర్కొనాలి. రిఫండు ఉన్నా లేకున్నా, మీ బ్యాంకు ఖాతాల వివరాలను తెలియజేయడం తప్పనిసరి. మీకు వాస్తవంగా ఎన్ని ఖాతాలున్నాయో వాటి సంఖ్యనూ తెలియజేయాలని ఈసారి నుంచి నిబంధన విధించారు. రిఫండు ఏ ఖాతాలోకి రావాలనుకుంటున్నారో.. దానికి సంబంధించిన ఐఎఫ్ఎస్‌సీ కోడ్, మీ ఖాతా సంఖ్య, ఖాతా రకాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. అన్ని వివరాలూ పూర్తిచేసిన తర్వాత 'సబ్మిట్' చేస్తే సరిపోతుంది.

ఎవరు దాఖలు చేయాలి?

'చెల్లించాల్సిన పన్ను చెల్లించాను.. అయినా రిటర్నులు దాఖలు చేయాలా?' అనే సందేహం చాలామందిలో ఉంటుంది. గత ఏడాది వరకూ.. రూ. 5 లక్షల లోపు ఆదాయం ఉండి, ఇతర మార్గాల ద్వారా ఆదాయం ఏమీ లేనప్పుడు, చెల్లించాల్సిన పన్ను అంతా చెల్లించి, ఎలాంటి రిఫండూ క్లెయిం చేసుకోకపోతే రిటర్నులు దాఖలు చేయక్కర్లేదనే వెసులుబాటు ఉండేది. ఈ ఏడాది నుంచి ఈ వెసులుబాటు లేదు. అంటే పన్ను వర్తించే మొత్తం ఆదాయం రూ.2,50,000కు మించి ఉన్నవారెవరైనా సరే తప్పనిసరిగా రిటర్నులు దాఖలు చేయాల్సిందే.



ఆధార్ సంఖ్యతో


ఆదాయపు పన్ను శాఖ వెబ్‌సైటులో మీ పాన్ నెంబరుకు ఆధార్‌ను అనుసంధానించాల్సి ఉంటుంది. అయితే, ఇక్కడ మీ పాన్‌కార్డులో ఉండే సమాచారం, పుట్టిన తేదీ, పేరు తదితర వివరాలు ఆధార్ సమాచారంతో సరిపోవాలి. లేకపోతే అనుసంధానం సాధ్యం కాదు. విజయవంతంగా అనుసంధానమైన వెంటనే మీకు వెరిఫికేషన్ కోడ్ వస్తుంది. దీన్ని ఉపయోగించి మీ రిటర్నులను 'ఈ వెరిఫై' చేసుకోవచ్చు. ★




పొడుపు కథ

నిప్పుల్లో పుడుతుంది.
ఆకాశంలోకి వెళుతుంది. ఏమిటది?

ప్రజాశక్తి: పొగ



రవి : కాంతూ నీ భారీ కాయానికి కారణమేంటో తెలిసిందా..?
కాంతు : తెలిసిందిరా
రవి : ఎంటో ఆ కారణం
కాంతు : ఏముందీ? నీకు నచ్చిన పదార్థం మాత్రమే నువ్వు తింటావు. నేను అలా కాదుగా.. దొరికిన పదార్థాన్నల్లా తినేస్తాను.
రవి : ఆ..!!??



గుర్తించండి!

పిల్లలూ..! పైనున్న చిత్రాలు రెండూ చూడానికి ఒకేలా ఉన్నా వాటి మధ్యన ఐదు తేడాలు ఉన్నాయి గుర్తించండి!

సముద్రంలో నీరు పొర్లదెందుకు?




పిల్లలూ....! నిండుగా ఉన్న కుండలోంచి గ్లాసుడు నీళ్ళు తీసుకుని మరోగ్లాసుడు పోసినా ఏమీ పొర్లిపోదు కదా! సముద్ర విషయంలో కూడా అదే జరుగుతోంది. అనేక నదుల్లోని నీరంతా సముద్రంలో కలుస్తున్నమాట నిజమే అయినా, సముద్రం నుంచి చాలా ఎక్కువ నీరు పెద్ద మొత్తంలో ఆవిరవుతుంది. నిజానికి నదులు, సరస్సులు, సెలయేళ్ళల్లో ఉన్న నీరంతా వర్షాల ద్వారా సముద్రం నుంచి వచ్చినదే. సముద్రంలోని నీరు ఆవిరై, మేఘాలుగా మారి, వర్షంగా కురిసి నదుల్లో పారి, తిరిగి సముద్రంలో కలుస్తాయి. అంటే భూమిమీద ఉన్న నీరు మొత్తంలో సముద్రంలో ఉండేది 98 శాతం. మేఘాలు, నదులు, ఏర్లు ఇలా రకరకాల రూపాల్లో ఉండేది కేవలం రెండు శాతమే. ధ్రువాల దగ్గర మంచు రూపంలో ఉండే నీరు ఘనస్థితిలోంచి ద్రవస్థితిలోకి మారడం, కరగడం వల్ల అదనంగా నీరు తయారవుతుంది. ఇదంర్రా పిల్లలు విషయం! ★



ఎవరి గొప్ప వారిది-2

కథ: విద్వాన్ చొప్ప వీరభద్రప్ప (సెల్: 92474 50984)
బొమ్మలు: తుంబలి శివాజీ (సెల్: 98492 27509)

నిన్నటి తరువాయి భాగం



చిరుత కుప్పకూలింది

- ట్రాక్ కన్నీళ్లు పెట్టింది
- కాలి కండరాలు పట్టేసి పతకం చేజారింది

లండన్ : జమైకా చిరుత చిట్టచివరి పరుగు వేటలో కుప్పకూలింది. ఏళ్లతరబడి ఎక్కడైతే తిరుగులేని ఆధిపత్యం చెలాయించిందో అక్కడే అడుగు కూడా ముందుకు వేయలేని నిస్సహాయ స్థితికి చేరింది. ఎప్పుడూ తాను అధిగమించే సహచరులు ఈ సారి తనను దాటిపోతుంటే కన్నీళ్లతో చూడటానికే పరిమితమయ్యింది. పరుగుల రారాజు ఉస్సేన్ బోల్ట్‌కు పట్టిన ఈ స్థితికి ట్రాక్ కూడా కన్నీళ్లు పెట్టింది. జమైకా చిరుత చివరి పరుగుని కళ్ళారా చూడాలని స్టేడియానికి పోటెత్తిన క్రీడాభిమానులు నిశ్చేష్టులైపోయారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున జరిగిన 4X100 రిలే తుది పరుగులో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ పరుగు చూస్తున్న వారందరిలోనూ ఒకటే ఉత్కంఠ! తనదైన శైలిలో ఫినిషింగ్ లైన్‌కు చేరుకుని భుజాల మీదుగా ప్రత్యర్థులను వెనక్కి ఒక్క సారి చూసి, అలవాటుగా బోల్ట్ చేసే విజయనాదం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. ట్రాక్‌మీద అప్పటికే సిద్ధంగా ఉన్న బోల్ట్‌లో కూడా అదే జోష్! అచ్చంగా వేటకు దూకబోయే చిరుతలాగా, ఒక్క అడుగు వెనక్కి వేసి చివరి పరుగును విజయవంతంగా ముగించడానికి సిద్ధంగానే కనిపించాడు. ఆ ఊపులోనే సహచర క్రీడాకారుడినుండి బ్యాటన్ అందుకున్నాడు. బోల్ట్ చేతికి బ్యాటన్ అందగానే స్టేడియం నిండా కేరింతలు! బోల్ట్‌ను ఉత్సాహపరుస్తూ అరుపులు. ఫినిషింగ్‌లైన్‌ను తాకడానికి ఇక కొన్ని క్షణాలే ఉన్నాయి! కానీ, దూసుకుపోవాల్సిన బోల్ట్ అడుగు తడబడింది! పరుగులో వేగం సన్నగిల్లింది! ఒకరి తరువాత ఒకరు సహచరులు అధిగమిస్తున్నా, చివరి క్రీడాకారుడు కూడా తనను దాటిపోతున్నా బోల్ట్ మళ్లీ పుంజుకోలేకపోయాడు. కండరాలనొప్పి బోల్ట్‌ను కదలనీయకుండా చేసింది. అతి కష్టంమీద రెండు మూడు అడుగులు మాత్రమే వేసి ట్రాక్‌పై కుప్పకూలిపోయాడు. అంతే! అభిమానుల ఉత్సాహం ఆవిరైపోయింది. తమ కళ్లను తామే నమ్మలేక పోయారు. ట్రాక్‌పై కుప్పకూలిన బోల్ట్‌ను వీల్‌ఛైర్‌లో తరలించాలని తొలుత భావించారు. అయితే, జమైకా క్రీడాకారులు దీనికి భిన్నంగా స్పందించారు. చివరి రేసులో పాల్గొన్న బోల్ట్ సహచరులు ఆయన భుజాల మీద చేతులు వేసి, చిన్నగా ఫినిషింగ్ లైన్ దాటించారు. అలా తాను పాల్గొన్న చిట్ట చివరి రేసును అందరికన్నా చివరిగా బోల్ట్ ముగించాడు. గాయాలతో బోల్ట్ ఓటమి పాలుకావడం ఇదే మొదటి సారి. ఇదే చివరిసారి కూడా! మానవ చిరుత చివరి పరుగు ఇలా ముగియడం క్రీడాభిమానుల్ని షాక్‌కు గురిచేసింది. దీంతో బ్రిటన్ చెందిన మిచెల్ బ్లాక్ అథ్లెట్ 37.47సెకన్లతో లక్ష్యాన్ని పూర్తిచేసి స్వర్ణం సాధించగా,37.52 సెకన్లతో అమెరికా రజతంను, పామెలా డ్యుటివెజిక్ కాంస్యంను సాధించారు.


కన్నీరు పెట్టించేలా..

గాయం కారణంగా పరుగు ఆపేసి కుప్పకూలిన బోల్ట్‌ను అతని సహచరులు తమ భుజాలపై బోల్ట్ చేతులు వేసుకొన్న మెక్‌లాండ్,జూలియన్ బ్లేక్, రోజ్ అతనికి తమిస్తూ పరుగు పూర్తి చేయించారు. సన్నివేశంతో స్టేడియంలోనే అభిమానులంతా బావోద్వేగంతో కదిలిపోయారు. బోల్ట్ చివరి పరుగు వూహలకు అందని రీతిలో ముగిసి.. ఎప్పటికీ మర్చిపోలేనిదిగా మిగిలిపోయింది. పరుగు ముగించిన తర్వాత బోల్ట్ తీవ్ర బావోద్వేగానికి గురయ్యాడు. కళ్ల నిండా నీళ్లతో బోల్ట్ అభిమానులకు వీడ్కోలు చెబుతున్న దృశ్యం చూపరులను కంటతడి పెట్టించింది.

నాలుగు సార్లే పతకం తేలేకపోయాడు...

ఎప్పుడూ బంగారు పతకం సాధించి అభిమానులను ఉర్రూతలూగించే బోల్ట్ 2008 నుంచి కేవలం నాలుగు సార్లు మాత్రమే విజయాన్ని అందుకోలేకపోయాడు. అయితే గాయంతో వెనుదిరగడం ఇదే మొదటిది.. చివరి సారి కూడా..ఫాల్స్ స్టార్స్ వల్ల ఓ సారి, తన సహచరులు డోపింగ్ పరీక్షలో విఫలం కావటంతో మరోసారి.. ఇటీవల 100 మీటరు పరుగులో మూడో స్థానంలో నిలిచి కాంస్యంతో ముగించాడు. తన చివరి పరుగును కాలి కండరాల పట్టేసి అందరిలోనూ కన్నీళ్లను తెప్పించేలా చేశాయి.






భావోద్వేగానికి గురవుతున్న బోల్ట్

జమైకన్ పరుగుల యంత్రం ఉసేన్ బోల్ట్ చివరి పరుగు కన్నీటితో ముగిసింది. స్వర్ణ పతకంతో కోటాను కోట్ల అభిమానులకు వీడ్కోలు చెప్పాలనుకున్న అతని పరుగుకు కాలి కండరాలు అడ్డుగోడగా నిలిచి చివరి మజిలిలో కుప్పకూల్చేశాయి. దీంతో 4X400 మీటర్ల రిలేలో దేశానికి స్వర్ణం అందించి అథ్లెట్‌గా విజయ గర్వంతో విరామం తీసుకోవాలనుకున్న ఆశల సౌధం కూలిపోయింది. ఉత్త చేతులతో.. కన్నీళ్లతోను ఉద్వేగంగా వీడ్కోలు చెప్పాల్సి వచ్చింది.

కెరీర్‌లో ఓవరాల్‌గా పతకాలు
23 స్వర్ణాలు 5 రజతాలు ఓ కాంస్యం

- ఒలింపిక్స్ గేమ్స్‌లో 8 స్వర్ణాలు
- ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌ల్లో 11 స్వర్ణాలు, రెండు రజతాలు, ఓ కాంస్యం
- ప్రపంచ రిలే ఛాంప్‌ల్లో ఓ రజతం
- కామన్‌వెల్త్,సిఎఎస్‌ల్లో ఓ రజతం, ఓ కాంస్యం
- వరల్డ్ జూనియర్స్ ఛాంప్‌లో ఓ స్వర్ణం, రెండు రజతాలు
- వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్‌లో ఓ స్వర్ణం





టాప్‌లేపిన గుజరాత్

జైపూర్‌పై జయభేరి

అహ్మదాబాద్ : కొత్త జట్టుగా బరిలో దిగిన గుజరాత్ జట్టు ప్రొ కబడ్డీలో టాప్‌లేపుతోంది. వరుస విజయాలతో జోన్ ఎలో అగ్రస్థానంలో కొన సాగుతోంది. డిఫెండింగ్ ఛాంప్ జైపూర్‌పై 27-20 పాయింట్లతో జయకేతనం ఎగుర వేసింది. గుజరాత్ ఫార్చ్యూన్స్‌జెయింట్స్, జైపూర్ పింక్ పాంథర్స్‌జట్ల మధ్య ఆదివారం రెండో మ్యాచ్ జరిగింది. తొలి అర్ధభాగం ముగిసేటప్పటికి ఇరు జట్లు 10-10 పాయింట్లతో సమ ఉజ్జీలుగా నిలిచాయి. రెండో అర్ధభాగంలో నెమ్మదిగా వ్యూహాత్మక దాడులతో గుజరాత్ బరిలో దుమ్మురేపింది. భారీ పాయింట్ల ఆధిక్యంతో ప్రత్యర్థికి చివరికంటూ అందని ఎత్తులో నిలిచింది. జెయింట్స్ జట్టులో సచిన్ 7 పాయింట్లు, ఫాజిల్ 4 పాయింట్లుతో చెలరేగారు.

ఖపట్నా, యూపి మ్యాచ్ డ్రా

ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో పట్నా పైరేట్స్, ఉత్తరప్రదేశ్ యోధా జట్ల మధ్య నువ్వానేనా అన్న రీతిలో సాగిన మ్యాచ్ డ్రా ముగిసింఇ. ఇరుజట్లు 27-27తో సమ ఉజ్జీలుగా నిలవడంతో మ్యాచ్ టై అయ్యింది. పట్నా జట్టులో ప్రదీప్ నర్వాల్ 9 పాయింట్లు, విశాల్ మానే 3,మోను గోయట్ 8 పాయింట్లతో సత్తా చాటారు. కాగా యూపీ జట్టులో కెప్టెన్ నితిన్ తోమర్ అద్భుత ప్రతిభతో 8 పాయింట్లతో జట్టును ఓటమి నుంచి గట్టెక్కించాడు.

పాండ్య, కులీదీప్ సత్తా

- సిరీస్ క్లీన్‌స్వీప్‌కు 9 వికెట్లు
- ఎదురీదుతున్న లంకేయులు

పల్లెకలె : శ్రీలంక పర్యటనలో సిరీస్ వైట్‌వాష్‌కు విరాట్ సేన 9 వికెట్ల దూరంలో నిలిచింది. 487 పరుగుల భారీ స్కోర్ వద్ద భారత్ ఇన్నింగ్స్ ముగిసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు లంకను కేవలం 37.4 ఓవర్లలో 135 పరుగులకే భారత్ బౌలర్ల కుప్పకూల్చేశారు. దీంతో చండీమాల్ సేన ఫాల్ ఆన్ ఆడింది. రెండో ఇన్నింగ్‌సలో ఓపెనర్ తరంగను 7 పరుగుల వద్ద ఉమేష్ ఔట్ చేశాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 19/1 పరుగులు చేసింది. కరుణ రత్నే 12, పుష్పకుమార పరుగులేమి చేయకుండా క్రీజులో నిలిచారు. ఎదురీదుతున్న లంకేయులు ఓటమి కోరల నుంచి తప్పించుకోవాలంటే ఇంకా 333 పరుగులను చేయాల్సి ఉంది.

పాండ్య శతక్కొట్టుడు ..
4 వికెట్లు తీసిన కులీదీప్..

కీలకమైన మూడో టెస్ట్‌లో రెండో రోజు లంకేయులపై భారత్ పూర్తిస్థాయి ఆధిపత్యం సాధించింది. దీంతో బౌలర్లు మూడో రోజు సత్తా చాటితే మంగళవారమే భారత్ సిరీస్ ఖాతాలో జమచేసుకోనే అవకాశం ఉంది. 329/6 రెండో రోజు బ్యాటింగ్ ఆరంభించిన భారత్‌కు ఏడో వికెట్ రూపంలో సాహా 16 పరుగుల వద్ద ఔటయ్యాడు. ఈ దశలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య దూకుడైన ఇన్నింగ్స్‌తో లంక బౌలర్లపై విరుచుకపడ్డాడు. తొలి శతకంతో సత్తా చాటాడు. సందకన్ వేసిన ఓ ఓవరలో రెండు ఫోర్లు, మూడు సిక్స్‌లతో చెలరేగిన పాండ్య ఒక్క ఓవర్‌లో 26 పరుగులను అత్యధికంగా చేసిన బ్యాట్స్‌మెన్ రికార్డుకెక్కాడు. ఎనిమిది పోర్లు, ఏడు సిక్స్‌లతో గ్రౌండ్ అదిరేలా బాదేశాడు. కెప్టెన్ విరాట్ నమ్మకాన్ని నిలబెట్టుకుని జట్టులో ఎనిమిదో బ్యాట్స్‌మెన్ లోటును పూరించాడు. కులీదీప్ 26, షమీ 8లు త్వరగానే ఔటయ్యారు. ఉమేష్‌తో కలిసి పాండ్య జట్టు భారీ స్కోర్‌కు చివర్లో బాటలు వేశాడు. జట్టు స్కోర్ 487 వద్ద 108 పరుగుల వద్ద సందకన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. కెప్టెన్ చండీమాల్ 48 పరుగులతో ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు.



పాండ్యా 108 పరుగులు

శ్రీలంక వన్డే సిరీస్‌కు యూవీకి నో

- జట్టులో శార్థూల్, మనీష్, రాహుల్

న్యూఢిల్లీ : శ్రీలంకతో ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే ఐదు వన్డేల సిరీస్‌తో పాటు ఓ టి 20 మ్యాచ్‌కు సీనియర్ బ్యాట్స్‌మెన్ యువరాజ్ సింగ్‌కు చోటు దక్కలేదు. చాలా కాలం తర్వాత ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో కేవలం 53 పరుగులే చేయడంతో అతన్ని తీసుకోలేదు. ఫాస్ట్ బౌలర్ షమీ, ఉమేష్ యాదవ్, స్పిన్నర్లు అశ్విన్, జడేజా, దినేష్ కార్తీక్, రిషబ్ పంత్‌కు విశ్రాంతి ఇచ్చారు. దీంతో ఓపెనర్లుగా శిఖర్, రాహుల్, రోహిత్, మనీష్ పాండేలు, మిడిల్ ఆర్డర్‌లో రహానే, జాదవ్, ధోనీ, పాండ్యలు బరిలో దిగనున్నారు. సీమ్ బౌలర్లుగా భువనేశ్వర్, బుమ్రా, శార్థూల్ ఠాకూర్‌లు చోటు దక్కించుకున్నారు.

భారత్ జట్టు ఇదే : కోహ్లీ(కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, కెఎల్ రాహుల్, మనీష్ పాండే, రహానే, కేదారీ జాదవ్, ధోనీ, హ్యార్థిక్ పాండ్య, అక్షరపటేల్, కులీదీప్ యాదవ్, యజువేంద్ర చాహల్, జెజె బుమ్రా, భువనేశ్వర్ కుమార్, శార్థూల్ ఠాకూర్

దావిందర్..12వ స్థానంతో సరి..



లండన్ : ప్రపంచ అథ్లెటిక్స్‌లో భారత్ పతకం ఆశలు ఆవిరయ్యాయి. 25 మంది అథ్లెట్లతో కూడిన బృందం లండన్‌కు పయనం కాగా ఎనిమిదో రోజు జావెలిన్ త్రోలో పంజాబ్‌కు చెందిన త్రోయర్ దావిందర్ సింగ్ కంగ్ ఫైనల్స్ కు అర్హత సాధించి చరిత్ర సృష్టించాడు. అయితే కీలకమైన ఫైనల్స్‌లో కనీసం దూరం కూడా జావెలిన్ విసరలేక పోయిన 13 మంది ఫైనలిస్టుల్లో 12వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఫైనల్స్‌లో కేవలం 80.02 మీటర్లను మాత్రమే దావిందర్ సింగ్ విసిరాడు. తొలుత 75.40 మీటర్లత్రో విసిరాడు. ఆ తర్వాత రెండో ప్రయత్నంలో గీత దాటేశాడు. మూడో త్రోలో 80.02 మీటర్లు త్రో చేయగలిగాడు. మూడింటిల్లో విఫలం కావడంతో టాప్-8 మంది పోటీల్లో కొనసాగారు. ఈ విభాగంలో జోహెన్నాస్ వెటర్ (జర్మనీ) 89.89 మీటర్లతో స్వర్ణం, వాదిలెజెహ్ 89.73 మీటర్లు, పీటర్ ఫ్రైడ్రిఇచ్ 88.23 మీటర్లు(చెక్) వరుసగా రజత, కాంస్యాలను సాధించారు.

పేస్ పేరు ప్రస్తావించేనా

నేడు డేవిస్‌కప్ జట్టు ఎంపిక



న్యూఢిల్లీ : కెనడాతో సెప్టెంబర్‌లో జరిగే డేవికప్ కప్ ప్రపంచ గ్రూప్ ప్లే ఆఫ్ పోరులో తలపడే భారత్ జట్టుకు 44 ఏళ్ల వెటరన్ టెన్నిస్ క్రీడాకారుడు లియాండర్ పేస్ పేరు ప్రస్తావనకొస్తుందా అన్న చర్చ సాగుతోంది. ఏప్రిల్‌లో బెంగళూరు వేదికగా ఉజ్బెకిస్తాన్‌తో జరిగిన పోరుకు ఆరుగురు సభ్యులతో కూడిన జట్టులో పేస్‌కు చోటు కల్పించారు. 18 సార్లు గ్రాండ్ టైటిళ్లను సాధించిన పేస్‌కు తుది జట్టులో మళ్లీ తీసుకుంటారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. టాప్ సింగిల్స్ ప్లేయర్స్‌గా యూకీ బాంబ్రీ, సాకేత్ మైనేని ఇటీవల దూసుకొచ్చారు. దీంతో సోమవారం ఆలిండియా టేబుల్ టెన్నిస్ సెలక్షన్ కమిటీ త్రిసూర్‌లో సమావేశం కానుంది. డబుల్స్‌లో రోహన్ బోపన్న (21), దివిజ్ శరణ్(53), పూరా రాజా (54)కు పేస్ కంటే ముందంజలో ఉండటంతో పేస్‌ను తీసుకునే అవకాశాలు తక్కువనే చెప్పాలి.

మీరాజ్-రేష్మి జంటకు స్వర్ణం

ముగిసిన ఆసియా షూట్‌గన్ ఛాంప్



కజకిస్తాన్ : భారత షూటర్లు స్వర్ణంతో ఆసియాన్ ఛాంపియన్ షిప్ షూటగన్‌కు ఘనమైన ముగింపు ఇచ్చారు. పోటీలు చివరి రోజు స్కీట్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత షూటర్ల జంట మీరాజ్ అహ్మద్ ఖాన్, రేష్మి రాథోడ్‌లు స్వర్ణంతో సత్తా చాటారు. ఇండియన్ ద్వయం చైనీస్ జంట లియ్ జియాంచి, గావో జియ్నామిపై 28-27తో అద్భుత ప్రతిభను చాటి అదిరే ముగింపునిచ్చారు. సెమీస్ రేసులో 10 టీమ్‌లు తలపడగా మీరాజ్- రేష్మిలు 93 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచారు.సెమీస్‌లో భారత్ కజకిస్తాన్ టీమ్‌పై 28-27తో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది.దీంతో ఈ ఛాంపియన్‌షిప్‌లో 8 పతకాలను భారత్ కైవసం చేసుకుంది. తొలుత అంకుర్ మిట్టల్ డబుల్ ట్రాప్‌లో టీమ్ స్వర్ణం సాధించిన విషయం తెల్సిందే. ఈ నెల 30 నుంచి మాస్కోలో జరిగే షూట్‌గన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మంచి ఫలితాలు సాధించడానికి ఆసియా ఛాంపియన్‌షిప్ దోహదపడింది.

పోకిరీల కట్టడికి పోలీస్ చెక్

- మహిళల వేధింపులపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర వ్యాప్తంగా షీ టీమ్స్
- ప్రత్యేక మహిళా పోలీస్ విభాగాలు



యువతకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు (ఫైల్)

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా మహిళల వేధింపులపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యంగా రాజధాని విజయవాడ, గుంటూరులతో పాటు రాష్ట్రంలోని ప్రముఖ నగరాల్లో ఈవ్ టీజర్స్ పని పట్టేందుకు ప్రత్యేక మహిళా బృందాల్ని రంగంలోకి దింపారు. కళాశాలలు, బస్టాప్‌లు, షాపింగ్‌మాల్స్‌తో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో విద్యార్థినులను, మహిళలను సూటిపోటి మాటలతో వేధిస్తున్న పోకిరీలను తమదైన శైలిలో కట్టడి చేస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే స్పందించకుండా ప్రణాళికా బద్ధంగా ఈవ్ టీజర్స్ పని పడుతున్నారు. నిందితుల్లో విద్యార్థులు, కొన్నిసార్లు మైనర్లు కూడా ఉండటంతో మొదటి దశలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలోనే కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. కుటుంబ విలువలు, మహిళలను గౌరవించాల్సిన ఆవశ్యకతను వారికి వివరిస్తున్నారు. కౌన్సిలింగ్ తర్వాత కూడా మారకపోతే వారిని జైళ్లకు పంపిస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా షీ టీమ్స్

మహిళలను రక్షించేందుకు ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లో విజయవంతమైన షీ టీమ్స్‌ను ఆదర్శంగా తీసుకొని ఇక్కడ కూడా ప్రత్యేక మహిళా దళాలను రంగంలోకి దించారు. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి వంటి ప్రాంతాల్లో ప్రత్యేక మహిళా పోలీస్ సిబ్బంది ఈవ్ టీజర్ల ఆట కట్టిస్తున్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. కళాశాలకో, కార్యాలయానికో వెళ్లడానికి ఇంటి నుంచి కాలు బయట పెట్టింది మొదలు రాత్రి ఇంటికి చేరుకునే వరకు మహిళలు వివిధ రూపాల్లో వేధింపులు ఎదుర్కొంటూనే ఉన్నారు. అభద్రతా భావంతో కొందరు, భయంతో మరి కొందరు, భవిష్యత్తు నాశనం అవుతుందని ఇంకొందరు, ఇటువంటివి తెలిస్తే తమ ఇంట్లో వాళ్లు బయటకు పంపరేమోనని మరికొందరు వేధింపులను భరిస్తూనే ఉన్నారు. ఈ మధ్యకాలంలో లైగింక వేధింపులు ఎక్కువ కావడంతో తీవ్రంగా పరిగణించిన పోలీస్ శాఖ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యింది. అన్యాయాన్ని బాధితులు నిర్భయంగా చెప్పేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఓ పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు.

ప్రత్యేక వాట్సఅప్ నంబర్

మహిళా వేధింపుల నిరోధానికి ప్రత్యేక వాట్స్‌అప్ నంబర్‌ను ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ వద్ద ఎప్పట్నించో ప్రతిపాదన ఉన్నా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఎటువంటి ఫిర్యాదునైనా 1100 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని అధికారులు చెబుతున్నా లైంగిక వేధింపుల నివారణ కోసం ప్రత్యేక వాట్స్‌అప్ నంబర్‌ను ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు. అదే విధంగా పాఠశాలల నుంచి ప్రైవేట్ ఆఫీసులు వరకు మహిళల్లో భయాందోళనలు తగ్గించి వేధింపుల పట్ల అవగాహన కలిగించడానికి ప్రత్యేక తరగతుల్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందంటున్నారు.

ప్రత్యేక మహిళా పోలీస్ విభాగాల ఏర్పాటు

రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాలతో పాటు రాజమండ్రి, గుంటూరు, తిరుపతి అర్బన్ పోలీస్ యూనిట్లలో ప్రత్యేక మహిళా పోలీస్ విభాగాల్ని ఏర్పాటు చేయనున్నారు. భాదితుల నుంచి ఫిర్యాదులందిన తక్షణమే స్పందించడంతో పాటు వేధింపులు ఎక్కువగా జరిగే ఆస్కారమున్న ప్రాంతాల్లో మహిళా పోలీసులు మఫ్టీలో ఉండి ఆకతాయిల ఆటకట్టిస్తారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఐ క్విక్, ఫోర్త్ లైన్ వంటి పోలీస్ యాప్స్‌ను మరింతగా మహిళలకు చేరువ చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అన్ని వర్గాల మహిళలనూ వేధింపుల నుంచి రక్షించేందుకు పోలీస్ సేవల్ని అందించాలనే లక్ష్యంతో మెట్రో పాలిటన్ నగరాల నుంచి చిన్న చిన్న టౌన్‌లు, మండల స్థాయి కేంద్రాలు, గ్రామాల వరకు ప్రత్యేక మహిళా పోలీస్ విభాగాల సేవల్ని విస్తరించడానికి పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది.



జిమ్నాస్టిక్స్ అండర్-14లో గుంటూరు, విశాఖ ఫస్ట్

- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

ఏపి జిమ్నాస్టిక్ అండర్-14 బాలుర విభాగంలో గుంటూరు జిల్లా తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. కడప, తూర్పుగోదావరి జిల్లాలో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. బాలికల విభాగంలో విశాఖ జిల్లా మొదటి స్థానంలో నిలవగా కడప రెండో స్థానంలో నిలిచింది. ఏపి జిమ్నాస్టిక్ అసోసియేషన్, ఎలైట్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఈనెల 11 నుంచి 13 వరకూ నిర్వహించిన ఏపి ఇంటర్ డిస్ట్రిక్ట్ జిమ్నాస్టిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఆల్‌రౌండ్ ఛాంపియన్ షిప్‌లో కెఎస్ఎన్ సాయిచరణ్ (గుంటూరు), జి.విశ్వతేజ (కడప), బి.నిఖిలేష్ (తూర్పుగోదావరి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. బాలికల్లో యు.హరిణి ప్రియ (విశాఖ), ఎలిజబెత్ (కడప), కె.పద్మజ (కడప) తొలి, రెండో స్థానంలో నిలిచారు. జూనియర్స్ విభాగంలో ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్ ఎ.కిరణ్‌కుమార్ (గుంటూరు), ఎం.శ్రీనివాస్ (గుంటూరు), పి.సాయిదుర్గ (కడప) ఒకటి, రెండు, మూడు స్థానాలను సాధించగా, సీనియర్స్ బాలికల పోటీల్లో బి.కవిత (గుంటూరు), ఎస్‌కె యాసిన్ (కృష్ణా), ఎస్.తరుణ్ (కడప) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. చివర్లో జరిగిన మెన్ ఫైనల్‌లో ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్ ఎ.దొర (విశాఖ), కె.సురేష్ (తూర్పుగోదావరి), పి.శ్రీహర్ష (ప్రకాశం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. క్రీడాకారులు తమ వ్యక్తిగత నైపుణ్యాన్ని, ప్రతిభను చాటిన విజేతలకు ఓఎన్‌జిసి ఇడి అలోక నంద, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.శ్రీరామరాజు బహుమతులు ప్రదానం చేశారు. అంతకు ముందు పోటీల ముగింపు సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడారు. ఓఎన్‌జిసి నుంచి జిమ్నాస్టిక్స్‌కు సహాయ సహకారాలందిస్తున్నామని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు ముంగులూరి విశ్వేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి ఎస్‌వి శివప్రసాద్, ఎలైట్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68